

ఆంధ్రభూమి



సంపుటి: 30 . సంచిక: 223 | విజయవాడ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | శనివారం 12 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం - దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ సప్తమి సా.6.40
నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.7.13
వర్జ్యం: రా.7.57 నుండి 9.38 వరకు
విశేషాలు: భానుసప్తమి
దుర్ముహూర్తం: సా.04.24 నుండి 05.12 వరకు
రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు

ఏపీకి హోదా ఖాయం

- కేంద్రంలో అధికారం మాదే
- మోదీవన్నీ అమలుకాని మాటలే
- దుబాయ్‌లో కాంగ్రెస్ చీఫ్ రాహుల్

దుబాయి, జనవరి 11: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. రెండు రోజుల దుబాయి పర్యటనకు వచ్చిన రాహుల్ శుక్రవారం భారతీయ కార్మికులతో భేటీ అయ్యారు. దుబాయిలోని లేబర్ కాలనీలో కార్మికులను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు.'కేంద్రంలో మా ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. ఏపీకి ప్రత్యేక హోదా కచ్చితంగా ఇస్తాం'అని ఆయన వెల్లడించారు. 2014 జూన్ 2న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాయి. 'బతుకుదెరువుకోసం దుబాయి వచ్చిన మీరు భారత్ అభివృద్ధికి తోడ్పాటును అందించడం సంతోషదాయకం. ఈవిషయంలో మీమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను'అని కాంగ్రెస్ అధ్యక్షుడు స్పష్టం చేశారు. యూఏఈ అభివృద్ధిలోనూ భారతీయ కార్మికుల కృషిని ఆయన ప్రశంసించారు. 'యూఏఈలో ఇక్కడ ఆకాశ హర్మ్యాలు, పెద్దపెద్ద విమానాశ్రయాలు, మెట్రో నిర్మాణాలు మీ కృషితోనే జరిగాయి. మీ చెమట, రక్తం, కాలాన్ని ధారబోసి - మిగతా 6లో

కోడికత్తి కేసు నిందితుడికి 25 వరకు రిమాండ్

- ఎన్‌ఐఏ కస్టడీకి ప్రత్యేక కోర్టు అనుమతి
- విజయవాడకు మారిన విచారణ



నిందితుడు శ్రీనివాసరావును కోర్టుకు హాజరుపరుస్తున్న పోలీసులు

విజయవాడ (క్రైం), జనవరి 11: ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు విచారణ విజయవాడకు చేరింది. అనేక పరిణామాల అనంతరం కేసు రాష్ట్ర పోలీసుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) చేతుల్లోకి వెళ్లాక అధికారులు విచారణ ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా ఈ కేసులోని నిందితుడు జనపల్లి శ్రీనివాసరావును ఎన్‌ఐఏ అధికారులు విశాఖపట్నం నుంచి తీసుకువచ్చి శుక్రవారం విజయవాడలోని ప్రత్యేక కోర్టు మెట్రోపాలిన్ సెషన్స్ జడ్జి న్యాయస్థానంలో హాజరుపరిచారు. విశాఖ ఎయిర్‌పోర్టు లాంజ్‌లో జగన్‌పై కోడి కత్తి దాడి అనంతరం ఈ కేసులో నిందితునిగా శ్రీనివాసరావును స్థానిక పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కేసు - మిగతా 6లో

మావోయిస్టు కొరియర్ అరెస్ట్


పిస్టల్, ఆరు బుల్లెట్లు స్వాధీనం

మహబూబాబాద్, జనవరి 11: మావోయిస్టు పార్టీ కొరియర్‌గా పనిచేస్తున్న బత్తుల ప్రకాష్ అలియాస్ ప్రదీప్‌ను శుక్రవారం మహబూబాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి పిస్టల్, ఆరు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన బత్తుల ప్రకాష్‌ను ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి విలేఖరుల ఎదుట హాజరుపరిచారు. ప్రకాష్ అరెస్ట్ వివరాలను ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి విలేఖరులకు తెలిపారు. బత్తుల ప్రకాష్ అలియాస్ ప్రదీప్ 0.32 పిస్టల్, ఆరు తూటాలతో మావోయిస్టు నేత హరిభూషణ్‌ను కలవడానికి వెళ్తుండగా కొత్తగూడ మండలంలోని గుంజెడు ముసలమ్మ ఆలయం వద్ద పోలీసులకు చిక్కినట్లు తెలిపారు.

- ప్రజలకు సంక్రాంతి కానుక

పింఛన్ ఇక.. రూ.2 వేలు

- జనవరి నుండే అమలు
- ప్రతి ఇంటికీ స్మార్ట్ ఫోన్
- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ
- నియంతలా వ్యవహరిస్తున్న ప్రధాని
- జన్మభూమి ముగింపు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు



నెల్లూరు జిల్లా దామవరం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సంబంధించి పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

ఆంధ్రభూమి బ్యూరో

నెల్లూరు, జనవరి 11: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు వరాల జల్లు కురిపించారు. జనవరి నెల నుండి సామాజిక భద్రతా పింఛన్ల కింద ఇస్తున్న రూ.వెయ్యిని రూ.2వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరిలో ఇవ్వబోయే పింఛన్లలో జనవరి నెలలో ఇవ్వాల్సిన రూ.వెయ్యి కలిపి మొత్తం రూ.3వేలు అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 54లక్షల మంది దీని వలన లబ్ధిపొందుతారని తెలిపారు. నెల్లూరు జిల్లా బోగోలులో శుక్రవారం జరిగిన 6వ విడత జన్మభూమి-మా ఊరు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక స్మార్ట్‌ఫోన్ ఇవ్వబోతున్నామని, ఆ దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రం ఆర్థికంగా ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రజల భద్రత కోసం తాను పింఛను నగదు మొత్తాన్ని పెంచేందుకు నిర్ణయం తీసుకున్నానన్నారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ కింద అందించే వైద్యచికిత్సల మొత్తాన్ని రూ.5లక్షలకు పెంచుతానని, ఏప్రిల్ నుండి ఇది అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. మహిళలకు రక్ష పథకాన్ని ఈ సందర్భంగా ఆయన బోగోలులో ప్రారంభించారు. 8,9,10 తరగతులకు వెళ్లే 6లక్షల మంది బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందచేస్తున్నామని, మహిళలకు కూడా రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ కింద నాప్‌కిన్‌లను అందించబోతున్నామని వెల్లడించారు. గోదావరి-పెన్నా అనుసంధాన రెండో విడత పనులకు కూడా త్వరలో టెండర్లు ఆహ్వానిస్తామని తెలియచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి సొంతింటి కల నిజం చేస్తానని హామీనిచ్చారు. రుణమాఫీ కింద రైతులకు ఇవ్వాల్సిన మిగిలిన మొత్తాన్ని ఈనెలలోనే 10శాతం వడ్డీ వేసి మరీ అందచేస్తామని స్పష్టం చేశారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నీటిపైపు లైను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. 2వేలు జనాభా దాటిన అన్ని గ్రామాల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థలను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్రం మొత్తం సిసి కెమెరాల గుప్పిట్లో ఉందని, ఎక్కడ ఏ నేరం జరిగినా సత్వరమే నిందితులను పట్టుకునే వ్యవస్థ నెలకొల్పామని ధీమా వ్యక్తం చేశారు. నిరంతరం కష్టపడి, సంపద సృష్టిస్తానని, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రజలకు అందిస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నెల్లూరు - - మిగతా 6లో

54,14,592 మందికి ప్రయోజనం

- మరింతగా 'ఎన్టీఆర్ భరోసా'
- సంక్షేమ చరిత్రలో కొత్త అధ్యాయం
- ఇకపై సాధారణ పింఛన్ రెట్టింపు
- దివ్యాంగులకు రూ. 3వేలు..
- డయాలసిస్ రోగులకు రూ. 3500కు పెంపు

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 11: ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా కింద పేదవర్గాలకు ఇస్తున్న పింఛన్లను రెట్టింపు చేసింది. సంక్రాంతి కానుకగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదవర్గాలకు అందిస్తున్న పింఛన్లను రెట్టింపు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై వృద్ధాప్య, వితంతు, సాధారణ పింఛన్లను వెయ్యి నుంచి రూ 2వేలకు, దివ్యాంగులకు రూ 15 వందల నుంచి 3వేలకు పెరగనున్నాయి. డయాలసిస్ రోగులకు రూ 2500 నుంచి 3500 మంజూరు చేయనున్నారు. ఈ ఏడాది జనవరి నుంచే పెంచిన పింఛన్లు అందజేయాలని - మిగతా 6లో

ప్రపంచం చూపు.. నవ్యాంధ్ర వైపే!

- ఎన్టీఆర్ జీవితం నేటితరానికి ఆదర్శం
- బయోపిక్‌లో బాలయ్య నటన అద్భుతం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్

6



కడప పెద్దదర్గాల్లో ప్రార్థనలు చేస్తున్న జగన్

సొంత జిల్లాకు చేరుకున్న జగన్

- కడప పెద్దదర్గాలో ప్రార్థనలు
- అడుగడుగునా అభిమానుల నీరాజనాలు

6



మళ్లీ మోదీయే ప్రధాని

- ఎన్‌డీఏ గెలుస్తుందని అమిత్ షా ధీమా
- రామమందిరాన్ని నిర్మించి తీరుతామని స్పష్టీకరణ

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 11: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ ఘన విజయం సాధించి, నరేంద్ర మోదీ రెండోసారి ప్రధాన మంత్రి పదవి చేపడతారని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని రామలీలా మైదానంలో ప్రారంభమైన బీజేపీ రెండు రోజుల జాతీయ సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ 2014 లోక్‌సభ ఎన్నికల్లో సాధించిన దానికంటే ఎక్కువ మెజారిటీతో 2019లో రెండో సారి అధికారంలోకి వస్తామని అన్నారు. మోదీ వర్సెస్ ఇతర అన్ని పార్టీలుగా - మిగతా 6లో

కూటమికి బీటలు!

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో మట్టికరిపించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేస్తున్న మహా కూటమి ఆదిలోనే బీటలు బారింది. సమాజ్‌వాదీ, బీఎస్పీ స్వంత కూటమిని ఏర్పాటు చేసుకుంటుంటే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ కాంగ్రెస్ రహిత కూటమికి కసరత్తు మొదలు పెట్టారు. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి శనివారం రాష్ట్ర రాజధాని లక్నోలో తమ కూటమి, పొత్తుల వివరాలు ప్రకటించే అవకాశం ఉంది. మమతా బెనర్జీ ఈనెల 19 తేదీ నాడు కోల్‌కత్తాలో ఏర్పాటు చేసిన ఎన్‌డీఏ వ్యతిరేక ర్యాలీకి రాహుల్ గాంధీ, సోనియా గాంధీని ఆహ్వానించలేదు. దీనితో కాంగ్రెస్ అధినాయకత్వం దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. మహా కూటమికి ఎస్పీ, బీఎస్పీ, తృణమూల్ కాంగ్రెస్ దూరం కావటం కాంగ్రెస్‌ను ఆందోళనలో పడవేసింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకూడదనే నిర్ణయానికి వచ్చిన ని ఎస్పీ, బీఎస్పీ శనివారం తమ కూటమి గురించి అధికారికంగా ప్రకటించనున్నాయి. 80 లోక్‌సభ సీట్లతో దేశంలోని అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో అఖిలేష్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ, మాయావతి నాయకత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ లక్నోలో తమ ఎన్నికల పొత్తు గురించి అధికారికంగా ప్రకటించనున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు రెండు పార్టీలు సీట్ల సర్దుబాటు చేసుకోవటం తెలిసిందే. దీనికి సంబంధించిన అధికార ప్రకటన లక్నోలో వెలువడనుంది. అఖిలేష్ యాదవ్, మాయావతి విలేఖరుల సమావేశంలో తమ కూటమి గురించి ప్రకటించనున్నాయి. ఎస్పీ, బిఎస్పీతోపాటు అజీత్ సింగ్ నాయకత్వంలోని ఆర్‌ఎల్‌డీ, నిశాద్ పార్టీలు ఈ కూటమిలో సభ్యుల కానున్నాయి. ఎస్పీ 3, బీఎస్పీ 37, ఆర్‌ఎల్‌డీ 3, నిషాద్ పార్టీ రెండు లోక్‌సభ సీట్లలో పోటీ చేసే విధంగా ఈ పార్టీల మధ్య పొత్తు కుదిరినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న అమేథీ, రాయబరేలీ లోక్‌సభ నియోజకవర్గాల్లో అభ్యర్థులను పోటీకి పెట్టకూడదని ఈ కూటమి భావిస్తోంది. అంటే కాంగ్రెస్‌కు కేవలం రెండు సీట్లు మాత్రమే ఇస్తామన్న సంకేతాన్ని పరోక్షంగా పంపింది. ఎస్పీ, బీఎస్పీలు రాష్టానికి చెందిన రెండు చిన్న పార్టీలు, రాష్ట్రీయ లోకదళ్, నిషాద్ పార్టీలను కూడా కలుపుకుపోయేందుకు సిద్ధం కావటంతో కాంగ్రెస్‌కు ఒంటరిపోరు తప్పేలా లేదు. ఇదిలావుంటే తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా పశ్చిమ బెంగాల్ సంబంధించినంత వరకు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునేందుకు సుముఖత చూపించటం లేదు. టీఎంసీ ఈ నెల 19 కోల్‌కత్తాలో ఎన్‌డీఏకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన - మిగతా 6లో



Gripper

20లోగా జనసేన-వామపక్షాల సీట్ల సర్దుబాటు

★ ఇప్పటికే మొదలైన కార్యాచరణ

★ ఎన్నికల తరువాతే మద్దతుపై నిర్ణయం

★ సీపీఎం కార్యదర్శి మధు



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి మధు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 11: రాష్ట్రంలో జనసేన - వామపక్షాల కూటమిలో సీట్ల సర్దుబాటుపై ఈ నెల 20 నాటికి స్పష్టత వస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పీ మధు స్పష్టం చేశారు. విశాఖలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వామపక్షాలు, జనసేన కలసి పోటీచేయాలని నిర్ణయించుకున్నాయని, ఏ పార్టీ ఎక్కడ నుంచి పోటీచేయాలన్న దానిపై సంక్రాంతి అనంతరం 18,19,20 తేదీల్లో చర్చించుకుని తుది నిర్ణయానికి రానున్నట్టు ప్రకటించారు. దీనికి సంబంధించి కార్యాచరణ ఇప్పటికే ప్రారంభమైందన్నారు.

వచ్చే ఎన్నికల్లో ఎవరికి మద్దతివ్వాలన్న అంశం ఫలితాల అనంతరం నిర్ణయిస్తామన్నారు. తమ కూటమి కీలమైన ప్రత్యామ్నాయంగా అవతరిస్తుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కూటమి కాకుండా ఫెడరల్ ఫ్రంట్‌కు ఎటువంటి అవకాశాలు ఉండేపరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో టీడీపీ, కేంద్రంలో బీజేపీ పూర్తిగా ప్రాభవం కోల్పోయాయన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు 2013లో జరిగిన ఎన్నికలు, అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఓట్లు బీజేపీకి కేంద్రంలో అధికారం దక్కించాయన్నారు. తాజాగా ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ ఘోరంగా ఓటమిపాలైందని ఉదహరించారు. ఆయా రాష్ట్రాల్లో దళితులు, ఇతర వర్గాల ఓట్లు ఇటీవల బీజేపీ కోల్పోయిందని, అందుకే అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు తెస్తూ బిల్లు తెచ్చిందన్నారు. ఇది కేవలం ఎన్నికల్లో లబ్దిపొందేందుకేనని విమర్శించారు. అలాగే రూ.40లక్షల వార్షిక టర్నోవర్ వ్యాపారస్తులను జీఎస్టీ నుంచి మినహాయించడం కూడా దీనిలో భాగమేనన్నారు. విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మధు ఆరోపించారు. ప్రత్యేక హోదా సహా, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం సహా కేంద్రీయ విద్యా సంస్థల ఏర్పాటులో తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. చట్టంలో పేర్కొన్న 11 కేంద్ర విద్యాసంస్థలకు రూ.12వేల కోట్లు అవసరం కాగా, నాలుగున్నరేళ్లలో కేవలం రూ.80 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు.

శ్వేతపత్రాలు వట్టి బూటకం

రాష్ట్రాభివృద్ధికి సంబంధించి టీడీపీ ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాలు వట్టి బూటకమని మధు మండిపడ్డారు. లోటు బడ్జెట్‌లో ఉన్నాం, కేంద్రం నిధులు ఇవ్వట్లేదంటూ ఒక పక్క ప్రకటిస్తూనే, మరో పక్క గుజరాత్‌ను మించిపోయే అభివృద్ధి సాధిస్తున్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజను మభ్యపెడుతున్నారన్నారు. చంద్రబాబు హయాంలో రైతుకి న్యాయం జరగదన్నారు. చంద్రన్న కానుకల్లో పంపిణీ చేస్తున్న బెల్లం గుజరాత్ నుంచి కిలో రూ.49కి కొనుగోలు చేస్తున్నారని, అనకాపల్లిలో నాణ్యమైన కిలో బెల్లం రూ.36కి కొనుగోలు చేయట్లేదని, ఇది చంద్రబాబు రైతు వ్యతిరేక విధానమని విమర్శించారు. కేవలం సింగపూర్ కంపెనీలో ఒప్పందాలే అభివృద్ధిగా చంద్రబాబు భావిస్తున్నారని, దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఇక రాష్ట్రంలో విపక్ష వైసీపీ ఘోరంగా విఫలమైందన్నారు. జగన్ అసెంబ్లీని వదిలి పాదయాత్రలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.

ఖమ్మం తెరాసలో విభేదాలు భగ్గు!

ఆంధ్రభూమి బ్యూరో

ఖమ్మం, జనవరి 11: అసెంబ్లీ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర సమితి శ్రేణుల్లో ఆనందాన్ని నింపితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మాత్రం విభేదాలకు ఆజ్యం పోశాయి. రాష్ట్రవ్యాప్తంగా తెరాసకు అన్ని జిల్లాల్లో మంచి ఫలితాలు వచ్చినప్పటికీ ఖమ్మం జిల్లాలో ఒక్కస్థానం మాత్రమే గెలవగా కొత్తగూడెం జిల్లాలో బోణీ కూడా చేయలేకపోయింది. ఈ ఎన్నికలు ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పరిధిలో తెరాసకు ప్రధాన నేతలుగా ఉన్న వారి మధ్య మరింత వైరుధ్యం పెంచాయి. ముఖ్యంగా ఇటీవలి ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులకు, పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలను ఒకరిపై ఒకరు వేసుకుంటూ ఆరోపణలు గుప్పించుకునే పరిస్థితి నెలకొంది. తాజా ఎన్నికల్లో తెరాస సీనియర్ నేతగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు పాలేరు నియోజకవర్గంలో ఓటమిపాలు కావటం పార్టీకి షాకిచ్చింది. తుమ్మల ఓటమి ప్రకంపనలు పార్టీలో ఇంకా సద్దుమణగలేదు. తెరాస అధినేత, ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఖమ్మం జిల్లాలో పార్టీ అభ్యర్థుల ఓటమికి తమ నేతల మధ్య తగాదాలే కారణమని బాహాటంగానే ప్రకటించారు. అదే క్రమంలో ఈవీఎంల ట్యాంపరింగ్ అంశంపై మాట్లాడిన సమయంలో అదే జరిగితే ఖమ్మం జిల్లాలో తుమ్మల గెలిచేవాడని చెప్పుకొచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా తుమ్మల ఓటమి పార్టీ ప్రధాన నాయకులు, కార్యకర్తలను కుంగిదీసింది. అయితే ప్రధాన నేతల మధ్య విభేదాలే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమని తేలిపోయింది. ఇటీవల మాజీ మంత్రి తుమ్మల జిల్లాలో జరగనున్న పంచాయతీ ఎన్నికలపై నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహించిన సమయంలో కొందరు నాయకులు ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఇటీవల పోటీచేసి ఓడిపోయిన మదన్‌లాల్ (వైరా), తాటి వెంకటేశ్వర్లు (అశ్వారావుపేట), పిడమర్తి రవి (సత్తుపల్లి), జలగం వెంకట్రావ్ (కొత్తగూడెం) ఎంపీ వైఖరిపై సీఎం కేసీఆర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలపై విభేదాల ప్రభావం పడే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన నాయకత్వం మండలాల వారీగా ప్రధాన నేతలకు బాధ్యతలు అప్పగించింది. ఇదే సమయంలో సమీక్ష సమావేశాల్లో తుమ్మల గతాన్ని మర్చిపోయి పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునివ్వడమే కాకుండా, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలు తెలిస్తే రాష్ట్ర పార్టీకి నివేదికలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో పర్యటిస్తున్న ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పోడు భూములతో పాటు కొన్ని సమస్యల వల్ల పార్టీ ఓటమి పాలైందని, కొందరు నేతలు ప్రజలకు దూరం కావటం వల్ల కూడా ఈ సమస్య ఎదురైందని వాదిస్తున్నారు.

రైల్వేజోన్ ఇవ్వాల్సిందే

★ డీఆర్‌ఎం కార్యాలయం వద్ద మంత్రి గంటా నిరసన

ఆంధ్రభూమి బ్యూరో



రైల్వేజోన్ ఇచ్చి తీరాలన్న డిమాండ్‌తో పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం భోగీ మంటతో నిరసన తెలియజేసిన దృశ్యం

విశాఖపట్నం, జనవరి 11: విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ డివిజినల్ రైల్వే మేనేజర్ కార్యాలయం వద్ద భోగీ మంట వేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైల్వేజోన్ అంశానికి సంబంధించిన 13వ షెడ్యూల్ ప్రతిని తగులబెట్టి వినూత్నరీతిలో నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. అన్నివిధాలా అవకాశాలు ఉన్న ఇక్కడే జోన్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిని కచ్చితంగా ఇచ్చి తీరాలని, లేనిపక్షంలో తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామంటూ ప్రతినిధులు కేంద్రాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్ళు కావస్తున్నా ఇంకా ఇప్పటికీ దీని గురించి ప్రకటనే చేయకపోవడం రాష్ట్ర ప్రజల్ని మోసిగించినట్టే అన్నారు. ఏపీపై మోదీ ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని విమర్శించారు. 2014న విశాఖలో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ రైల్వేజోన్ గురించి హామీ ఇచ్చారని, ఇపుడు ఆ విషయమే మరచిపోయారన్నారు. ఉత్తరాంధ్ర రక్షణ వేదిక కన్వీనర్ ఎస్ఎస్ శివశంకర్, ఏపీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ఏ రెహ్మాన్, మేధావులు నిరసనలో పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ దర్యాప్తుపై అనుమానాలున్నాయి

విజయవాడ (క్రైం), జనవరి 11: అగ్రిగోల్డ్ కేసుకు సంబంధించి దర్యాప్తు చేసిన వైనం, కంపెనీ ఆస్తులు, అప్పులు, బాధితుల వివరాలు, కీలకమైన డైరెక్టర్ల అరెస్టులు, కోర్టుకు చూపించని ఆస్తుల వివరాలు వెంటనే బహిర్గతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ డిమాండు చేసింది. ఈమేరకు కమిటీ ప్రతినిధి బృందం శుక్రవారం మంగళగిరిలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సీబీ సీఐడీ ప్రధాన కార్యాలయానికి వచ్చి అదనపు డీజీ అమిత్‌గార్గ్‌ను కలిసింది. కేసుకు సంబంధించి సీఐడీ దర్యాప్తు పూర్తయిందని, బాధితులకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వ ప్రతినిధులు అనేకసార్లు తెలియచేస్తున్నారన్నారు. కానీ ప్రభుత్వ ప్రతినిధులు చెబుతున్న మాటలకు కేసు దర్యాప్తుకు పొంతన లేక అగ్రిగోల్డ్ బాధితులు మరింత ఆందోళనకు గరవుతున్నారని ప్రతినిధి బృందం ఆరోపించింది. ఈమేరకు సిఐడి అదనపు డీజీ అమిత్‌గార్గ్‌కు వినతి పత్రం సమర్పించింది. అగ్రిగోల్డ్ కంపెనీ బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టాలని, కనీసం పోలీస్టేషన్లలో నమోదు చేసుకున్న బాధితుల వివరాలైనా తెలియచేయాలని డిమాండు చేశారు.

చంద్రబాబు, జగన్‌కు ప్రత్యామ్నాయం మేమే

ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్

ఒంగోలు అర్బన్/నెల్లూరు టౌన్, జనవరి 11 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యామ్నాయం తామేనని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కెఎ పాల్ అన్నారు. శుక్రవారం ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న 2019 ఎన్నికలు తెలుగుదేశం పార్టీకి అధికారం పగటికలేనన్నారు. అవినీతి నిర్మూలనకు, ప్రజల అభివృద్ధికి, బడుగు, బలహీనవర్గాల వారి శ్రేయస్సే ప్రజాశాంతి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

కేంద్రంలో దేశ ప్రధాని నరేంద్రమోదీకి, రాష్ట్రంలో చంద్రబాబుకు, ప్రతిపక్ష పార్టీ నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రజాశాంతి పార్టీ పనిచేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామన్నారు.

ప్రతి నియోజకవర్గానికి వంద కోట్లు

నెల్లూరు నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీతో పాటు, తెలుగుదేశం పార్టీలను ఓడించడమే ప్రజాశాంతి పార్టీ లక్ష్యమని ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ.కె.పాల్ అన్నారు. గతంలో వై ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఏడాది కంటే ఎక్కువ అధికారంలో ఉండడని, రోశయ్య సీ ఎం అవుతారని చెప్పానని అలాగే జరిగిందని, 2014లోకూడా దేశ ప్రధానిగా నరేంద్రమోదీ అవుతారని, తమిళనాడు సీ ఎంగా జయలలిత అవుతారని తెలిపానని అలాగే జరిగిందని, మరో నాలుగు నెలలు మాత్రమే చంద్రబాబు సీ ఎంగా, ప్రధానిగా నరేంద్రమోదీ కొనసాగుతారని ఆ తరువాత ఇక వారు అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు.

రానున్న ఎన్నికల్లో ప్రజా శాంతి పార్టీ అధికారంలోకి రానుందన్నారు.తాను తన సొంత ఛారిటీ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. 10వేల మందిని తన పార్టీలో సభ్యత్వాన్ని నమోదు చేస్తే వారికి ఎమ్మెల్యే సీటును కేటాయిస్తానని తెలపారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి నియోజకవర్గానికి రూ.100 కోట్లు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తానన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి రూ.17.84 కోట్లు విడుదల

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 11: రాష్ట్రంలో మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖకు 2018-19 విద్యా సంవత్సరానికి గాను రూ.17.84 కోట్లు బడ్జెటు విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఆదిత్యనాథ్ దాస్ జీవో నెం.18 ద్వారా శుక్రవారం ఆదేశాలు జారీ చేసినట్లు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి ఒక ప్రకటనలో తెలయజేశారు. అయితే విద్యార్థులకు రేషన్ బియ్యం అందించడం ద్వారా సరైన పోషకాహార విలువలు గల భోజనం అందడం లేదని, తెలంగాణ తరహాలో ఏపీలో కూడా సన్న బియ్యం అందించి విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనమును అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు ముఖ్యమంత్రి ఆమోదం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 11: జిల్లా పరిషత్, మండల పరిషత్ ఉపాధ్యాయుల అంతర్‌జిల్లా బదిలీలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపినట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 478 మంది ఉపాధ్యాయులు స్పౌజ్, మ్యూచువల్ కేటగిరిలో బదిలీ కానున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ స్కూల్ అసిస్టెంట్‌లు 122 మంది, సెకండరీ గ్రేడ్ కేడర్ 356 మంది బదిలీ కానున్నారు. పాఠశాల విద్యా కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసి కౌన్సిలింగ్ ప్రక్రియ వెంటనే నిర్వహించి, ఉపాధ్యాయులను బదిలీ చేయాలని కోరారు.

బాలకృష్ణ, క్రిష్‌లను సత్కరించిన సీఎం

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 10: ఎన్టీఆర్ కథానాయకుడు చిత్ర హీరో బాలకృష్ణ, దర్శకుడు క్రిష్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సత్కరించారు. ఉండవల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రిని వీరు కలుసుకున్నారు. గురువారం రాత్రి కథానాయకుడు సినిమాను ముఖ్యమంత్రి వీక్షించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తనను బాలకృష్ణ కలవటంతో ఎన్టీఆర్ పాత్రలో అద్భుతంగా నటించారని ప్రశంసించారు. ఎన్టీఆర్ సినిమాను తెరకెక్కించి, మహానటుడి జీవితాన్ని, త్యాగాన్ని, అకుంఠిత కార్యదక్షతను ప్రజలకు అర్థమయ్యేలా చిత్ర రూపమిచ్చిన దర్శకుడు క్రిష్‌ను అభినందించారు.



బాలకృష్ణ, క్రిష్‌లను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గ్రామీణ, గిరిజన ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి లోకేష్

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 11: రాష్ట్రంలో ఐదు వేల గ్రామీణ, గిరిజన ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజితో మార్కెటింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ధేశించిన లక్ష్యాన్ని సాధించడానికి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కృషిచేస్తోందని ఆ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గ్రామీణ ప్రజలు, ఆదివాసీ కుటుంబాల ఆదాయాన్ని ఇతోధికంగా పెంపొందించడానికి వారి ఉత్పత్తులను వివిధ బ్రాండ్ల పేరిట మార్కెటింగ్ చేయడానికి కృషిచేస్తున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నగర పాలక సంస్థ రూ.2.45 కోట్లతో నిర్మించిన బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాన్ని శుక్రవారం రాత్రి మంత్రి లోకేష్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడారు. రాష్ట్రంలో విశాఖ మన్యం గిరిజన రైతులు సాగుచేస్తున్న అరకు కాఫీ నేడు వివిధ దేశాల్లో ప్రాచుర్యం పొందడంతో తోటలు సాగుచేస్తున్న గిరిజనుల ఆదాయం ఇతోధికంగా పెరిగిందన్నారు. అరకు కాఫీ స్ఫూర్తిగా అనేక ఉత్తమ ఉత్పత్తులకు ఐటీడీఏ కృషిచేయాలన్నారు. మల్బరీ సాగుద్వారా గిరిజనుల ఆదాయం హెక్టారుకు రూ.35వేల నుంచి రూ.85వేలకు పెరిగిందన్నారు. దాన్ని రూ.1.5 లక్షలకు పెంపొందించే విధంగా లక్ష్యంగా పెట్టుకుని, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రోత్సాహాన్ని అందిస్తోందని మంత్రి లోకేష్ వివరించారు. ఈ సాగు ద్వారా 50వేల ఆదివాసీ కుటుంబాలకు ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పంచాయతీరాజ్ శాఖకు అనుబంధంగా ఐటీడీఏ ఉత్పత్తులను పెద్ద ఎత్తున తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ఉత్పత్తయ్యే జీడిపప్పునకు బ్రాండ్ ఇమేజ్ తీసుకురావడానికి కలెక్టర్ కార్తికేయ మిశ్రా కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తోందని లోకేష్ పేర్కొన్నారు. గోపీచంద్‌కు భూమి కేటాయించి ప్రోత్సహించినందున ఐదుగురు ప్రపంచ స్థాయి క్రీడాకారులు తయారయ్యారన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల్లోని స్కూళ్ళలో క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నెల్లూరు జన్మభూమి సభలో వృద్ధాప్య, వితంతు తదితర పింఛన్లను రూ.1000 నుంచి రూ.2000కు పెంచారని, వికలాంగ ఫించన్ రూ.1500 నుంచి రూ.3000కు పెంచారని ప్రజల హర్షధ్వనాల మధ్య లోకేష్ ప్రకటించారు. ఇండోర్ స్టేడియం ప్రారంభించిన అనంతరం ఆయన కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు. కార్యక్రమంలో శాసనమండలి ఇన్‌ఛార్జి ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మహ్మణ్యం, ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, మేయర్ పంతం రజనీ శేషసాయి, జడ్పీ ఛైర్మన్ తోట నవీన్, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, శాప్ డైరెక్టర్ యర్రా వేణుగోపాలరాయుడు, జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, గిరిజన కార్పొరేషన్ ఎండీ టి బాబూరావునాయుడు, స్థానిక కార్పొరేటర్ పితాని లక్ష్మీకుమారి పాల్గొన్నారు.



ఇండోర్ స్టేడియం ప్రారంభించి, శాసన మండలి ఇన్‌చార్జి ఛైర్మన్ సుబ్రహ్మణ్యంతో కలిసి బాడ్మింటన్ ఆడుతున్న మంత్రి లోకేష్

బ్రాహ్మీకి చీరలు తీసుకెళ్తా... బిల్లు ఇవ్వండి

కార్యక్రమానికి ముందు చింతూరు తసర్ సిల్క్‌తో తయారుచేసిన చీరలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఆదివాసీలు ఉత్పత్తిచేసిన ఈ చీరలను కొత్తగా ఐటీడీ ఏ ఆధ్వర్యంలో జీసీసీ మార్కెటింగ్ చేస్తోంది. చీరల ఆవిష్కరణ అనంతరం కొన్ని చీరలను తన సతీమణి బ్రహ్మీకి తీసుకెళ్తానని బిల్లు ఇవ్వాలని అధికారులను కోరారు. చీరల డిజైన్లు బావున్నాయని లోకేష్ పేర్కొనడం విశేషం. అనంతరం మంత్రి లోకేష్ కుట్టు శిక్షణ పొందిన డ్వాక్రా మహిళలకు ఉచితం కుట్టు మిషన్లు పంపిణీ చేసి, సర్టిఫికెట్లు అందజేశారు.

ఈబీసీలకు రిజర్వేషన్ మోదీ నాటకం: యనమల

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 11: ఓడిపోతామన్న భయం తప్ప ఈబీసీలపై మోదీకి ప్రత్యేకమైన ప్రేమ ఏమీ లేదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ జిమ్మిక్కులు చేస్తున్నారని, ఎన్ని జిత్తులు వేసినా ప్రజలు ఆయనను నమ్మబోరని శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సంకీర్ణానికి గేట్లు తెరిచామని మోదీ చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. పాత మిత్రులతో దోస్తీకి సిద్ధం అనడం మోదీ దివాళాకోరుతనానికి అద్దం పడుతోందన్నారు. బీజేపీ దుస్థితికి ఆయన ప్రకటన అద్దం పడుతోందని విమర్శించారు. భాగస్వామ్య పక్షాల విశ్వసనీయత కోల్పోయారని, గేట్లు తెరుచుకుని భాగస్వామ్య పార్టీలే వెళ్లిపోయాయని గుర్తుచేశారు. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు అన్నది తాజా జిమ్మిక్కు అని యనమల ఆరోపించారు. 10 శాతం రిజర్వేషన్లను జూలై నుంచి అమలు చేస్తామనడమే ఇందుకు రుజువని తెలిపారు. నాలుగేళ్ల క్రితమే ఈ నిర్ణయం తీసుకొని ఉంటే ఇప్పటికే అమలయ్యేదన్నారు. ఆర్థిక వెసులుబాటుపై ఎస్సీ, ఎస్టీలలో అనుమానాలు ఉన్నాయని, బీజేపీ అంటే బలహీన వర్గాలకు భయం పట్టుకుందన్నారు. అంబేద్కర్ చెప్పింది సాంఘికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లని, అంబేద్కరిజానికి మోదీ విధానాలు వ్యతిరేకమని విమర్శించారు. రిజర్వేషన్ నిలబడదని తెలిసీ ఇవ్వటం ఈబీసీలను మోసం చేయడమేనని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్లపై మోదీ ఎందుకు స్పందించరని, 22ఏళ్లుగా మహిళల డిమాండ్‌ను ఎందుకు పట్టించుకోరని ఆయన ప్రశ్నించారు. శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై కేంద్రం చర్యలు ఏవని ప్రశ్నించారు. ఏపీలో కాపుల రిజర్వేషన్లపై, సామాజిక వర్గాల మార్పుపై స్పందించరని విమర్శించారు. ఏపీకి 32వేల కోట్ల రూపాయలు ఇస్తామని కేంద్ర అధికారులు చెప్పారని, కానీ మోదీ అనుమతి కావాలని తెలిపారని గుర్తుచేశారు. కేంద్రంలోని అధికారుల్లో లోపం లేదని, మోదీలోనే కుట్ర కోణం ఉందని విమర్శించారు. మోదీ కక్షకు ఏపీ ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేంద్రం ఇవ్వాల్సిన నిధులపై మోదీని రాష్ట్ర ప్రతిపక్ష నేత అడగరని, ఏపీ అభివృద్ధి చెందడం ఆయనకు ఇష్టం లేదని ఆరోపించారు. ఏపీ అభివృద్ధి చెందకూడదని కోరుకునే ఏకైక వ్యక్తి జగన్ అంటూ విమర్శించారు. జగన్ జననేత కాదని, ధననేత అని విమర్శించారు. జగన్ పుస్తకంలో ఒక్క నిజం లేదని, అందుకే ప్రజలు దాన్ని తిరస్కరిస్తున్నారని యనమల స్పష్టం చేశారు.

ఐదేళ్లు బీజేపీలోనే కొనసాగుతా

★ బీజేఎల్‌పీ నేత విష్ణుకుమార్ రాజు

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 11: బీజేపీ తరపున పోటీ చేసిన తనకు ప్రజలు ఓట్లేశారని, ఐదేళ్ల పాటు తాను బీజేపీలోనే కొనసాగడం నైతికతగా భావిస్తున్నట్టు బీజేఎల్‌పీ నేత, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పీ విష్ణుకుమార్ రాజు అన్నారు. విశాఖలో శుక్రవారం ఆయన తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో బీజేపీ, టీడీపీతో కలిసి పోటీ చేయగా తాను గెలుపొందానన్నారు. ప్రజలిచ్చిన తీర్పును శిరసావహించి, పదవీ కాలం పూర్తయ్యే వరకూ బీజేపీలోనే కొనసాగుతానని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోందన్నారు.

పలువురు నేతలు పార్టీని వీడుతున్న నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి బీజేపీ తీరని అన్యాయం చేసిందన్న ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడంలో టీడీపీ విజయం సాధించిందన్నారు. విభజన హామీల్లో ప్రత్యేక హోదా, కడప స్టీల్‌ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు, రైల్వే జోన్ మినహా కేంద్ర విద్యాసంస్థలన్నింటితో పాటు హామీల్లో లేనివి కూడా బీజేపీ చేసిందన్నారు.

ప్రత్యేక హోదా స్థానే ప్యాకేజీ ఇస్తానని కేంద్రం హామీ ఇచ్చిందని, కడప స్టీల్‌ప్లాంట్, దుగరాజపట్నం పోర్టు సాంకేతికంగా సాధ్యం కాదని తేలిందన్నారు. ప్రత్యామ్నాయం చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ అంశం కూడా సాంకేతికంగా సాధ్యం కానప్పటికీ రాజకీయ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. అయితే కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రచారాన్నే ప్రజలు పూర్తిగా విశ్వసించారని విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు జరుగుతున్న ప్రచారాన్ని ఎందుకు ఖండించాలని ప్రశ్నించారు.


ప్రస్తుతానికైతే ఉచితంగా ప్రచారం లభిస్తోందని, దీన్ని కొనసాగిద్దామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే తాను బీజేపీ ద్వారా గెలుచుకున్న ఎమ్మెల్యే పదవీకాలం పూర్తవుతుందన్నారు. అప్పుడు తాను ఏ పార్టీలో చేరేదీ అభిమానులు, ఆంతరంగికులతో చర్చించి ప్రకటిస్తానని వెల్లడించారు.

ఐదు రెట్ల పరిహారం కావాలి

‘భావనపాడు’ నిర్వాసితుల డిమాండ్ ★ అసంపూర్తి అంగీకారాలతో ముగిసిన పోర్టు కమిటీ సమావేశం

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 11: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టదలచిన భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంపై శుక్రవారం మరోసారి కమిటీ సమావేశమైంది. సమావేశంలో ఐదు రెట్ల పరిహారం కావాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. చివరకు అసంపూర్తి అంగీకారాలతో పోర్టు కమిటీ సమావేశం ముగిసింది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జెసీ చక్రధర బాబు, పోర్టు డైరెక్టర్ కోయ ప్రవీణ్, ఆర్డీవో వెంకటేశ్వరరావు, భావనపాడు గ్రామపంచాయతీ పోర్టు నిర్వాసితుల హక్కుల సాధన కమిటీ అధ్యక్షుడు కారాడ పోతయ్య, ఉపాధ్యక్షుడు సైన గురువులు తదితరులు పాల్గొన్నారు. సువిశాల తీర ప్రాంతమున్న శ్రీకాకుళం తీరాన్ని ఎగుమతులు, దిగుమతులకు కేంద్రంగా చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన. ఇందులో భాగంగానే జిల్లాలోని సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద గ్రీన్‌ఫీల్డ్ పోర్టును ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన. ఒడిశా, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో విలువైన ఖనిజ సంపదను ఈ పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి చేయడానికి, అలాగే ఏపీ సహా పైన పేర్కొన్న రాష్ట్రాల్లో స్టీల్, విద్యుత్ పరిశ్రమలకు అవసరమైన బొగ్గును దిగుమతి చేసుకోవడానికి దీన్ని ఉపయోగించాలనేది లక్ష్యం. చాలా కాలం నుంచి ప్రతిపాదనలకే పరిమితమైన ఈ పోర్టు నిర్మాణం 2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో మరోసారి తెరపైకి వచ్చింది. తమ ప్రభుత్వం వస్తే భావనపాడు వద్ద గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మిస్తాం అంటూ ప్రకటించిన చంద్రబాబునాయుడు ప్రభుత్వం 2015లో పోర్టు నిర్మాణానికి ఓ అడుగు ముందుకేసింది. ఇందులోభాగంగానే 14 బెర్తులతో 30.57 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మితమయ్యే భావనపాడు పోర్టు కార్యకలాపాల కోసం సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు మండలాల్లో పదివేల ఎకరాలను సేకరించాలని తొలుత భావించింది. దీనిపై ప్రజలు ఆందోళన చేయడంతో కేవలం 4923 ఎకరాలను సేకరించేందుకు 2015 ఆగస్టు 28న నోటిఫికేషన్ జారీ చేసింది. నోటిఫికేషన్ ప్రకారం పోర్టుకు కావల్సిన భూములను భావనపాడు, మర్రిపాడు, కొమరల్తాడ, దేవునల్తాడ పంచాయతీల నుంచి సమీకిరంచాలని భావించారు. భూసేకరణ చట్టం - 2013 మార్గదర్శకాలకు లోబడే భూసేకరణ ఉంటుందని, భోగాపురం ప్యాకేజీ తరహాలో ఎకరా భూమి ఇచ్చిన వారికి రూ. 33 లక్షలు, ఇళ్ళు కోల్పోతున్నవారికి 40 సెంట్ల స్థలంలో డబుల్‌బెడ్ రూమ్ హౌస్ కట్టిస్తామని హామీ ఇచ్చారు. కానీ, శుక్రవారం జరిగిన పోర్టు కమిటీ సమావేశంలో నిర్వాసితుల హక్కుల సాధన కమిటీకి చెందిన కారాడ నీలకంఠం సరికొత్త డిమాండ్లను ప్రభుత్వానికి వినిపించారు. భూములు, స్ట్రక్చర్లు, ఇతర నష్టాలకు సంబంధించి ఐదు రెట్ల పరిహారం కావాలని డిమాండ్ చేసారు. భావనపాడు, అల్తాడ గ్రామాల మధ్య నుంచి పోర్టు ముఖద్వారం నిర్మించాలనే ప్రతిపాదనపై స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రెండు గ్రామాలకు చెందిన పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వాటిని ఉపసంహరించుకునేలా మంత్రి అచ్చెన్న కృషి చేశారు. ఇప్పుడూ అటువంటి ప్రయత్నమే మరోసారి మంత్రి అచ్చెన్న చేసారు. కానీ, భావనపాడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టుపై ఇప్పటికీ ముగింపుదొరికినట్టుగా కనిపించలేదు.



భావనపాడు పోర్టు కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

భావనపాడు పోర్టు నిర్మాణంపై ప్రభుత్వం ఎన్నో ఆశలు పెట్టుకుంది. పోర్టు నిర్మాణంపై సరిగ్గా ఓ క్లారిటీ లేకుండానే కనీసం ప్రజాభిప్రాయం సేకరించకుండానే 2015లో భూసమీకరణకు నోటిఫికేషన్ జారీ చేసారు. పోర్టు నిర్మాణం వల్ల సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు, మర్రిపాడు పంచాయతీలు, వజ్రపుకొత్తూరు మండలంలోని కొమరల్తాడ, కొత్తపేట, పొల్లాడ, దేవునల్తాడ పంచాయతీల పరిధిలోని గ్రామాలన్నీ తరలించాల్సి ఉంటుంది. ఇక్కడ చేపల చెరువులు, ఉప్పుమడుగులపై పరోక్షంగా ఆధారపడిన మరో మూడు వేల మంది ఉపాధికి గండి పడుతుంది. అసలు ఇంత పెద్ద పోర్టు నిర్మాణం చేపట్టేముందు కనీసం తమ అభిప్రాయాలు తీసుకోనక్కర్లేదా అని నిర్వాసిత గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అందుకే పోర్టు కమిటీ సమావేశం జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో జోడించి మంత్రి అచ్చెన్న అధికారుల సమక్షంలో ఏర్పాటు చేశారు.ఈ పోర్టు నిర్మాణం ప్రతిపాదన కంటే ముందునుంచే ఇక్కడ మత్స్యకారులకు ఉపయోగపడేలా ఫిషింగ్ హార్బర్ నిర్మించాలనే డిమాండ్ ఉంది. కానీ, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే భావనపాడు పోర్టును నిర్మించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పింస్తామంటూ హామీ ఇచ్చి నాలుగేళ్ళుగా పోర్టు పనులు అడుగు ముందుకు పడలేదు. ఫిషింగ్ హార్బర్ అంతకన్నా లేదు. దీంతో మత్స్యకారులు ఎట్టిపరిస్థితులోనూ పోర్టు నిర్మాణం కోసం భూమి ఇచ్చేది లేదని తెగేసి చెబుతన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో గుజరాత్‌కు చెందిన కార్పొరేట్ సంస్థ అదానీ గ్రూప్‌కు అప్పగించడానికి మూడేళ్ళుగా రాష్ట్ర ప్రభుత్వం ఆపసోపాలు పడింది. చివరకు పీపీపీ పద్ధతితోనే భావనపాడు పోర్టు నిర్మాణం అంటూ గతంలో కేబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుని, ప్రకటించారు. అదానీ గ్రూపు సమర్పించిన ఫైనాన్షియల్ నివేదికలో పోర్టు రెవెన్యూలో రాష్ట్రానికి కేవలం 0.5 శాతం మాత్రమే వాటాను ప్రతిపాదించింది.

దేశంలో ఇప్పటివరకూ పోర్టులను తీసుకున్న ప్రైవేటు సంస్థలు 2 నుంచి 2.5 శాతం వరకూ రెవెన్యూ వాటా ఇస్తున్నాయి. తొలుత పదివేల ఎకరాల వరకూ భూసేకరణ లక్ష్యంతో దిగిన ప్రభుత్వం చివరకు 2,554 ఎకరాలతో సరిపట్టుకుంటామని ప్రకటించింది. దీనిలో 268 ఎకరాలు ఇప్పటికే పోర్టులశాఖ ఆధీనంలో ఉంది. మిగతాది రైతుల నుంచి సేరకించాల్సివుంది. కానీ, పోర్టు కోసం సర్వం కోల్పోతే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూన్నారు. ఉద్యోగాలు, ప్యాకేజీలు, తరలింపు, నష్టపరిహారం ఇవేమీ కొలిక్కిరాకుండానే మూడున్నర ఏళ్ళ క్రితం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్ ఫలితంగా రైతులు తమ జిరాయితీ భూములు క్రయవిక్రయాలకు నోచుకోక ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో నిర్మించే పోర్టు కోసం ఇప్పటి నుంచే తమను ఇబ్బంది పెట్టడం భావ్యంకాదని, క్రయవిక్రయాలు జరుపుకునేలా నోటిఫికేషన్ ఎత్తివేయాలని కమిటీ సమావేశంలో నిర్వాసితులు మంత్రి అచ్చెన్నను కోరగా ప్రజలను కష్టాల్లోకి నెట్టి పోర్టు నిర్మించాలనే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదన్నారు.

జగన్‌తో భక్తులకు ఇబ్బందులు

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 11: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లిన జగన్ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో తన కార్యకర్తలతో అత్యుత్సాహాన్ని అహంకారాన్ని ప్రదర్శించారని, స్వామివారి సన్నిధిలో ఉన్నామనే ఇంగితాన్ని మరిచి అనుచరులతో జై కొట్టించుకోవడం జగన్ వంటి వారికే చెల్లిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ ఆక్షేపించారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ఆమె శుక్రవారం విలేఖరులతో మాట్లాడుతూ పాదయాత్ర పేరుతో, రోజుకో విధంగా ప్రవర్తిస్తూ ఇన్నాళ్ళూ రాష్ట్ర ప్రజలను ఏడిపించిన జగన్, వెంకన్న దర్శనానికి వెళ్లి అక్కడున్న భక్తులను ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. భగవంతుడి దర్శనానికి వెళ్లిన వారు, ప్రశాంత చిత్తంతో... పరమాత్ముడిపై ప్రేమతో వ్యవహరిస్తారని, అందుకు విరుద్ధంగా జగన్, ఆయన అనుచరగణం స్వామివారి ప్రాంగణంలో తలబిరుసుతో ప్రవర్తించి హిందువుల మనోభావాలు దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా స్వామివారి దర్శనానికి వెళ్లిన జగన్ డిక్లరేషన్‌లో సంతకం చేయకుండా ఆలయ ప్రతిష్టను మంటగలిపారన్నారు. మితిమీరిన అహంకారంతో ప్రవర్తించే జగన్‌కు ఎప్పటికీ అధికారం దక్కదని, ఎన్ని జన్మలెత్తినా, ఎందరు దేవుళ్లకు మొక్కినా ఆయన చేసిన అవినీతి మాసిపోదని ఆమె ఎద్దేవా చేశారు. వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమల్లో జగన్‌పై ఏదో కుట్ర జరుగుతోందంటూ అలజడి సృష్టించాలని ప్రయత్నించారన్నారు. వాస్తవానికి నిన్న వైసీపీ కార్యకర్తలు, కరుణాకర్‌రెడ్డి వంటి నేతలు దర్శనం పేరుతో రాజకీయాలు చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతినేలా కొత్త కుట్రలు లేపడానికి ప్రయత్నించారని ఆమె పేర్కొన్నారు.

‘తొలి జాబితా’పై కోటి ఆశలు!

ఆశావహుల్లో పెరిగిన టిక్కెట్ ఫీవర్

భీమవరం, జనవరి 11: రాష్ట్ర రాజకీయాల్లో అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైసీపీలు ప్రకటించే తొలి జాబితాలపైనే ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమై వుంది. ఈ రెండు పార్టీలతోపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీతో పాటు జనసేన పార్టీల్లో కూడా తొలి జాబితాపై చర్చ జరుగుతోంది.

ఇప్పటికే జనవరి మాసం సగం పూర్తికానుండటం, ఆపై ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే సమయం దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీల నేతలకు టిక్కెట్ ఫీవర్ పట్టుకుంది. ఒకపక్క అభ్యర్థుల జాబితాలను సిద్ధంచేయడానికి పార్టీల అధిష్ఠానాలు కసరత్తు చేస్తుండగా మరో పక్క ఆశావహుల్లో మరింత టెన్షన్ పెరుగుతోంది. తొలి జాబితాలో పేరు ఖరారైతే ప్రచారానికి ఎక్కువ సమయం ఉంటుందనేది ఆశావహుల భావన. దీనితో తొలి జాబితాలోనే పేరుండాలని ఆశావహులు మొక్కుకుంటున్నారు.

రాష్ట్రంలో టీడీపీతో పొత్తు అంశం ఈనెల 20న తేలుతుందని పీసీసీ చీఫ్ రఘువీరారెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఇరు పార్టీల నేతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలే ఢిల్లీ వెళ్లిన టీడీపీ అధినేత చంద్రబాబు, రాహుల్ మధ్య పొత్తు అంశంపై చర్చలు జరిగివుండవచ్చనే వాదన వినిపిస్తోంది. ఈ అంశంపై క్లారిటీ కోసం చంద్రబాబు నాయుడు ఎదురు చూస్తున్నట్లు కనిపిస్తోంది. జనవరి 3వ వారంలో తొలి జాబితాను ప్రకటిస్తానని , ఫిబ్రవరి మొదటి వారంలో రెండో జాబితాను, మార్చి మొదటి వారానికి మూడో జాబితాను ప్రకటిస్తామని చంద్రబాబు పార్టీ శ్రేణులకు టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంకేతాలిచ్చారు. తొలి జాబితాలో ఒక్కో జిల్లాకు 3 నుంచి 5 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తారని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఖాయంగా గెలిచే సీట్లను ప్రకటిస్తారని అంచనా వేస్తున్నారు.

ఇక వైసీపీ కూడా భారీఎత్తున పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులపై కసరత్తు చేస్తోంది. అసెంబ్లీలతో పాటు పార్లమెంట్ అభ్యర్థులను కూడా ఒకేసారి ప్రకటిస్తారని ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ప్రథమ ప్రాధాన్యతగా పార్టీ మారకుండా ఉన్న సిట్టింగ్‌లకు లోక్‌సభ, శాసన సభ సీట్లను ప్రకటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైసీపీలో ఉన్న సిట్టింగ్‌లు మాత్రం తమకే మరోసారి బి-ఫారం లభిస్తోందని చాలా ధీమాగా ఉన్నారు. ఇక మరో పార్టీ జనసేన నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుని అభ్యర్థుల కోసం వేటాడుతోంది. అధినేత పవన్ కళ్యాణ్ జిల్లాల వారీగా సమావేశాలు అమరావతిలో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పవన్ నిర్వహించిన సభలకు, కవాతులకు ఉత్సాహంగా పాల్గొన్న వారిని అభ్యర్థులుగా ఎంపిక చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇక భారతీయ జనతా పార్టీ ఇప్పటికే కొంత మంది అభ్యర్థులతో జాబితాను సిద్ధం చేసుకుని, క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టినట్లు తెలిసింది. అలాగే కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఏఐసీసీ అధ్యక్షులు రాహుల్ గాంధీ దూతలు రాష్ట్రంలోనే మకాంవేశారు. వీరు రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో పర్యటించి, అక్కడ స్థితిగతులను, ఉత్సాహంగా ఉన్నవారి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల్లో తొలి జాబితా వ్యవహారం జోరుగా సాగుతోంది.

కాంగ్రెస్ హోదా ఇవ్వకుంటే రాష్ట్రంలో అడుగుపెట్టను


★ పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి

హిందూపురం, జనవరి 11: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్‌గాంధీ ప్రధాని అయిన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే రాష్ట్రంలో అడుగు పెట్టనని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి శపథం చేశారు. ప్రత్యేక హోదా ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా హిందూపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల ఎఐసీసీ అధ్యక్షులు రాహుల్‌గాంధీని కలిసి 30 అంశాలపై చర్చించానన్నారు. అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం కీలకమయిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. మూడు ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అసెంబ్లీ స్థానాలకు మాత్రమే పోటీ చేస్తే రాష్ట్ర ప్రజలందరికీ న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలంటే కేంద్రం చేతుల్లోనే ఉంటుందన్నారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పిందన్నారు. కాబట్టి కాంగ్రెస్ ఒక్కటే దిక్కన్నారు. రాష్ట్రంలో టీడీపీతో పొత్తుపై అధిష్టానానిదే తుది నిర్ణయమన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ ఇంటింటా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు కోటా సత్యం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలాజీమనోహర్, నాయకులు ఆదిమూర్తి, శైవలి రాజశేఖర్, నాగరాజుయాదవ్, నాగరాజు, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర సంగమం నుండి రాజధానికి ఐకానిక్ వంతెన

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 11: నవ్యాంధ్ర రాజధాని అమరావతికి తలమానికంగా నిలిచే ఐకానిక్ వంతెన పనులకు నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ శ్రీకారం చుడుతోంది. విజయవాడ నగరానికి సమీపంలోని ఇబ్రహీంపట్నం దగ్గర పవిత్ర సంగమం నుండి రాజధాని ప్రాంతంలోని తాళ్లాయిపాలెం వరకు కృష్ణా నదిపై ఈ వంతెన నిర్మించనున్నారు. నిర్మాణ పనులను అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసి) పర్యవేక్షిస్తుంది. 3.2 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా దీన్ని నిర్మిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా 12న ఉదయం ఐకానిక్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన జరుగుతుంది. ఈమేరకు నిర్మాణ సంస్థ సన్నాహాలు చేస్తోంది. పవిత్ర సంగమం దగ్గర గోదావరి ఘాట్‌లో శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఇందుకోసం స్టాక్ యార్డును ఇప్పటికే సిద్ధం చేశారు. నదిలో పిల్లర్లు వేసేందుకు అవసరమైన అతిపెద్ద ఐరన్ ఫంట్స్ (బార్జ్‌లు) సిద్ధం చేసి నదిలోకి దింపుతున్నారు. ఇంజనీర్లు మార్కింగ్‌ను పూర్తిచేశారు. ఫైల్ కాంక్రీటుకు మెటీరియల్ త్వరలో వస్తుందని అధికారులు తెలిపారు. నదిలో 36 పిల్లర్లు నిర్మించాల్సి ఉంది. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ వరకు ఈ వంతెన నిర్మిస్తారు.



ఐకానిక్ వంతెన నమూనా

విభజన చట్టంలో భాగంగానే హైకోర్టు బెంచ్ సాధ్యం

ఆంధ్రభూమి బ్యూరో

కర్నూలు, జనవరి 11: విభజన చట్టంలో భాగంగానే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు సాధ్యమని న్యాయవాదులు అంటున్నారు. బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకువచ్చినందున ఇక శాసనసభ తీర్మానం, గవర్నర్ ఆమోదం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రకటనే తరువాయి అని పేర్కొంటున్నారు. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన భవనం, మౌలిక వసతులు కర్నూలులో సిద్ధంగా ఉన్నందున ఎన్నికల లోపు హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల అటు న్యాయవాదులు, ఇటు కక్షిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేస్తే హైకోర్టు పనుల కోసం ప్రజలు అమరావతికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. కర్నూలులోనే ఆయా కేసులను పరిష్కరించుకునే ప్రయత్నం చేయవచ్చని వారంటున్నారు. దీనివల్ల ప్రజలకు వ్యయ, ప్రయాసలు తగ్గడమే కాకుండా కేసుల పరిష్కారం త్వరితగతిన పూర్తవుతుందని స్పష్టం చేస్తున్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటైతే న్యాయవాదులు సైతం లబ్ధిపొందుతారని వెల్లడిస్తున్నారు. సీమ జిల్లాలకు సంబంధించి అనేక కేసులు హైకోర్టుకు వెళ్లాల్సి వస్తే గతంలో హైదరాబాద్‌లోని సీనియర్ న్యాయవాదులకు సిఫారసు చేసి కక్షిదారులను అక్కడికి పంపేవారు. తాజాగా అమరావతిలో రాష్ట్ర హైకోర్టు ప్రారంభం కావడంతో కక్షిదారులు అమరావతికి వెళ్లి అక్కడి న్యాయవాదులను సంప్రదిస్తున్నారు. ఈ తరుణంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటైతే రాయలసీమ జిల్లాలకు చెందిన వారు కర్నూలులోనే కేసుల పరిష్కారం కోసం ప్రయత్నించే వెసులుబాటు ఉంటుంది.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రభుత్వ ఇష్టప్రకారం జరగదని, హైకోర్టు, సుప్రీం కోర్టు అంగీకారంతోనే అది సాధ్యమని కొందరు వాదిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం అంగీకరిస్తే విభజన చట్టం ప్రకారం సాధ్యమేనని మరి కొందరు పేర్కొంటున్నారు. దీనిపై కర్నూలు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చాంద్‌బాషా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్విజన చట్టం 2014లో సెక్షన్-31(3) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి వర్గం ఆమోదించి ఆ తరువాత శాసనసభలో తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. ఆ నివేదికను రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నివేదికను పరిశీలించి హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు గవర్నర్ ఆమోదం తెలిపితే దాని ప్రకారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తదుపరి చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఉన్న అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుని హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు శాసనసభలో తీర్మానం చేసి గవర్నర్ నుంచి ఆమోదం పొందడమే ప్రధాన అంశమని ఆయన అన్నారు. ఆ తదుపరి ప్రక్రియ వేగంగా పూర్తవుతుందని స్పష్టం చేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే అందుకు అవసరమైన భవనం కూడా సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న మున్సిఫ్ కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన 5 అంతస్థుల భవనం హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు తరువాత ప్రభుత్వం అవసరమనుకుంటే మరోచోట కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టవచ్చని తెలిపారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వ అంగీకరించినందున శాసనసభలో తీర్మానం, గవర్నర్ ఆమోదం లభించాల్సి ఉందన్నారు.

కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు

సంక్రాంతికి సొంతూర్లకు ప్రయాణం .. చార్జీల మోతతో లబోదిబో
ప్రత్యేక రైళ్లు, బస్సులు నడుపుతున్నా జనానికి తప్పని అవస్థలు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 11: లక్షలాది మంది నగరవాసులు సంక్రాంతికి సొంతూరు బాటపట్టారు. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ఇదే అదనుగా చేసుకుని ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలు చార్జీలు పెంచేసి జనాన్ని నిలువుదోపిడీ చేస్తున్నాయి. రిజర్వేషన్లు దక్కని వారు రోడ్డు రవాణాసంస్థ, ప్రైవేటు బస్సులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో అదనపుచార్జీలు వసూలు చేస్తున్నారు. తెలంగాణ ఆర్టీసీ మాత్రం టిక్కెట్‌పై 50 శాతం అదనంగా వసూలు చేయాలని నిర్ణయించినా, బస్సు కండక్టర్లు మాత్రం వంద శాతం పెంచేశారు. ఈ సందర్భంగా ప్రయాణీకులు, కండక్టర్ల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయి. ప్రయాణీకులు ఎవరైనా ప్రశ్నిస్తే పైఅధికారుల ఆదేశాల మేరకే వసూలు చేస్తున్నామని కండక్టర్లు చెబుతున్నారు. ఇక ప్రైవేట్ బస్సు ఆపరేటర్ల సంగతి సరేసరి. ప్రయాణికుల నుంచి అడ్డూఅదుపూ లేకుండా దోచుకుంటున్నారు. మామూలు రోజుల్లో 600 రూపాయలున్న టిక్కెట్‌ను 2,500 రూపాయల వరకూ పెంచేశారు. విశాఖపట్నం, విజయనగరం, విజయవాడ, రాజమండ్రి, కడప, తిరుపతి, చిత్తూరు, బెంగళూరుకు భారీగానే పెంచేసి వసూలు చేస్తున్నారు. రైల్వే అధికారులు అదనంగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. అయినా ప్రత్యేక రైళ్లకు రిజర్వేషన్లు దొరికితే ఒట్టు. వెయిటింగ్ లిస్టు వందల్లో ఉంటోంది. ప్రతి రైలుకూ ‘నో రూమ్’ బోర్డు. సామాన్య ప్రయాణికుల కోసం జన్‌సాధారణ్ రైళ్లను నడుపుతున్నారు. హైదరాబాద్- విజయవాడ మధ్య ఏకంగా 60 రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేశారు. జనసాధారణ్ రైళ్లలో హైదరాబాద్- విజయవాడకు కేవలం రూ. 120 చార్జీ నిర్ణయించారు. ఈ రైళ్ల కోసం సామాన్య ప్రయాణికులు ఎగబడుతున్నారు. యథాప్రకారం పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్లాట్‌ఫారం టిక్కెట్టు 10 నుంచి 20 రూపాలకు పెంచేశారు. ఇలా ఉండగా హైదరాబాద్ నుంచి ఆంధ్రా, తెలంగాణ జిల్లాలకు దాదాపు 5,252 బస్సులు నడుపుతున్నట్టు రంగారెడ్డి రీజియన్ మేనేజర్ యాదగిరి తెలిపారు. తెలంగాణకు 3,673 బస్సులు, ఆంధ్రాకు 1,579 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రభూమి ప్రతినిధితో మాట్లాడుతూ ప్రయాణీకుల సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఎంజీబీఎస్ నుంచి ఏపీకి 500 బస్సులు, తెలంగాణకు 855 బస్సులు తిప్పుతున్నారు. జేబీఎస్ నుంచి ఆంధ్రాకు 230, తెలంగాణకు 1,426 బస్సులు నడుపుతున్నారు. కేపీహెచ్‌బీ నుంచి ఆంధ్రాకు 323, తెలంగాణకు 113 బస్సులు, ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి ఆంధ్రాకు 20, తెలంగాణకు 454, ఎల్‌బీ నగర్ నుంచి ఆంధ్రాకు 156, తెలంగాణకు 825 బస్సులు నడుపుతున్నట్లు ఆయన చెప్పారు. ఎంజీబీఎస్ నుంచి రెగ్యులర్‌గా నడిచే బస్సులు ప్లాట్‌ఫామ్‌ల నుంచి బయలుదేరతాయని చెప్పారు. ప్రయాణికుల సమాచారం కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్ఆర్‌టీసీ.ఆన్‌లైన్.ఇన్‌తో వివరాలను తెలుసుకోవచ్చు.

గ్రామీణ పేదరికం నిర్మూలనే ధ్యేయంగా సెర్ప్

ఆంధ్రభూమి బ్యూరో

విజయవాడ, జనవరి 11: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా నిరంతరం పేదల అభ్యున్నతికి సెర్ప్ పనిచేస్తోందని సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి కృష్ణమొహన్ తెలిపారు. పేదల జీవనోపాధులను ప్రోత్సహించటానికి తోడ్పడుతున్నదని, ఈ క్రమంలో సంఘ సభ్యులు తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, చేతివృత్తులు, హస్తకళలు, చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిస్తోందన్నారు. ఆయా ఉత్పత్తులకు మార్కెటింగ్, ప్రచారం కల్పించే దిశలో డ్వాక్రా బజార్‌లను క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తున్నారని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఆయా ప్రదర్శనల్లో సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కలిపిస్తూ ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా సెర్ప్ నిలుస్తున్నదన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం పెద్ద నగరాలైన విజయవాడ, విశాఖపట్నంల్లో పెద్దఎత్తున డ్వాక్రాబజార్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ డ్వాక్రాబజార్‌ల్లో 400 స్టాల్స్ ఏర్పాటు చేసి పెద్దఎత్తున డ్వాక్రా మహిళలకు అవకాశాలు కలిగించటం ద్వారా సంఘ సభ్యుల ఉన్నతికి సెర్ప్ కృషి చేస్తోందన్నారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం ఈ-మహిళ బ్రాండ్‌తో అవకాశం కల్పిస్తున్నామన్నారు.

ఆంధ్రభూమి

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ

శనివారం, 12 జనవరి 2019

కాలుష్య కారణం..?!

దీనమంతా ఎగసేశాము, దీపం తెరా దిగనేద్దాము- అన్నది కేవలం సామెత కాదు. ఒకప్పుడు పగలంతా వస్త్రాన్ని నిర్మించడం మరోవైపు అదే బట్టను చింపి చీల్చి పోగులుగా ఉన్న విడగొట్టడం.. ఇలాంటి వైపరీత్యం స్వభావంలో, పనితీరులో నిహితమై ఉన్న వైరుధ్యాలకు నిదర్శనం. 'ప్రపంచీకరణ' విధానాలు 'భారతీయత'ను పరిమార్చుతుండడం నడుస్తున్న చరిత్ర. 'ప్రపంచీకరణ'ను ప్రోత్సహిస్తున్న పాలకులు మరోవైపు భారతీయ తను నిలబెట్టడానికి యత్నిస్తుండడం విధాన నిహితమై ఉన్న వైరుధ్యం.. ఆకుపచ్చదనం అభివృద్ధికి ప్రాతిపదిక, జడ తరళగాల భారతజాతి జీవన వాహిక! అడవులు, పంట పొలాలు, అవిరళ జల ప్రవాహాలు, స్వచ్ఛమైన గాలి, ప్రకృతి పరిమళాలు- ఇవన్నీ ఆకుపచ్చదనంలో భాగం! ఆకుపచ్చ దనాన్ని హతమార్చడం ప్రపంచీకరణకు ప్రాతిపదిక! విస్తృతమైన పారిశ్రామిక భారత జాతీయ విధానం. చిన్న పరిశ్రమలు కుటీర పరిశ్రమలు గృహ పరిశ్రమలు వికసించడం ప్రకృతిలోని ఆకుపచ్చదనానికి విఘాతం కాలేదు, వేల లక్షల ఏండ్ల పాటు విఘాతం కాలేదు.. 'ప్రపంచీకరణ' పరిశ్రమలను ఒకచోట కేంద్రీకరి స్తోంది. ఈ కేంద్రీకరణ కాలుష్యాన్ని పెంచుతోంది. దుర్గంధాన్ని పంచుతోంది. వేల ఎకరాలలో మొక్కలను నాటుతూ 'హరితహారం'తో భరతమాత గళసీమను అలంకరించడానికి, మాతృదేవి చరణాలను అర్చించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తుండడం హర్షణీయం. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుళ జాతీయ వాణిజ్య సంస్థల- మల్టీ నేషనల్ కంపెనీస్- నిర్వాహకుల చేతులకు గొడ్డళ్లను, గునపాలను అందిస్తుండడం సమాంతర వివరిణామం. ఈ వాణిజ్య సంస్థలు ప్రధానంగా విదేశీయ సంస్థలు గొడ్డళ్లతో ఆకుపచ్చని చెట్లను నరికివేస్తున్నాయి. గునపాలతో భూమి తవ్విపారేస్తున్నాయి. పడమటి కనుమలకు కన్నాలు పడిపోయాయి, తూర్పు కనుమలు కూలిపోతున్నాయి, వింధ్య పర్వతాలు వికృతిని సంతరించుకుంటున్నాయి, హిమాలయాలు కరగిపోతున్నాయి, సముద్రాలలో కాలుష్య తరంగాలు ఉవ్వెత్తున లేస్తున్నాయి! స్వచ్ఛ భారత పునర్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రపంచీకరణ కాలుష్య సమూహాలు అడుగడుగునా అడ్డుకుంటున్నాయి, భ్రష్టుకం నిలదీస్తున్నాయి. ఈ ప్రభుత్వ విధాన నిహిత పరస్పర వైరుధ్యాలకు సరికొత్త ఉదాహరణ ఇలా ప్రస్ఫుటిస్తోంది.. మొదటిది గురువారం, శుక్రవారం ప్రచారమైన కేంద్ర ప్రభుత్వం వారి 'జాతీయ స్వచ్ఛవాయు కార్యక్రమం'- నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్- ఎన్‌సిఎపి-! గత నెల చివరలో కేంద్ర ప్రభుత్వం 'సముద్రతీర నియంత్ర మండలం' నియమావళిని సడలించింది. రెండవది.. 'స్వచ్ఛవాయు' కార్యక్రమం వల్ల 2024 నాటికి దేశంలో దాదాపు నూట ఐదు నగరాలలో వాయుకాలుష్యాన్ని ప్రస్తుత స్థాయి కంటె ఇరవై శాతం తగ్గిస్తారట.. ఆనందకరం! జనం జీవకాలం మరింత స్వచ్ఛంగా ఊపిరి పీల్చుకొనడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుంది.. కానీ గత నెలలో కేంద్ర ప్రభుత్వం సడలించిన నియమావళి ప్రకారం 'సముద్ర తీర నియంత్ర మండలం'- కోస్టల్ రెగ్యులేషన్ జోన్- సిఆర్‌జెడ్- పరిధిలో పరిశ్రమలను నెలకొల్పడానికి మరింత సులభం అవుతుంది. కేంద్రం నుంచి పర్యావరణ పరిరక్షణ అనుమతులను ఆయా వాణిజ్య సంస్థలు పొందనవసరం లేదు. అందువల్ల కాలుష్యాన్ని పెంచగల పరిశ్రమల స్థాపన వేగవంతం అవుతుంది. గాలి కాలుష్యం పెరుగుతుంది. ఇదీ పరస్పర వైరుధ్యం! ''దీపం పెట్టి దిగనేయడం..''

'సిఆర్‌జెడ్' నిబంధనలను సడలించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తన అధికారాలను తగ్గించుకొంది. రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలను పెంచింది. సముద్ర తీరం పొడవునా భూమి ఉపరితలంపై నెలకొనే పరిశ్రమల వల్ల పర్యావరణంపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్న వ్యవహారం కేంద్ర ప్రభుత్వ అధికార పరిధి నుంచి తొలగిపోయింది. ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై తుది నిర్ణయాలు తీసుకోవచ్చునట! కేంద్ర పర్యావరణ పరిరక్షణ మంత్రిత్వ శాఖ వారి అనుమతులు అక్కరలేదట! ఇంతవరకు 'అభివృద్ధి' చెందని సముద్ర తీర సమీప ప్రాంతాలలో సైతం కేంద్ర ప్రభుత్వం వారి అనుమతులతో పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారంతో పరిశ్రమలను నెలకొల్పవచ్చునట! అభివృద్ధి అంటే ''ఆకుపచ్చదనాన్ని హరించివేసి, పంటలను పశువులను నిర్మూలించి సిమెంటు కట్టడాలు కట్టి ఇనుప యంత్రాలను ఏర్పాటుచేయడమన్నది'' దేశంలో కొనసాగుతున్న అభిప్రాయం.. 'ప్రపంచీకరణ' ముదిరిన తరువాత ఈ 'కృత్రిమ ప్రగతి భ్రాంతి' మరింత ముదిరిపోయింది. ఆవు పాలు దొరకడం ఆగిపోయిన పల్లెలలో 'కాఫీ, తేనీరు అమ్మే దుకాణాలు' నెలకొనడం గతంలో అంటే రెండు తరాలకు పూర్వం జరిగిన 'ప్రగతి'! మంచి నీటి బావులు ఎండిపోయిన సీమలలో మద్యం విక్రయ కేంద్రాలు ఏర్పడుతుండడం నడుస్తున్న 'ప్రగతి'.. అందువల్ల గాలి వివిధ రకాల విష వాసనలకు నిలయంగా మారుతోంది.. స్వచ్ఛతను పునరుద్ధరించడం ఈ ద్వంద్వ విధానం వల్ల, వైరుధ్యాలు నిహితమైన విధానాల వల్ల ఎలా సాధ్యం?

సముద్ర తీరం వెంట సార్వభౌమ జలాల- టెర్రిటోరియల్ వాటర్స్-లో అంటే తీరం నుంచి పన్నెండు మైళ్లవరకు సముద్రంలోకి విస్తరించిన ప్రాంతంలోను, పర్యావరణం భయంకరంగా ఇదివరకే పాడయిన ప్రాంతాలలోను ఏర్పడే పరిశ్రమలకు మాత్రమే ఇకపై కేంద్ర ప్రభుత్వం వారి అనుమతి అవసరమట! ఇలా రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక అధికారాలను కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వం 'సమాఖ్య'- ఫెడరల్- స్ఫూర్తిని పెంచింది. కానీ కేంద్ర ప్రభుత్వం తమ అధికారాలను హరించివేస్తోందని కొన్ని రాష్ట్రాల ప్రభుత్వ నిర్వాహకులు నిరంతరం ప్రచారం చేస్తున్నారు. ఇది మన రాజ్యాంగ ప్రక్రియలో నిహితమై ఉన్న రాజకీయ వైరుధ్యం! నగరాలలోని వాయుకాలుష్యానికి ప్రధాన కారణం దశాబ్దుల తరబడి పెరిగిన, పెరిగిపోతున్న అంతస్థుల భవనాలు! ఈ వాస్తవం సామాన్య ప్రజలకు తెలుసు, మేధావులకు తెలుసు, ప్రభుత్వ నిర్వాహకులకు మరింతగా తెలుసు! నగరాలు పట్టణాలు జనావాసాలు అడ్డంగా విస్తరించడం సహజమైన ప్రగతి. మానవులు నిలువున పెరగడం అందం, చందం, ఆరోగ్యం.. కానీ నగరాలు నిలువున పెరుగుతున్నాయి. విపరీతమైన తిండి- జంక్ ఫుడ్- తిని తిని మానవులు పొట్టలు పెంచుకొని అడ్డంగా పెరుగుతుండడం- నిలువున పెరుగుతున్న నగరాలలో ఆవిష్కృతమౌతున్న జీవన దృశ్యం. ఒక ఇంటిని, దాని పక్కన ఉన్న మరో ఇంటిని- రెండిళ్లను- కూలగొట్టి అదే స్థలంలో నాలుగు అంతస్థులతో పదహారు 'ఫ్లాట్'లు నిర్మిస్తున్నారు. ఫలితంగా రెండు కుటుంబాలు గాలి పీల్చి వదలిన స్థలంలో పదహారు కుటుంబాల వారు గాలిని పీల్చి వదలుతున్నారు. ఫలితంగా వాయు మండలంలో కర్బన వాయువు కేంద్రీకృతమై గాలి కలుషితం అయిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మూడువందల కోట్ల రూపాయల ఖర్చుతో అమలు జరిపే వాయు ప్రక్షాళన కార్యక్రమానికి ఎక్కడికక్కడ ఈ అంతస్థుల భవనాలు విరుగుడు. ఒక వాహనం నిలిచినచోట సగటున ఐదు వాహనాలు నిలబడుతున్నాయి- ఒక వాహనం రోడ్డెక్కినచోట సగటున ఐదు వాహనాలు రోడ్డెక్కుతుండడానికి కారణం అంతస్థుల భవనాలు. ఫలితంగా వాహనాల నుండి వెలువడుతున్న వేడి పొగల వల్ల పర్యావరణం పొగ చూరిపోతోంది.. అంతస్థుల భవనాల నిర్మాణానికి ఇకనైనా ప్రభుత్వాలు అనుమతినివ్వడం మానుకున్నట్టయితే 'వాయు ప్రక్షాళన' కార్యక్రమం విజయవంతం కావచ్చు...

పెద్ద పెద్ద పరిశ్రమలను నగరాలలోను నగరాల చుట్టూ మాత్రమే కేంద్రీకరిస్తుండడం వాయుకాలుష్యానికి మాత్రమేకాదు సకల విధ కాలుష్యాలు పెరగడానికి కారణమన్నది కూడ సర్వజన విదితం. ఈ సంగతిని పక్కకుపెట్టి దీపావళి పండుగరోజున 'బాణసంచా' పేల్చడం వల్ల, వినాయక ప్రతిమలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల కాలుష్యం పెరుగుతోందన్న ప్రచారం జరుగుతోంది.. 'ప్రపంచీకరణ' మారీచ మృగ మాయాజాలం విస్తరించిపోయింది!

అందరి కళ్లూ యూపీపైనే!

> ***అఖిలేశ్, మాయావతి ఒక వైపు, మరోవంక రాహుల్ గాంధీ వేస్తున్న ఎత్తుగడలు ఫలిస్తే బీజేపీకి వంద వరకు సీట్లు తగ్గే అవకాశం ఉంది. అదే జరిగితే రాజకీయ సమీకరణలు విస్తృతంగా మారే అవకాశం లేకపోలేదు. ఈ సీట్లను ఎక్కడ పూరించుకొని తిరిగి అధికారం కైవసం చేసుకోవాలో ఇప్పుడు బిజెపి ముందున్న అసలు ప్రశ్న. బలమైన మోదీ నాయకత్వం పట్ల బిజెపి నేతలలో ఉన్న అపోహలు ఇప్పుడిప్పుడే తొలగిపోతున్నాయి. 2017లో ఉత్తర ప్రదేశ్‌లో గెలుపు కోసం రైతురుణ మాఫీ పథకాన్నీ తానే ప్రకటించి, ఇప్పుడు అదే పథకంతో కాంగ్రెస్ మూడు రాష్ట్రాలలో బిజెపిని గద్దె దింపే సరికి మోదీ తమాయించుకోలేక పోతున్నారు. లాలీపప్ హామీలతో ప్రజలను వంచన చేస్తున్నారని అంటూ విరుచుకు పడుతున్నారు.***

మరో మూడు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగబోతున్న సమయంలో ఇప్పుడు అందరి దృష్టి ఎక్కువగా ఉత్తర ప్రదేశ్ వైపే మరలుతున్నది. ఉత్తర ప్రదేశ్ భారత్- భారత్ ఉత్తర ప్రదేశ్ అని తరచూ అంటారు. ఎందుకంటే దేశంలోని 545 నియోజక వర్గాలలో 80 ఆ రాష్ట్రంలోనే ఉన్నాయి. అక్కడ పట్టు సాధిస్తే గాని కేంద్రంలో అధికారంలోకి రావడం సాధ్యం కాదు. మన ప్రధాన మంత్రులలో అత్యధికులు ఆ రాష్ట్రం నుండే వచ్చారు. అత్యంత ప్రజాదరణతో ప్రధాన మంత్రి పదవి పొందిన నరేంద్ర మోదీ సహితం తనకు ఆమోదత లభింప చేసుకోవడానికి ఆ రాష్ట్రంలోని వారణాసి నుండి పోటీ చేయవలసి వచ్చింది.

వచ్చే లోక్‌సభ ఎన్నికలలో నరేంద్ర మోదీకి ప్రధాన పోటీదారునిగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆవిర్భవిస్తున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వంపై ముప్పేట దాడి చేయడంలో ఆయనే ముందుంటున్నారు. ఒక విధంగా మోదీ ప్రభుత్వ అజెండాపై ఆయన విశేషమైన ప్రభావం చూపుతున్నారు. అయితే ఈ ఇద్దరు నాయకులు సహితం ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్ లో జరుగుతున్న రాజకీయ పరిణామాలలో పలు ప్రతికూలతలను ఎదుర్కొంటున్నారు.

దశాబ్దాలకు పైగా రాజకీయంగా బద్ధ శత్రువులుగా వ్యవహరించిన సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీలు ఇప్పుడు చేతులు కలపడంతో యూపీ రాజకీయ స్వరూపంలో పెను మార్పులు ఏర్పడుతున్నాయి. ఈ మార్పులే రెండు ప్రధాన జాతీయ పక్షాలైన బిజెపి, కాంగ్రెస్‌లను కలవర పరుస్తున్నాయి. గత ఎన్నికలలో 80 సీట్లలో బీజేపీ సొంతంగా 71 సీట్లను గెల్చుకోగా, మిత్ర పక్షం మరో రెండు సీట్లను గెల్చుకొంది. కానీ ఇప్పటి పరిస్థితులు అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి.

అఖిలేశ్ యాదవ్, మాయావతి కలసి మహాకూటమిని ఏర్పాటు చేయడం, తనను వదిలి వేయడంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహానికి ఒక పెద్ద దెబ్బ తగిలినదని చెప్పవచ్చు. కాంగ్రెస్ పారీకి ప్రస్తుతం యూపీలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు సీట్లను మించి ఇవ్వడానికి అఖిలేశ్, మాయావతి లేదు. గత ఎన్నికలలో మొదటి, రెండవ స్థానాలలో ఉన్న ఎనిమిది సీట్లకు కాంగ్రెస్ ఒప్పుకోవడం లేదు. కాంగ్రెస్ సుమారు 20 సీట్లు కోరుతున్నది. అందుకు ఎవ్వరూ ఇష్టపడటం లేదు. రాహుల్ గాంధీతో పొత్తు వద్దనుకోవడానికి అఖిలేష్, మాయావతిలకు ఎవరి కారణాలు వారికి ఉన్నాయి. 2017లో కాంగ్రెస్ తో పొత్తు ఏర్పాటు చేసుకొని తీవ్ర పరాభవానికి గురి కావడాన్ని అఖిలేష్ ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు తమ ఎమ్మెల్యే మద్దతు ఇచ్చినా అతనికి మంత్రి పదవి ఇవ్వక పోవడంతో అసహనంగా ఉన్నారు. కాంగ్రెస్ తో పొత్తు ఏర్పాటు చేసుకొంటే మన ఓట్లు ఇవ్వడమే గాని, కాంగ్రెస్ పార్టీ ఓటర్లు ఇతరులకు బదిలీ కారనే అభిప్రాయం కూడా వ్యక్తం అవుతున్నది. దళిత వర్గాలను తన వైపు తిప్పుకోవడం కోసం రాహుల్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ఉండడం, ముఖ్యంగా యువ దళిత నాయకులను ఒకొక్క రాష్ట్రంలో ప్రోత్సహిస్తూ ఉండటంతో మాయావతి ఉడికి పోతున్నారు. రోహిత్ వేముల ఉదంతం నుండి దళితులకు సంబంధించి పలు అంశాలపై రాహుల్ ఉద్వేగంగా స్పందించారు. రాహుల్ తో చేతులు కలిపితే దళిత ఓటర్లను తిరిగి కాంగ్రెస్ ఒడ్డుకు చేర్చి, తాను మాత్రం ఒంటరిగా మిగిలి పోవలసి వస్తుందని ఆమె ఆందోళన చెందుతున్నారు. ఎస్‌పీ, బిఎస్‌పీ గరిష్టంగా ఎంపీ సీట్లను ఇక్కడ గెల్చుకొని కేంద్రంలో ప్రధాని అభ్యర్థి నిర్ణయంలో నిర్ణయాత్మక పాత్ర వహించాలని అఖిలేశ్, మాయావతి భావిస్తున్నారు. అందుకనే కాంగ్రెస్‌తో పొత్తు ఏర్పాటు చేసుకొనే నేతలకు జాతీయ స్థాయిలో కూడా వీరు దూరంగా ఉంటున్నారు.

రాహుల్ గాంధీని దూరంగా నెట్టే ప్రయత్నం చేస్తున్న మమతా బెనర్జీ, కేసీఆర్ వంటి నేతల పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. పైగా కాంగ్రెస్ విడిగా పోటీ చేస్తేనే తమకు లాభం అని వీరిద్దరూ అవగాహనకు వచ్చారు. ఎందుకంటే బిజెపికి మద్దతుగా ఉన్న అగ్రవర్ణాల వారిని కొంతమేరకు కాంగ్రెస్ చీల్చ గలదని, వారెట్లాగు తమకు ఓట్లు వేయరని భావిస్తున్నారు. పైగా కాంగ్రెస్ ఓటర్లు ఆ విధంగా చేస్తే బీజేపీని కొంతమేర బలహీనం చేయవచ్చని అనుకొంటున్నారు. అదే కాంగ్రెస్ తో తాము చేతులు కలిపితే అగ్రవర్ణాల వారంతా గంపగుత్తుగా బిజెపికి ఓట్లు వేసే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. కాంగ్రెస్‌తో తాము చేతులు కలిపితే- ఆ పార్టీ సంప్రదాయ ఓటర్లు బిజెపికి మారే ప్రమాదం ఉన్నదని మాయావతి, అఖిలేశ్ అంచనా వేస్తున్నారు.

త్రిముఖ పోటీలో తాము యూపీలో 50 సీట్ల వరకు గెలుపొందవచ్చని వీరు అంచనా వేస్తున్నారు. బిజెపి సీట్లు 25కు పరిమితం కావచ్చని, కాంగ్రెస్‌కు రెండు మించి రావని అంచనాకు వస్తున్నారు. ఈ పరిణామాలను గమనించి రాహుల్ గాంధీ సహితం చిన్న చిన్న పార్టీలను కూడదీసుకుని ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అఖిలేశ్,మాయావతిలతో పొత్తుకు సిద్ధ పడిన అజిత్‌సింగ్ నాయకత్వం లోని ఆర్‌ఎల్‌డి మూడు సీట్లు అంటే ఇప్పుడు వెనుకడుగు వేస్తున్నది. కనీసం ఆరు సీట్లు అజిత్ డిమాండ్ చేస్తున్నారు. అజిత్ సింగ్ తో పాటు బిజెపిలో అసంతృప్తితో ఉన్న రాష్ట్ర మంత్రి ఓం ప్రకాష్ రాజభర్ నాయకత్వంలోని సుహదేవ భారతీయ సమాజ్ పార్టీ, అప్నా దళ్ లను దరి చేసుకొని మూడో శక్తిగా మారే ప్రయత్నం చేస్తున్నారు. 2014 ఎన్నికలలో ఎస్పీ, బీఎస్పీలకు కలిపి 43.19 శాతం ఓట్లు రాగా, బిజెపికి 43.63 శాతం ఓట్లు వచ్చాయి. 2017 అసెంబ్లీ ఎన్నికలలో కూడా ప్రతిపక్షాలకు మొత్తంగా బిజెపి కన్నా ఎక్కువగా ఓట్లు వచ్చాయి. అందుకనే ఇప్పుడు అఖిలేష్, మాయావతి కలసి ఏర్పాటు చేస్తున్న మహాకూటమిని- బిజెపిని గద్దె దింపడం కోసం కాంగ్రెస్ ఆమోదంతో వేస్తున్న ఒక పెద్ద రాజకీయ ఎత్తుగడగా కూడా పలువురు భావిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులపై మోదీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను విచ్చలవిడిగా వినియోగిస్తూ ఉండడంతో నేరుగా కాంగ్రెస్ తో చేతులు కలిపితే తనను కూడా ఇరికించే అవకాశం ఉన్నాడని మాయావతి ఒకవంక భయపడుతున్నారు. మహాకూటమి కారణంగా బిజెపి ఉత్తర ప్రదేశ్ లో 50 వరకు సీట్లను కోల్పోతే, ఈ మధ్య అధికారం కోల్పోయిన మూడు హిందీ రాష్ట్రాలలో మరో 30 సీట్లను కోల్పోయే అవకాశం లేకపోలేదు. అగ్రవర్ణాలలోని పేదలకు 10 శాతం రేజర్వేషన్లు కల్పించడం ద్వారా మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకోవడం కోసం ప్రధాన మంత్రి మోదీ ఒక బ్రహ్మాస్త్రం ప్రయోగించారని బిజెపి నేతలు సంబర పడుతున్నా ఎన్నికలలో అదనంగా కలిగించే ప్రయోజనం ఏమేరకు ఉంటుందో చూడవలసి ఉంది.

బిజెపికి సాంప్రదాయసిద్ధంగా మద్దతు దారులుగా ఉంటున్న మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకోవడం కోసమే రిజర్వేషన్ల తాయిలాన్ని తెరపైకి రావడం అందరికి తెలిసిందే. అయితే ఈ వర్గాలు 2014లో మొత్తం మీద బీజేపీకే వోటు వేశాయి. మోదీ మీద ఎన్నో ఆశలు పెంచుకొని, ఆయనను ప్రధాన మంత్రి పీఠం మీదకు తీసుకు వచ్చింది ఈ వర్గాలే. అయితే ఆయన పరిపాలనలో ఎక్కువగా నష్టాలు గురయినదీ ఈ వర్గాలే. అందుచేత వారిలో పెరిగిపోతున్న అసంతృప్తిని కట్టడి చేయడం కోసం ఈ చర్య తీసుకున్నారు. దానితో అదనంగా వచ్చే ఓట్లు ఉండే అవకాశం ఉండదు.


ఇప్పుడు ప్రతిపక్షాలు గతంలో బిజెపికి ఓటు వేసిన వారిని తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేయడం లేదు. తమ మధ్య ఓట్ల చీలిక నివారించి, బీజేపీని ఎదుర్కొనే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తం ఓటర్లలో మూడో వంతుకన్నా తక్కువ మంది మద్దతుతో అధికారంలోకి వచ్చిన మోదీ తన పాలనాకాలంలో అదనంగా ఎవ్వరిని దగ్గరకు చేర్చుకోలేక పోయారు. పైగా ఆయనపై కొండంత నమ్మకం పెట్టుకున్న అనేకమందిని తీవ్రంగా నిరాశ పరచారు. ఇటువంటి పరిస్థితులలో ఉత్తర ప్రదేశ్ లలో జరుగుతున్న రాజకీయ పరిణామాల్లో జాతీయ రాజకీయాలపై తగు ప్రభావం చూపే అవకాశం ఉంది.

అఖిలేశ్, మాయావతి ఒక వైపు, మరోవంక రాహుల్ గాంధీ వేస్తున్న ఎత్తుగడలు ఫలిస్తే బీజేపీకి వంద వరకు సీట్లు తగ్గే అవకాశం ఉంది. అదే జరిగితే రాజకీయ సమీకరణలు విస్తృతంగా మారే అవకాశం లేకపోలేదు. ఈ సీట్లను ఎక్కడ పూరించుకొని తిరిగి అధికారం కైవసం చేసుకోవాలో ఇప్పుడు బిజెపి ముందున్న అసలు ప్రశ్న. బలమైన మోదీ నాయకత్వం పట్ల బిజెపి నేతలలో ఉన్న అపోహలు ఇప్పుడిప్పుడే తొలగిపోతున్నాయి. 2017లో ఉత్తర ప్రదేశ్ లో గెలుపు కోసం రైతురుణ మాఫీ పథకాన్నీ తానే ప్రకటించి, ఇప్పుడు అదే పథకంతో కాంగ్రెస్ మూడు రాష్ట్రాలలో బిజెపిని గద్దె దింపే సరికి మోదీ తమాయించుకోలేక పోతున్నారు. లాలీపప్ హామీలతో ప్రజలను వంచన చేస్తున్నారని అంటూ విరుచుకు పడుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు రేజర్వేషన్లు కల్పించే ఆలోచన ప్రభుత్వానికి లేదని సంబంధిత మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా పార్లమెంట్‌లో చెప్పిన రోజు సాయంత్రమే మంత్రి వర్గం రిజర్వేషన్ల పథకాన్ని తెరపైకి తేవడం గమనిస్తే ఈ ప్రభుత్వాన్ని ఎవరు నడిపిస్తున్నారని అనుమానం కలుగుతున్నది. సిబిఐ డైరెక్టర్ గా అలోక్ వర్మను తొలగించిన తీరు సహితం ప్రధానితో నెలకొన్న అభద్రతా భావాన్ని వెల్లడి చేస్తున్నది. ఈ ప్రభుత్వాన్ని కొన్ని అలౌకిక శక్తులు నడిపిస్తున్నాయా? అనే అనుమానాలు కలిగిస్తున్నాయి.

అయోధ్యలో రామమందిరం నిర్మాణం గురించి మొత్తం హిందూ సమాజం నిలదీస్తున్న పుటికీ పట్టించుకోని ప్రధాని సిబిఐ డైరెక్టర్ విషయంలో మాత్రం కంగారుగా అడుగులు వేయడం దేనిని సూచిస్తున్నది? ఎటువంటి అదృశ్య, స్వార్థపర శక్తులు ఆయనను నడిపిస్తున్నాయి? ఇవే అనుమానాలు నేడు మనలను వెంటాడుతున్నాయి. ప్రధానికి సన్నిహితుడైన ఒక పారిశ్రామిక వేత్తకు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎర్రతివాచీ పరచి అనూహ్యమైన రాయితీలు ఇవ్వడాన్ని గమనిస్తే - మన రాజకీయాలపై కార్పొరేట్ శక్తులు నిర్ణయాత్మక ప్రభావం చూపుతున్నాయని భావించవలసి వస్తున్నది.

-చలసాని నరేంద్ర

అపర ధన్వంతరి 'ఎల్లాప్రగడ'



బీదరికంలో పుట్టి అకుంఠిత దీక్షతో భీమవరం నుండి బోస్టన్ చేరి జీవితాన్ని వైద్య పరిశోధనలకు అంకితం చేసిన తెలుగుబిడ్డ ఎల్లాప్రగడ సుబ్బారావు. ఎన్నో వ్యాధులకు దివ్యమైన ఔషధాలను కనిపెట్టిన అపర ధన్వంతరి ఆయన. 1895 జనవరి 12న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఆయన జన్మించారు. తండ్రి జగన్నాథం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తూ ముందుగానే పదవీ విరమణ చేయడంతో ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. ఇలాంటి ఆర్థిక పరిస్థితిలో సుబ్బారావు తరచుగా పాఠశాలకు వెళ్లలేకపోయేవారు. కాశీలో తీర్థయాత్రికులకు అరటిపండ్లు అమ్మితే లక్షల రూపాయలు సంపాదించవచ్చని ఎవరో చెబితే విని 13 ఏళ్ల వయసులో బంధువుల కుర్రాడితో కలిసి పారిపోయేందుకు ప్రయత్నించారు. తల్లి ఆ విషయం పసిగట్టి ఆ ప్రయత్నాన్ని విరమింపజేసింది. 1911లో మెట్రిక్యులేషన్ పరీక్షలో సుబ్బారావు రెండుసార్లు ఫెయిల్ అయ్యారు. తల్లి మాత్రం పట్టువిడవకుండా ఎంతో కష్టపడి మద్రాసులోని హిందూ స్కూలుకు ఆయనను పంపింది. 1913లో తండ్రి చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. కుర్రాడి చదువుఆగిపోకూడదని తల్లి తన పుస్తెలతాడును విక్రయించి డబ్బును సమకూర్చింది. ఈ సంఘటనతో చలించిపోయిన సుబ్బారావు తన జీవితంలో ఎన్నడూ పరీక్ష తప్పలేదు.

గణితంలో డిస్టింక్షన్ సాధించడంతో ఆ అంశంలో 'ఆనర్స్' చేయమని అందరూ ప్రోత్సహించినా సుబ్బారావు మాత్రం కాలేజీలో చేరాడు. సన్యాసిగా మారి రామకృష్ణా మిషన్‌లో వైద్యసేవలు అందించాలనేది ఆయన ఆశయం. కానీ అందుకు తల్లి అనుమతి ఇవ్వలేదు. సుబ్బారావుకు హఠాత్తుగా 'స్ప్రూ' వ్యాధి (ఆహార నాళాలలో పుండు) బారిన పడ్డాడు. ఆ కాలంలో ఈ వ్యాధి వచ్చినట్లయితే బతకడమే కష్టం అనేవారు. సుబ్బారావు ఆయుర్వేద మందుల తో ఎలాగో ఒకలా ఆ వ్యాధి నుండి బయటపడ్డారు. 1919 మే 10న 12 ఏళ్ల కస్తూరి శేషగిరితో సుబ్బారావుకు వివాహమైంది.

స్వదేశంపై ఉన్న మమకారంతో విదేశీ దుస్తులను బహిష్కరించి ఖద్దరుతో కాలేజీకి వెళితే శ్వేత జాతీయుడైన సర్జన్ సుబ్బారావుపై మండిపడేవాడు. అన్నిట్లో మంచి మార్కులతో పాసైనప్పటికీ సర్జరీలో మాత్రం బొటాబొటీ మార్కులు వేశారు. దీంతో ఎంబీబీఎస్ డిగ్రీ కాకుండా అంతకన్నా తక్కువదైన ఎల్.ఎం.ఎస్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఆ కాలంలో పైచదువులకి బ్రిటన్ వెళ్లాలన్న భావన భారతీయుల్లో ఉండేది. బ్రిటన్ వాళ్లంటే నచ్చని సుబ్బారావు అమెరికా వెళ్లాలని భావించారు. ఇందు కోసం హార్వర్డ్ మెడికల్ కాలేజీకి ఆయన లేఖ రాయడంతో సానుకూల స్పందన వచ్చింది. కానీ చేతిలో డబ్బులు లేవు. వారంరోజుల తేడాతో తన ఇద్దరు సోదరులు 'స్ప్రూ' వ్యాధితో మరణించడంతో సుబ్బారావు మనసును తీవ్రంగా కలచివేశాయి. ఎలా అయినా ఈ వ్యాధికి మందు కనుగొనాలనే పట్టుదల ఆయనలో పెరిగింది.

కాకినాడలోని ఓ సంస్థ ఆదుకోవడంతో 1923 సెప్టెంబర్‌లో అమెరికాకు ప్రయాణమయ్యారు. భీమవరం నుంచి బోస్టన్ వెళ్లిన సుబ్బారావు మళ్లీ భారతావనిపై అడుగుపెట్టలేదు. నిరంతరం వైద్య పరిశోధనలోనే ఉండి ఎల్లలు సైతం మర్చిపోయారు. భార్య శేషగిరి మగబిడ్డను ప్రసవించగా 'స్ప్రూ' వ్యాధి కారణంగా ప్రాణం నిలవలేదు. ఆ తర్వాత సుబ్బారావు ఈ వ్యాధికి వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. అమెరికాలో అడుగుపెట్టే సరికి తన దగ్గరున్న డబ్బంతా అయిపోయింది. దీంతో సుబ్బారావు బోస్టన్‌లోని ఒక ఆస్పత్రిలో పారిశుధ్య పనులను చేసేందుకు సైతం వెనుకాడలేదు. రాత్రంతా ఆస్పత్రిలో పనిచేస్తూ, పగలంతా కాలేజీలో చదువుతూ ఎదిగిన వ్యక్తి ఆయన. ప్రతిభతో ప్రొఫెసర్ల మెప్పు పొందుతూ స్కాలర్‌షిప్ సాధిస్తూ పరిశోధనలను సాగించారు. డాక్టర్ 'ఫిస్కే' సహాయంతో శరీర కణాలలోని భాస్వరాన్ని సరిగ్గా, తేలిగ్గా నిర్ధారణ చేసే ''రేపిడ్ కెలరోమెట్రిక్ మెథడ్''ను ఆవిష్కరించి 1924లో తొలిసారిగా ప్రపంచానికి ఆయన పరిచయమయ్యారు.

ఇదే 'ఫిస్కే సుబ్బారావు' పద్ధతిగా పేరొందింది. ఆ తరువాత శరీరంలోని కండరాల శక్తికి మూల పదార్థం 'అడినోసిస్ ట్రై ఫాస్ఫేట్' అని నిర్ధారించి జీవరాశి భౌతిక ప్రక్రియలను నిర్ణయించేది ఇదేనని వెల్లడించారు. దీంతో 1922లో నోబుల్ బహుమతి పొందిన శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలు సైతం తప్పని రుజువైంది. అయినా ఆయనకు నోబెల్ బహుమతి రాలేదు.

తన పరిశోధనలో అతి ముఖ్యమైనది 'స్ప్రూ' వ్యాధిని అరికట్టే ఫోలిక్ యాసిడ్ విటమిన్‌ను కనుగొనడం. 'బోదకాలు', 'ఇసినోఫిలియా'ల వంటి వ్యాధులకు ఉపయోగపడే 'హైట్రాజెన్', క్షయవ్యాధి నివారణగా పేర్కొనే 'ఇనోనెక్'తో పాటు కలరా, టైఫాయిడ్, ప్లేగు, అతిసార వంటి వ్యాధులకు దివ్య ఔషధంగా ఉపయోగపడే 'టెట్రాసైక్లిన్' యాంటీ బయోటిక్‌తోపాటు పిల్లల్లో బ్లడ్‌కాన్సర్‌ను అరికట్టే 'మెథాట్రెక్సేట్', 'అరియోమైసిన్' వంటి ఔషధాలు సుబ్బారావు పరిశోధనల ఫలితాలే. ఎన్నో పరిశోధనలు చేసినా అవార్డుల కోసం ఆయన ఏనాడు ఆరాటపడలేదు. 'లేడర్లే' సంస్థ సుబ్బారావును తమ డైరెక్టర్‌గా నియమించింది. ఆయన జీవితంలో చివరి క్షణం వరకూ ఆ సంస్థలోనే కొనసాగి ఎన్నో పరిశోధనలు చేశారు. కొన్ని యాంటీ బయోటిక్‌లకు 'సుబ్బా మైసిన్' 'సుబ్బరోమైసిన్' అని లేడర్లే సంస్థ పేర్లు పెట్టుకుంది. 1948 ఆగస్టు 9న గుండెపోటుతో సుబ్బారావు కన్నుమూశారు. అమెరికా పత్రికలు ఆయనను ఎంతగానో కీర్తిస్తే, భారతీయ పత్రికలు మాత్రం తగిన గౌరవం ఇవ్వలేదు.


-జి.శ్రీలత రమేశ్

నవభారత నిర్మాణం
నరేంద్రుడి స్వప్నం

ప్రపంచంలో పారిశ్రామిక విప్లవం నిజంగానే ఒక విప్లవాన్ని సృష్టించింది. పాశ్చాత్య దేశాలలో జాతీయ భావాలు బలపడి జాతీయ రాజ్యాలు ఏర్పడుతున్న సమయమది. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ చైతన్యం బలం పుంజుకుంటున్న సమయమది. ఆ సమయంలో ప్రపంచంలో ఇద్దరు గొప్ప వ్యక్తులు జన్మించారు.. 1818లో కారల్ మార్క్స్ జన్మించాడు. భారత్‌లో 1863లో వివేకానందుడిగా ప్రసిద్ధి పొందిన నరేంద్రుడు జన్మించాడు. అందులో ఒకరు మానవ చరిత్రను గతితార్కిక భౌతిక వాద పద్ధతిలో వ్యాఖ్యానించి భావి నాగరికతను విప్లవాత్మకం చేసేందుకు ప్రయత్నించారు. మరొకరు భౌతిక వాద నాగరికత ఉత్థాన పతనాలను పరిశీలించి ప్రాక్పశ్చిమ మత వ్యవస్థలను హేతుబద్ధమైన, చైతన్యశీలమైన తిరుగులేని వేదాంతపు తర్కంలో విప్లవీకరించారు.

ప్రపంచంలో క్రైస్తవానికి తిరుగులేదని నిరూపించుకొనేందుకు 1893లో 'ప్రపంచ మత మహా సమ్మేళనం' అమెరికాలో ఏర్పాటు చేయగా, భారతీయ వేదాంతం, ఆధ్యాత్మిక జ్ఞానానికి తిరుగులేదని నిరూపించాడు స్వామి వివేకానంద. ఏ విప్లవానికైనా మానవుని నైతిక, ధార్మిక ప్రవర్తనే కీలకమని ఆయన చెప్పాడు. ఆధ్యాత్మిక శక్తిసంపద లేకపోతే మతం కూడా అంధకారమైపోతుందని, అందుకే భౌతిక వాదానికి కొనసాగింపుగా ఆధ్యాత్మికత అనేది ఎంతో అవసరమని స్వామి వివేకానంద భావించాడు.

స్వామి వివేకానందుడు తన ఆధ్యాత్మిక జ్ఞానంతో మానవ నాగరికతా వికాసానికి, సాంస్కృతిక జాతీయ వాదానికి బీజం నాటాడు. ఆ విత్తనం ఈరోజున ఒక ఫల రూపంలో ప్రపంచమంతటా కనబడుతున్నది. ఆధ్యాత్మికత ఈరోజు



ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. మతం వద్దు ఆధ్యాత్మిక జ్ఞానం కావాలని కోరుకొనే వారి సంఖ్య ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు పెరుగుతున్నది.

చాలా దేశాలలో జీవన శైలిలో వస్తున్న మార్పులు, సుఖాల కోసం వెంపర్లాడడాన్ని వివేకానందుడు ఆమోదించలేదు. ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవితం గడపటానికి కావలసిన కనీస సౌకర్యాలు అందరికీ సమకూరాలని, అదే మనిషికి ఆధ్యాత్మిక సాధనకు కావలసిన వెసులుబాటు కలిగిస్తుందని, మానసిక శక్తిని అందిస్తుందని వివేకానందుడు భావించాడు. ''అత్యధిక సంపదల వల్ల కలిగే భోగ లాలసత గాని, తీవ్ర దారిద్ర్యం వల్ల కలిగే దైన్యం కాని లేని స్థితిలో క్షణికమైన ప్రాపంచిక ప్రలోభాలపట్ల వైరాగ్యం, నిస్సంగత్యం జనిస్తాయి. సామాజికంగా ఆర్థికంగా మధ్యస్థ స్థితివల్ల జనించే వైరాగ్యానికి ఆధ్యాత్మిక సాధనను ప్రేరేపించగలిగే ప్రభావశీలురైన వ్యక్తులు భారతదేశంలో తయారుకావాలి. అటువంటి వ్యక్తులు భారత దేశ సందేశాన్ని ప్రపంచానికి అందించ గలుగుతారు'' అని చెప్పారు. స్వామి వివేకానందునిలోని ప్రగాఢమైన దేశభక్తి, ఈ దేశ జన సామాన్యం సముద్ధరణపై ఆయన పడిన తపనలో మౌలికమైన ఆకాంక్షలను గ్రహించకుండా ఆయనను దేశభక్తియుతుడైన స్వాతంత్ర్య యోధునిగానో, మాయ ముసుగు ధరించిన కమ్యూనిస్టు మేధావిగానో భావిస్తూ వివేకానందుడి గురించి అపోహలు సృష్టించినవారు కూడా ఉన్నారు. వివేకానందుడు సామ్యవాదే కాని మార్క్సులాగా భౌతికవాది కాదు.

సామ్యవాదం- వివేకానంద - మార్క్స్

ఈ దేశంలో సామ్యవాద భావజాల వికాసంలో వివేకానందుని ప్రాముఖ్యతను మొట్టమొదటిగా గుర్తించినవారు కే.దామోదరన్ అనే భారతీయ కమ్యూనిస్టు మేధావి. 'ఇండియన్ థాట్' అనే పుస్తకంలో- 'రష్యాలో సామ్యవాద విప్లవం రావటానికి రెండు దశాబ్దాల ముందే వివేకానందుడు సామ్యవాద నినాదాన్ని లేవనెత్తాడు. నవతరానికి ఆయన గొప్ప స్ఫూర్తిదాయకుడు' అని అనటంలో ఆశ్చర్యం లేదని వివరించాడు. స్వామి వివేకానంద వ్యక్తిత్వాన్ని, ఆయన సందేశాన్ని సామ్యవాద దేశాలు ప్రస్తుతించాయి. రష్యా,చైనాలలో స్వామివివేకానంద 120 జయంతిని అధికార పూర్వకంగా నిర్వహించారు. వివేకానంద ఆదర్శాలను ప్రస్తుతిస్తూ రష్యా, చైనాలలో అనేక పుస్తకాలు కూడా వచ్చాయి.

సామాజిక పరివర్తన అనే యంత్రానికి తగిన ఇంధనం కావాలి, ఆ ఇంధనమే వేదాంతమని వివేకానందునికి స్పష్టమైన అవగాహన ఉంది. వివేకానందుని సామాజిక చింతనలో మరో స్పష్టత జాతీయ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థానంలో ఉన్న వారిని పడగొట్టటం కాదు, దిగువున ఉన్న వారిని ఉన్నత స్థితికి తీసుకొని వెళ్ళటం. మార్క్స్ మాత్రం భారమంతటినీ కేంద్రీకృత సమాజంపైన, సామూహిక జీవనంపై ఉంచాడు. మార్క్స్‌కు భౌతికవాదమే మూలాధారం, వివేకానందునికి సత్య సిద్ధాంతమైన వేదాంతం ముఖ్యమైనది. 'తత్వమసి' అనే మహావాక్యంలో అద్వైత సిద్ధాంత సారమున్నది. అందుకే వివేకానందుడు ఈ దేశం బాగుపడాలంటే జన సామాన్యాన్ని జాగృతపరచాలని చెప్పేవాడు. మన జాతి చేసిన అతి పెద్ద పాపం జనసామాన్యాన్ని నిర్లక్ష్యం చేయడం, ఆ జన సామాన్యులను ఎదగనిస్తే ఈ సమాజం బాగుపడుతుంది అని చెప్పారు. ఈ నూతన మంత్రమే ఈ దేశంలో గొప్ప పరివర్తనకు నాంది అని చెప్పవచ్చు.

జాతీయత- మార్క్స్- వివేకానంద

జాతీయత విషయంలో మార్క్స్, వివేకానందుల అభిప్రాయాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. 19వ శతాబ్దంలో ప్రపంచమంతటా జాతీయభావాలు ఉప్పొంగాయి. ఐరోపా ఖండంలోని వివిధ దేశాలలో జాతీయ భావాలు ప్రభావంతో రాజ్యవ్యవస్థ కూడా ఏర్పడింది. భారతదేశంలో కూడా బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా జాతీయ చైతన్యం నిర్మాణమైంది. ఆ కాలంలో మార్క్స్ మాత్రం జాతీయభావంపై అంతగా దృష్టి పెట్టలేదు.

ఆర్థిక శక్తులు ఆడే ఆటలో నుంచి జాతుల పుట్టుకను వెతికి పట్టుకోవలసి ఉందని మార్క్స్ అభిప్రాయపడ్డాడు. ఈ విషయంలో వివేకానందుని ఆలోచనలు చాలా భిన్నంగా ఉన్నాయి. వివేకానందుడు సాంస్కృతిక జాతీయవాదానికి చాలా పెద్దపీట వేసాడు. 'జాతీయతకు సంస్కృతే ఆధారం. ప్రపంచంలో ప్రతి దేశం పుడుతుంది కాని పుట్టించబడదు. ప్రతి దేశం ఒక లక్ష్యాన్ని నెరవేర్చటానికి దైవ సంకల్పంతో జన్మిస్తుందని' ఆయన చెప్పారు.

హిందుత్వం- మార్క్స్- వివేకానంద

'భారతీయులు' అనే అర్థంలో హిందువులని, 'భారతదేశం' అనే అర్థంలో హిందుస్థాన్ అని మార్క్స్ మాట్లాడుతూ ఉండేవాడు. భారతదేశంలో ఏ మతానికి చెందిన వారైనా అందరూ హిందువులేనని, ఒకవేళ మతాలు వేర్వేరుగా చెప్పవలసి వచ్చినప్పుడు హిందువులు, ముస్లింలు అని చెప్పేవారు! భారతదేశస్థులను ఉమ్మడిగా చెప్పవలసి వచ్చినప్పుడు హిందువులు అనే పదం వాడారు. మన స్వాతంత్ర్యం చాలావరకు హిందువులపైన, హిందువుల ఐక్యతపైనే ఆధారపడి ఉందని మార్క్స్ అన్నారు.

హిందుత్వంపై స్వామి వివేకానంద 'నేను హిందువునని గర్వంగా చెప్పుకుంటే వేల సంవత్సరాల మహాపురుషుల పరంపర, చరిత్ర, సంస్కృతి మనకు గుర్తువస్తాయి. హిందుత్వాన్ని సమరశీలంగా చేయటమే నా జీవన లక్ష్యం'' అని చెప్పారు. 'సనాతన ధర్మం' పాటించబడాలని ఆయన గట్టిగా చెప్పేవారు. 'ప్రస్తుతం మనకు ముంచుకువస్తున్న అతి పెద్ద ముప్పు ఇతర మతాలలోకి మనవారు మతం మార్చబడటం, దానివల్ల హిందువుల సంఖ్య క్షీణించబడుతున్నది. చాలావరకు దానికి మన చట్టాలు కూడా దోహదం చేస్తున్నాయి. మన మొదటి తక్షణ కర్తవ్యము మతం మార్పిడులు ఆగిపోయేట్లు చేయటం. హిందూ ధర్మంలోకే తిరిగి రాదలచుకొన్న వారిని గౌరవంగా స్వాగతించాలి. మన పొరపాటులను సరిచేసుకొని ఒక నూతన శక్తిని నిర్మాణం చేయాల'ని వివేకానంద చెప్పేవారు. వ్యక్తి నిర్మాణమే సాంస్కృతిక జాతీయ వాదానికి పునాది అని చెప్పారు. స్వామి వివేకానందుడు హిందూ సమాజ పునరుజ్జీవనానికి, సాంస్కృతిక జాతీయ వాదాన్ని శక్తివంతం చేయటానికి, హిందూ సమాజం సామాజికంగా శక్తివంతంగా ఉండటానికి కృషిచేసినవారు. వివేకానందుడు ఒక ఆధ్యాత్మికవేత్త, ఒక దార్శనికుడు, ఒక సామాజిక పరివర్తకుడు, వివేకానందుని భావజాలంతో సాగుతున్న జాతి పునర్నిర్మాణ కార్యంలో మనమందరం పాల్గొని వివేకానందుడు కలలుగన్న భారతాన్ని నిర్మాణం చేద్దాం. ఆ సంకల్పమే ఈ జాతికి శ్రీరామరక్ష.

-ఆర్.మల్లికార్జునరావు

కోటాతో పేదకు బాసట

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ రాజ్యాంగ ఉల్లంఘన కాదు : కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 11: ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగం ప్రాథమిక ఆకృతిని ఉల్లంఘించడం ఎంతమాత్రం కాదని, సాధారణ కేటగిరిలో వారికి రిజర్వేషన్లు కల్పించి గుర్తించడం గొప్ప నిర్ణయమని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అభివర్ణించారు. రిజర్వేషన్ల అమలు కోసం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుకు కాంగ్రెస్ పైకి మద్దతు తెలిపినా లోలోపల మాత్రం రగిలిపోతూనే ఉందని ఆయన ఫేస్‌బుక్‌లోని బ్లాగ్‌లో వ్యాఖ్యానించారు. వాస్తవానికి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అందరికీ సమాన న్యాయం, సమాన అవకాశాలు కల్పిస్తూ రాజ్యాంగాన్ని పొందుపర్చారని అన్నారు. అయితే ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి, ఇతర కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ మరికొన్ని వర్గాలకు సమాజంలో రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. రిజర్వేషన్ల శాతం ఎట్టిపరిస్థితుల్లో 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు పేర్కొన్నందున తాము అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన రాజ్యాంగ సవరణ చెల్లదని కొన్నివర్గాలు వాదిస్తున్నాయని ఆయన చెప్పారు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం కేవలం కులం ప్రాతిపదికన ఇచ్చిన రిజర్వేషన్లు మాత్రమే 50 శాతాన్ని మించరాదని ఇందిరాసాహ్నీ కేసులో సుప్రీం స్పష్టం చేసిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఇప్పుడు తాము ప్రకటించిన పది శాతం రిజర్వేషన్ ఆర్థికంగా వెనుకబడిన వారిని ఉద్దేశించింది కనుక అది తమకు వర్తించదని జైట్లీ స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణబిల్లుకు పైకి మద్దతు పలికినా, దీనిలోని లోపాలను వెతుకుతూ అడ్డుకోవడానికి ప్రధాన ప్రతిపక్షం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. బీజేపీ ఐదు సంవత్సరాల పాలనలో ఒక్క శాతం పన్ను కూడా పెంచలేదని, జీఎస్టీ శ్లాబ్‌ను సైతం పలు రకాల వస్తువులకు గణనీయంగా తగ్గించామని జైట్లీ చెప్పారు. అలాగే ప్రజలకు ఆదాయపు పన్ను తగ్గించి వెసులుబాటు కల్పించామన్నారు. గత ఐదు సంవత్సరాల్లో మధ్య తరగతి పన్ను చెల్లింపుదారులకు ప్రత్యక్ష, పరోక్ష పన్నుల్లో రెండు లక్షల కోట్ల రూపాయల రాయితీ ఇచ్చామని చెప్పారు. ఆదాయాన్ని త్యాగం చేసి పలు వస్తువుల ధరలను తగ్గించామని ఆయన చెప్పారు. పేదలకు సాధికారిత కల్పించడానికి తమ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. వారి కొనుగోలు శక్తి పెరగడంతో అది ఆర్థికరంగంపై సానుకూలంగా చూపి దాని వృద్ధి రేటు కూడా పెరుగుతోందని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎదుగుతోందని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు.



మీ దేశానిది ఉగ్ర నైజమే

పాక్ ప్రధాని ఇమ్రాన్‌కు ఘాటుగా బదులిచ్చిన కేంద్రం

- ❖ మీతో చర్చలా? సుద్దులు చెప్పకు, నీ దేశాన్ని చక్కపరచుకో
- ❖ ఉగ్రవాద మూకలను పట్టుకో, అప్పడే చర్చలు
- ❖ ప్రజాస్వామ్యం అంటే తెలియదు, హక్కులూ లేని దేశం మీది
- ❖ మైనారిటీలను సరిగా చూడడం నేర్చుకో


రవీష్ కుమార్

న్యూఢిల్లీ, జనవరి 11: భారత్‌తో సత్సంబంధాలు పెట్టుకోవాలని, ఉగ్రవాదాన్ని రూపుమాపాలనే ఉద్దేశ్యం పాకిస్తాన్‌కు లేదని భారత్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ ఘాటుగా స్పందించారు. పాక్‌తో మాట్లాడాలనే ఉత్సాహం ఢిల్లీకి లేదంటూ పాకిస్తాన్ చేసిన ఆరోపణలను కేంద్రం తిప్పిగొట్టారు. పాకిస్తాన్‌కు ఉగ్రవాదంపై, చర్చలపై సీరియస్‌నెస్ లేదన్నారు. ఒక వైపు తన భూభాగంలో తిష్టవేసిన ఉగ్రవాద తండాలకు అవసరమైన సహాయాన్ని సమకూర్చుతూ, బయటకు మాత్రం ఉత్తుత్తి ప్రకటనలు చేస్తున్నారన్నారు.

నిజంగా పాకిస్తాన్‌కు చర్చలంటే చిత్తశుద్ధి ఉంటే ఉగ్రవాదులను పాక్ గడ్డపై నుంచి తరిమిగొట్టాలన్నారు. తాము చర్చలకు సిద్ధమని పదే పదే ప్రకటనలు చేసినా ఢిల్లీ స్పందించడం లేదని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ చేసిన ప్రకటనను భారత్ ఖండించింది. ఈ ప్రకటనలను ఇమ్రాన్ ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఈ ప్రకటనల్లో నిజాయితీ లేదన్నారు. ఉగ్రవాదులకు ఆర్థికంగా సహాయం చేస్తూ, ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో చర్చలెందుకని విదేశాంగ మంత్రిత్వశాఖ అన్నారు. ఒక వైపు చర్చలంటారు, మరోవైపు పాక్ మంత్రులు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల సమావేశాలకు హాజరవుతారు. ఈ పరిస్థితుల్లో పాక్‌ను ఎందుకు నమ్మాలన్నారు. ముంబయి, పఠాన్‌కోటల్లో విధ్వంసం సృష్టించిన సూత్రధారులు పాక్‌లో నక్కి ఉన్నారని, వారి భరతం పడితే కొంతలో కొంత నమ్మవచ్చన్నారు. ఈ దుష్టశక్తులు పాకిస్తాన్‌లో నిర్లజ్జగా తిరుగుతుంటే, పాకిస్తాన్‌తో చర్చించేందుకు ఏముందన్నారు. పాకిస్తాన్ దుర్బుద్ధిలో మార్పులేదన్నారు. తన దేశంలో స్వేచ్ఛగా తిరుగుతున్న ఉగ్రవాదులపై చర్యలు తీసుకోకుండా పాకిస్తాన్‌తో చర్చలు జరిపే ప్రసక్తిలేదని కేంద్రం కరాఖండిగా చెప్పింది. సమానత్వం, ఆదర్శం, ప్రజాస్వామ్యం, హక్కుల గురిం చి మాట్లాడే హక్కు పాక్‌కు లేదన్నారు. పాకిస్తాన్ సుద్దులు చెప్పడం మాని తన దేశాన్ని చక్కదిద్దుకోవాలన్నారు. పాక్‌లో అస్థిరత్వం ఉందని, ఉగ్రవాద మూకలు రెచ్చిపోయి ప్రవర్తిస్తున్నాయని, మైనార్టీలకు స్వేచ్ఛ లేదని భారత్ దుమ్మెత్తిపోసింది. పాకిస్తాన్‌లో జరుగుతున్న రాక్షసకృత్యాల గురించి ప్రపంచానికి తెలుసని కేంద్రం పేర్కొంది.

తప్పని చిక్కులు!

- ❖ ఫిబ్రవరి ఒకటి వరకు చిదంబరానికి రిలీఫ్
- ❖ శారదా చిట్స్ కేసులో భార్య నళినిపై చార్జిషీట్



న్యూఢిల్లీ, జనవరి 11: కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరం కుటుంబానికి కోర్టు చిక్కులు తప్పడం లేదు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో మాజీ ఆర్థిక మంత్రి చిదంబరాన్ని ఫిబ్రవరి 1 వరకూ అరెస్టు చేయవద్దంటూ శుక్రవారం ఢిల్లీ కోర్టు ఆదేశించగా, శారదా చిట్స్ కుంభకోణం కేసులో ఆయన సతీమణి నళినీ చిదంబరంపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం నిందితునిగా ఉన్నారు. తండ్రీ, కుమారుడపై సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులను నమోదు చేశాయి. చిదంబరం, కార్తీ అరెస్టుకు సీబీఐ కోర్టు అనుమతి కోరింది. వచ్చేనెల 1 వరకూ అరెస్టు చేయవద్దని సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి ఓపీ సైనీ ఆదేశించారు. సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సీబీఐ తరపున వాదనలు వినిపించారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, అభిషేక్ మను సింఘ్వీ మాజీ ఆర్థిక మంత్రి తరపున కోర్టులో వాదనలు వినిపించారు. సీబీఐ కేసును ఆధారం చేసుకుని చిదంబరంపై దాఖలైన మనీలాండరింగ్ కేసును కోర్టు వాయిదా వేసింది. ఫిబ్రవరి 1 తరువాత అంటే 2నే మనీలాండరింగ్ కేసు విచారణకు చేపట్టాలని ఈడీ తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితేష్ రాణా కోర్టును అభ్యర్థించారు. జూలై 19న చిదంబరం,కార్తీ చిదంబరంపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. జూలై 31న అనుబంధ చార్జిషీట్ దాఖలైంది. 2006లో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉండగా విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్ఐపీబీ బోర్డుకు అనుమతి ఇచ్చారని సీబీఐ అభియోగం. కాగా శారదా గ్రూప్ కంపెనీల నుంచి 1.4 కోట్ల రూపాయలు స్వీకరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న చిదంబరం సతీమణి నళినీ చిదంబరంపై సీబీఐ శుక్రవారం చార్జిషీట్ దాఖలు చేసింది. శారదా చిట్స్ యజమాని సుదీప్తసేన్‌తో కలిసి నేరానికి పాల్పడినట్టు ఆరోపణ. చిట్స్ కుంభకోణంలో నళినీ పాత్ర ఉందని సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాళ్ ఆరోపించారు. సెబీ, ఆర్ఓసీని మేనేజ్ చేయడానికి నళినీకి సొమ్ములు ఇచ్చినట్టు తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి మనోరంజన్ సిన్హా మాజీ భార్య మతాంగ్ సిన్హా రంగంలోకి దిగి నళినీని సుదీప్తసేన్‌కు పరిచయం చేసినట్టు దయాల్ చెప్పారు. 2010-12లో చిదంబరం సతీమణికి 1.4 కోట్ల రూపాయల ముట్టజెప్పారు. కోల్‌కతా ప్రత్యేక కోర్టులో ఆమెపై చార్టిషీట్ దాఖలైంది.

జర్నలిస్టు హత్యకేసులో
డేరాబాబా దోషే

17న శిక్ష ఖరారు



పంచ్‌కుల, జనవరి 11: జర్నలిస్టు హత్యకేసులో డేరాబాబా(51) దోషి అని సీబీఐ కోర్టు శుక్రవారం నిర్ధారించింది. ఈ కేసులో ఆయనతో పాటు మరోముగ్గురు సైతం దోషులేనని పేర్కొంది. అయితే వీరికి ఎంతకాలం శిక్ష వేసేది ఈనెల 17న ప్రకటిస్తామని కేసును విచారించిన సీబీఐ జడ్జి జగదీప్ సింగ్ ప్రకటించారు. డేరా బాబా అలియాస్ డేలా సచ్చ ఔదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ సిర్సాలోని తన ఆశ్రమంలో అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడని, ఆశ్రమంలోని మహిళలను లైంగికంగా వేధిస్తున్నాడని పేర్కొంటూ జర్నలిస్టు ఛత్రపతి తన పత్రిక 'పూరా సచ్'లో వార్తలు రాసాడు. దీంతో ఛత్రపతిని అక్టోబర్ 2002లో ఆయన ఇంటి బయట డేరాబాబా, అతని అనుచరులు కులదీప్ సింగ్, నిర్మల్ సింగ్, కిషన్‌లాల్ కలిసి కాల్చి చంపారు. దీనిపై 2003లో కేసు నమోదైంది. తర్వాత దానిని 2006లో సీబీఐకి అప్పగించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా డేరాబాబాను పేర్కొంటూ కేసు నమోదైంది.

ఆస్థానాపై విచారణ కొనసాగించాల్సిందే

ఎఫ్ఐఆర్ రద్దు చేయాలన్న పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ, జనవరి 11: సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేష్ ఆస్థానాకు న్యాయస్థానంలో చుక్కెదురైంది. అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఆయనపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడానికి ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నిరాకరిస్తూ, అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోరాదని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. అతనిపై సీబీఐ కేసు విచారణను కొనసాగించవచ్చునని స్పష్టం చేసింది. అంతేకాకుండా అవినీతి ఆరోపణలపై తమపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని సీబీఐ డిప్యూటీ సూపరింటెండెంట్ దేవేందర్‌కుమార్, మధ్యవర్తి మనోజ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ నజ్మీ వాజిరి కొట్టివేస్తూ కేసులోని వాస్తవ పరిస్థితుల దృష్ట్యా ఆస్థానా, కుమార్‌లను ప్రాసిక్యూట్ చేయడానికి కోర్టు ముందస్తు అనుమతి అవసరం లేదని స్పష్టం చేసింది. ఆస్థానా, ఇతరులకు సంబంధించిన ఈ కేసులను పదివారాల్లోగా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని ఆదేశించింది. మాంసం ఎగుమతిదారు ఖురేషిపై నమోదైన కేసులో తనను తప్పించేందుకు ఒక మధ్యవర్తి ద్వారా ఆస్థానాకు తాను లంచం ఇచ్చినట్టు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సాన సతీష్ బాబు ఫిర్యాదు చేశారు. దీంతో ఆస్థానా, సీబీఐ డీఎస్పీ దేవేందర్‌కుమార్, మధ్యవర్తి మనోజ్‌కుమార్‌లపై సీబీఐ కేసు నమోదు చేసింది. తర్వాత సీబీఐలో ఉన్నత స్థానాల్లో ఉన్న అలోక్ వర్మ, ఆస్థానాలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. అలోక్‌వర్మపై అవినీతి, క్రిమినల్ కుట్ర తదితర ఆరోపణలపై అవినీతి నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ ఆస్థానా, కుమార్, వర్మ, జాయింట్ డైరెక్టర్ ఏకే శర్మ తదితరులను అక్టోబర్ 22న అరెస్టు చేయగా, అక్టోబర్ 31న బెయిల్ వచ్చింది. సీబీఐ దాఖలు చేసిన పలు పిటిషన్లకు సంబంధించిన తీర్పును జడ్జి వాజిరి గత ఏడాది డిసెంబర్ 20న రిజర్వ్ చేశారు. తమపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లు కొట్టివేయాలని నిందితులు దాఖలు చేసిన అభ్యర్థనలు జడ్జి శుక్రవారం కొట్టివేస్తూ దర్యాప్తును కొనసాగించాలని సీబీఐకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

బీజేపీని మట్టికరిపిస్తాం

- ❖ అఖిలేష్ యాదవ్ వెల్లడి
- ❖ బీఎస్పీతో పొత్తుపై నేడు ప్రకటన

కన్నౌజ్, జనవరి 11: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే తమ అజెండా అంటూ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ప్రకటించారు. అఖిలేష్, బీఎస్పీ అధినేత్రి మాయావతి సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడాల్సి ఉండగా ముందురోజు శుక్రవారం ఆయనీ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని ఇరుపార్టీలు సూత్రప్రాయంగా అంగీకారానికి వచ్చినట్టు సమాజ్‌వాదీ పార్టీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి వెల్లడించిన సంగతి తెలిసిందే.'లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీఎస్పీ, ఎస్పీ కలిసి పోటీ చేసి బీజేపీని మట్టికరిపించాం. ముఖ్యమత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య స్థానాలను బీజేపీ కోల్పోయింది. సార్వత్రిక ఎన్నికల్లోనూ అదే వ్యూహంతో ముందుకెళ్తాం. బీజేపీని ఓడిస్తాం'అని మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు. చౌపాల్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల పొత్తుకు సంబంధించి బీఎస్పీ, ఎస్పీ శనివారం అధికారిక ప్రకటన చేయనున్నాయి. ఇరుపార్టీల అధినేతలూ సంయుక్త మీడియా సమావేశంలో పొత్తు ప్రకటన చేస్తారు. 'బీఎస్పీ, ఎస్పీ పొత్తు అధికార బీజేపీలోనే కాదు..కాంగ్రెస్‌ను భయాందోళనకు గురిచేస్తోంది'అని అన్నారు.

జాతీయ ఎమర్జన్సీ దిశగా అడుగులు

❖ ఏమైనా గోడ నిర్మించి తీరుతా: ట్రంప్ ❖ గోడ వద్దంటున్న డెమోక్రాట్లు

వాషింగ్టన్, జనవరి 11: తన పంతాన్ని నెగ్గించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ ఎమర్జన్సీని విధించి మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి సమాయత్తమవుతున్నారు. ఈ దిశగా ట్రంప్ వడివడిగా అడుగులు వేస్తున్నట్లు సంకేతాలు అందుతున్నాయి. డెమాక్రట్లకు కాంగ్రెస్‌లో మెజార్టీ ఉంది. దీంతో డెమాక్రట్లు గోడ నిర్మాణానికి మోకాలడ్డుతున్నారు. కాంగ్రెస్‌ను పట్టించుకోకుండా, వారి అభిప్రాయంతో పనిలేకుండా ఎమర్జన్సీ విధించి మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి వెళ్లే హక్కు అమెరికా అధ్యక్షుడికి ఉంటుంది. ఇప్పటికే ట్రంప్, డెమాక్రట్లు ఎవరికి వారు భీష్మించుకుని కూర్చోవడం వల్ల 21 రోజులుగా ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించాయి. ఈ గోడ నిర్మాణానికి 5.6 బిలియన్ డాలర్లు ఖర్చవుతాయి. ఇంత సొమ్ము ఇప్పుడుండే పరిస్థితుల్లో ఎందుకని డెమాక్రట్లు నిలదీస్తున్నారు. ట్రంప్ గురువారం దక్షిణ టెక్సాస్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యాయపరమైన సమస్యలు ఎదురైనా గోడ నిర్మాణానికి మొగ్గు చూపుతామన్నారు. ఎమర్జన్సీ విధించడమనేది చివరి ఆప్షన్ అన్నారు. అక్రమ వలసదారుల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ సాలీనా 250 బిలియన్ డాలర్ల నష్టంవస్తోందన్నారు. దక్షిణ సరిహద్దుల ద్వారా వచ్చే అక్రమ వలసదారుల వల్ల నేరాల రేటు పెరుగుతోందన్నారు. సరిహద్దు గోడ ఉంటే ఈ తరహా పరిణామాలు తలెత్తవన్నారు.

రక్షణకు సాంకేతిక దన్ను

- ❖ బిగ్ డేటా, కృత్రిమ మేధ టెక్నాలజీని సమకూర్చుకుంటాం
- ❖ ఇప్పటికే ఆధునీకరణలో ఆలస్యమైంది
- ❖ నైపుణ్యాన్ని పెంచుతాం ❖ ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్



న్యూఢిల్లీ, జనవరి 11: భారత రక్షణ వ్యవస్థను ఆధునీకరించడంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డాటా విధానాలను ప్రవేశపెట్టనున్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ చెప్పారు. మన శత్రు దేశాలు కూడా సైన్యం ఆధునీకరణకు ఈ రెండు సాంకేతిక విధానాలను ప్రవేశపెడుతున్నాయని, దీనికి ఎక్కువవ్యయం చేస్తున్నాయని చెప్పారు. శుక్రవారం ఆర్మీ టెక్నాలజీ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే రక్షణ వ్యవస్థ సాంకేతీకరణ ఆలస్యమైందన్నారు. తక్షణమే ఈ రంగం ఆధునీకరణకు ఏమి కావాలో గుర్తించామన్నారు. వీలైనంత త్వరలో ఈ దిశగా అడుగులు వేస్తామన్నారు. మన సైన్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డాటాను ఎలా ప్రవేశపెట్టాలి, వాటిని ఎలా ఉపయోగించుకోవాలనేదానిపై కూడా కసరత్తు చేస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు ఈ రెండు సాంకేతిక వ్యవస్థలపై పెద్ద మొత్తంలో నిధులను వెచ్చిస్తున్నాయన్నారు. వచ్చే తరంలో మిలిటరీ సాంకేతిక టెక్నాలజీతోనే పనిచేస్తుందన్నారు. రక్షణ శాఖ సహాయ మంత్రి సుభాష్ బామ్రే మాట్లాడుతూ, టెక్నాలజీని ప్రవేశపెట్టడంతో పాటు దానిని అవసరమైన సమయంలో వినియోగించుకునే సామర్థ్యంపై దృష్టిని సారించాలన్నారు. టెక్నాలజీని అభివృద్ధి చేయడం సవాలుతో కూడుకున్నదన్నారు. సముద్రం, భూమి, ఆకాశం, అంతరిక్షం, సైబర్ స్పేస్‌పై ఆధిపత్యం పోరు టెక్నాలజీ సహాయంతో కొనసాగుతుందన్నారు. ఇక యుద్ధాలను టెక్నాలజీ నడిపిస్తుందన్నారు. ప్రపంచ మిలిటరీ వ్యవస్థ రూపురేఖలు త్వరితగతిన మారుతున్నాయన్నారు. యుద్ధతంత్రంలో కూడా అనేక ఎత్తుగడలు వస్తున్నాయన్నారు. మానవ మేధస్సు నుంచి సైబస్ స్పేస్ వరకు అంతా టెక్నాలజీ మయమన్నారు. అకడమిక్,రక్షణ రంగం మధ్య సమన్వయం ఉండాలన్నారు. ప్రతి సిపాయిని సాంకేతిక పరిజ్ఞానంలో సుశిక్షితుడిని చేయాలన్నారు. రక్షణ ఉత్పత్తుల రంగం కార్యదర్శి అజయ్ కుమార్ మాట్లాడుతూ, రక్షణ రంగంలో నిపుణులు భారత రక్షణ వ్యవస్థ ఆధునీకరణకు చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రపంచ రక్షణ రంగంలో భారత్ సైన్యానికి నైపుణ్యత ఉన్న ఆర్మీగా పేరుందన్నారు. డీఆర్‌డీవో చైర్మన్ జీ సతీష్ రెడ్డి, ఇతర నిపుణులు ప్రసంగించారు.

శిబిరాలే శరణ్యం!

❖ కాశ్మీరీ పండిట్‌లకు తీరని అవస్థలు ❖ మూడు దశాబ్దాలైనా తిరిగిరాక ఎండమావే

❖ సొంత గడ్డపై మరణించాలని ఉంది: లాల్



జమ్ము, జనవరి 11: మాతృదేశంలో శరణార్థినయ్యాను. సొంత గడ్డలో చనిపోవాలని ఉంది. ఎన్నాళ్లని ఇతర ప్రదేశాల్లో శరణార్థిలా జీవించాలి అని 79 ఏళ్ల ఒక కాశ్మీరీ పండిట్ వాపోయారు. జమ్మునగరంలోని జగిత్ క్యాంపులో కాశ్మీర్‌లో ఉగ్రవాద మూకలు, మతోన్మాదుల దాడులతో భీతిల్లి లక్షలాది మంది కాశ్మీరీపండిట్‌లు జమ్ముకు వలస వచ్చారు. వీరంతా 1989-90 సంవత్సరంలో కాశ్మీర్ నుంచి వచ్చారు. సొంత దేశంలోనే శరణార్థిగా మారా. ఇంతకంటే దౌర్భాగ్యం ఏముంటుంది ? మూడు దశాబ్దాలైంది.

మా సమస్యలను పట్టించుకునే నాథుడు లేరని లాల్ అనే వృద్ధ కాశ్మీరీ పండిట్ అన్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ నిరాశపెరుగుతోంది. వయస్సు మీదపడుతోంది. ఏ రోజైనా మరణించవచ్చు. సొంత ఊర్లో మరణించాలని ఉందని లాల్ అన్నారు. జగిత్ క్యాంపులో 20 వేల మంది కాశ్మీరీ పండిట్‌లు ఉన్నారు. కాశ్మీర్‌లో పరిస్థితులు కుదటపడలేదన్నారు. భద్రత, సేఫ్టీ ఉండాలన్నారు. మరో 80 ఏళ్ల వృద్ధుడు సోమావతి మాట్లాడుతూ కుప్వారా నుంచి వలస వచ్చామని, సొంత ప్రాంతానికి వెళ్లి ఉండాలని ఉందన్నారు. అఖిల భారత కాశ్మీరీ పండిట్ కాన్ఫరెన్స్ నేత టీకే భట్ మాట్లాడుతూ, అనిశ్చిత పరిస్థితి కొనసాగుతోందన్నారు. ప్రతి కుటుంబానికి రూ.7.5 లక్షల ప్యాకజీ ఇస్తామని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఈ ప్యాకేజీని రూ.20లక్షలకు పెంచాలని ఆ నాటి ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం కోరిందన్నారు. ఈ ప్రతిపాదన ఇంతవరకుఅమలు కాలేదన్నారు. కాశ్మీరీ పండిట్లకు ఆరు వేల ఇండ్లను నిర్మించాలని కేంద్రం ప్రతిపాదిస్తే, నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రం వ్యతిరేకించిందన్నారు. 1900 మంది కాశ్మీరీ పండిట్ యువకులకు ఉపాధిని కేంద్రం కల్పించిందని, కాని స్థానికంగా వీరు ఇమడలేకపోతున్నారని బీజేపీ ఎమ్మెల్సీ సురీందర్ అంబార్డర్ చెప్పారు.

ఎన్నికల నిర్వహణకు రెడీ

- ❖ జమ్ముకాశ్మీర్ గవర్నర్ వెల్లడి
- ❖ ఈసీ ప్రకటనే తరువాయి

జమ్ము, జనవరి 11: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సర్వసన్నద్ధంగా ఉందని జమ్ముకాశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ప్రకటించారు. కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ప్రకటన వెలువడిన వెంటనే రంగంలోకి దిగుతామని శుక్రవారం ఇక్కడ స్పష్టం చేశారు. 'ఈసీ ప్రకటన వెలువడిన వెంటనే ప్రభుత్వం రంగంలోకి దిగుతుంది' అని ఆయన పేర్కొన్నారు. జమ్ము ప్రాంతంలో సర్పంచ్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్ మీడియాతో ముచ్చటించారు. ఐఏఎస్ అధికారి షా ఫైజల్ రాజీనామాపై వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు. 'ఫైజల్ ప్రభుత్వ ఉద్యోగి. ఆయన రాజీనామాపై వ్యాఖ్యానించడం సరైందికాదు' అని గవర్నర్ చెప్పారు. జమ్ముకాశ్మీర్ అసెంబ్లీకి ఆరు నెలల్లో ఎన్నికలుంటాయని కేంద్ర ఎన్నికల సంఘం నవంబర్ నెలాఖరున ప్రకటించింది. లోక్‌సభతోపాటే అసెంబ్లీకి ఎన్నికలు ఉండొచ్చన వార్తలను ఈసీ తోసిపుచ్చలేదు. 'జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు మే మొదటి వారంలో జరుగుతాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందే ఎన్నికలు ఉండొచ్చు'అని ఈసీ చీఫ్ ఓపీ రావత్ స్పష్టం చేశారు. సభ రద్దయిన ఆరునెలల్లో ఎన్నికల జరపాలని, 2019 మేనెలతో ము గుస్తుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఏ పార్టీ ముందుకు రానందునే రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చిందని, ఈ విషయంలో గవర్నర్‌కు మరో ప్రత్యామ్నాయం లేకుండాపోయిందని డిసెంబర్ 28న కేంద్రం లోక్‌సభకు తెలిపింది.

మేఘాలయ గని ప్రమాదం

- ❖ రిమోట్ ద్వారా పనిచేసే ఐదు వాహనాలను రంగంలోకి దింపిన నేవీ
- ❖ 18కి కేసు విచారణను వాయిదా వేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 11: మేఘాలయలో గనిలో చిక్కుకున్న 15 మంది కార్మికులను రక్షించేందుకు భారత నౌకాదళం రిమోట్ ద్వారా పనిచేసే ఐదు వాహనాలను వినియోగిస్తోందని ఆ రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. గత నెల 13వ తేదీన రాష్ట్రంలోని తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో నదీతీరంలోని గనిలో ఈ ప్రమాదం సంభవించింది. ఇంతవరకు ఒక కోటి లీటర్ల నీటిని బయటకు తోడారని ధర్మాసనానికి రాష్ట్రప్రభుత్వం తెలిపింది. ఈ కేసును జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ విచారించారు. పక్కనే ప్రవహిస్తున్న నది నుంచి నిరంతరం నీరు ఊరడం వల్ల గనిలో చిక్కుకున్న కార్మికులను రక్షించడం అసాధ్యంగా మారిందన్నారు. అక్రమ గనిని నిర్వహిస్తున్న యాజమానిని అరెస్టు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ గనిలో చిక్కుకున్న కార్మికులను రక్షించేందుకు అన్నిరకాల చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. భారత వైమానిక దళం హెలికాప్టర్లు, విమానాలను కూడా రంగంలోకి దింపి సహాయక చర్యలను చేపట్టినట్లు చెప్పారు. అనంతరం ఈ కేసు విచారణను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ప్రకృతి విపత్తు యాజమాన్య సహాయక బృందానికి చెందిన 71 మంది ఈ ఆపరేషన్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు కేంద్రం కోర్టుకు తెలిపింది.

యావత్ ప్రపంచం చూపు.. నవ్యాంధ్ర వైపే!



❖ అసూయ అనేది అభివృద్ధికే పరిమితం కావాలి ❖ నాడు ఒంటరి ప్రయాణం ❖ నేడు సమష్టి కృషితో అద్భుతాలు
❖ అధికార యంత్రాంగం పనితీరు భేష్ ❖ తొలివిడత జన్మభూమిలో 40 లక్షల వినతులు.. నేడు 4 లక్షలు
❖ సంతృప్తి స్థాయి పెరిగినందునే తగ్గిన ఫిర్యాదులు ❖ ఎన్టీఆర్ జీవితం నేటితరానికి ఆదర్శం
❖ బయోపిక్‌లో బాలయ్య నటన అద్భుతం ❖ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
❖ కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్

ఆంధ్రభూమి బ్యూరో

అమరావతి, జనవరి 11: నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని, స్వయం కృషి, పట్టుదలతో ఇది సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విభజన రోజు నాటి దిక్కుతోచని పరిస్థితి నుంచి ఇపుడు అద్భుత ప్రగతి దిశగా దూసుకెళుతున్నామని ఉద్ఘాటించారు. జన్మభూమి - మావూరు కార్యక్రమంపై శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసం నుంచి కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా ఎన్నడూలేని సంతృప్తి సాధించామన్నారు. అధికార యంత్రాంగం ప్రజలతో మమేకమై ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవటంలో కృతకృత్యులయ్యారని ప్రశంసించారు. ఇదే నిజమైన సంక్రాంతి అని, ఇది అభివృద్ధి, పేదల సంక్రాంతిగా అభివర్ణించారు. యావత్ ప్రపంచం ఏపీ వైపు చూస్తోందని, మన వినూత్న ఆవిష్కరణలను అంతా ఆసక్తిగా తిలకిస్తున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు మన నమూనాలు మార్గదర్శకాలన్నారు. 2014లో కొందరు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపలేదని, కొంతమంది మాత్రమే వచ్చారని, ఏపీని బలహీన బృందమని విమర్శించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ బృందంతోనే అద్భుతాలు సృష్టించామని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అత్యున్నత రాష్ట్రంగా తీర్చిదిద్దామన్నారు. నాలుగేళ్లలో 670 అవార్డులు రావటం మన కృషికి నిదర్శనమన్నారు. 'మీ త్యాగ ఫలితం వల్లే రాష్ట్రం ఈ దశకు చేరుకుంది. మీ కష్టార్జితం, సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యపడింది. అధికార, ఉద్యోగ బృందాన్ని చూసి నేను గర్విస్తున్నాను' అని చంద్రబాబు ప్రశంసలతో ముంచెత్తారు. 'గతంలో తొమ్మిదేళ్లు నేను ఒంటరిగా పరుగెత్తా. ఇప్పుడు కలసి పయనిస్తున్నాం. అందుకే ఉత్తమ ఫలితాలు సాధించాం' అని ఆయనన్నారు. 16వేల గ్రామసభలు నిర్వహించటం ఓ చరిత్ర అన్నారు. 16వేల గ్రామాభివృద్ధి ప్రణాళికలను అప్‌లోడ్ చేయటం మరో రికార్డు అని, పోలవరం పనుల్లో గిన్నిస్ బుక్ రికార్డు సాధించామని ఉదహరించారు. ఎల్‌ఈడీ బల్బులు, నరేగా నిధులు, ప్రకృతి వ్యవసాయంతో నూతన ఒరవడి సృష్టించామన్నారు. ఏపీ ఆర్టీజీఎస్‌ను బ్రిటన్ మాజీ ప్రధాని టోనీబ్లెయిర్, సింగపూర్ మంత్రి ఈశ్వరన్ ప్రశంసించారంటూ, సింగపూర్‌లో కూడా ఇలాంటి వ్యవస్థ అందుబాటులో లేదన్నారు. 1100 పరిష్కార వేదిక ప్రపంచానికే ఓ నమూనాగా నిలుస్తోందని, పేదల సమస్యల సత్వర పరిష్కారానికి కేంద్రంగా మారిందన్నారు.


మనకంటే ఇతర రాష్ట్రాలు ముందుకుపోతే అసూయ కలిగినా దాన్ని కసిగా మార్చుకుంటానని, మరింత పట్టుదలతో పనిచేస్తానని, అనుకున్నది సాధించేందుకే అసూయ దోహదపడాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అది మన ప్రగతికి ఉపయోగపడాలి తప్ప ఇతరులకు హాని కలిగించేదిగా ఉండకూడదని స్పష్టం చేశారు. ఒక్కరోజు లక్ష కోట్ల పెట్టుబడులు, 30వేల మందికి ఉపాధి లభించనుండటం ఓ చరిత్రగా పునరుద్ఘాటించారు. అదాని గ్రూపు రూ. 30వేల కోట్లతో ఐటీ పార్క్‌లు, రూ. 40 వేల కోట్లతో సోలార్ పార్క్‌లు విశాఖపట్నంలో ఏర్పాటు చేయబోతోందని తెలిపారు. ప్రకాశం జిల్లాలో కాగితం గుజ్జు పరిశ్రమ ద్వారా 50వేల మంది రైతు కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. వయాడక్ట్ మన తారకమంత్రమని, సులభతర వాణిజ్యంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. భవిష్యత్‌లో మన డేటా సేవలపై ప్రపంచం దృష్టి సారించే అవకాశాలున్నాయని అభిలషించారు. 7 మిషన్లు, ఐదు గ్రిడ్లు, మరో ఐదు ఉద్యమ అంశాలతో ప్రయాణం ప్రారంభమైందని, పట్టుదల పెంచేందుకే నవనిర్మాణ దీక్ష, మహా సంకల్పం కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజల భాగస్వామ్యం కోసం జన్మభూమి, జలసిరికి హారతి, గ్రామ వికాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రం దేనికీ సహకరించలేదని, అయినా కష్టంతో ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. శనివారం నుంచి సంక్రాంతి సంబరాలు నిర్వహించాలని నిర్దేశించారు.

ఆరో విడత జన్మభూమి కార్యక్రమంలో ఇప్పటి వరకు 4,57,007 వినతులు అందాయని ముఖ్యమంత్రి తెలిపారు. అందులో 3,10,000 అర్జీలు పరిశీలించామని, 35వేల వినతులు మాత్రమే తిరస్కరించామన్నారు. తొలి విడత జన్మభూమిలో 40లక్షల వినతులు రాగా, ఈసారి 4లక్షలు మాత్రమే అందాయన్నారు. ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందని, అందుకే ఫిర్యాదులు తగ్గాయన్నారు. ప్రభుత్వ పనితీరుకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. ఇదే స్ఫూర్తితో దేశం, ప్రపంచంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దాలనేది తమ సంకల్పమని చెప్పారు.

ఎన్టీఆర్ బయోపిక్ అద్భుతం

ఎన్టీఆర్ కథానాయకుడు చలనచిత్రం ద్వారా మూడు దశాబ్దాల చరిత్రను మూడు గంటల్లో ప్రదర్శించటం అద్భుతమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. చుట్టూ జరిగే సంఘటనలతో రాజీపడలేకే ఎన్టీఆర్ ఉద్యోగాన్ని వదిలేశారని, మద్రాస్‌లో అష్టకష్టాలు పడినా మనోధైర్యం కోల్పోలేదన్నారు. అచంచలమైన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాలను చేరుకున్నారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ బయోపిక్ సంతోషాన్ని కలిగించిందన్నారు. దివిసీమ ఉప్పెన బీభత్స నష్టాలను ఎన్టీఆర్ కళ్లారా చూశారని, తుపానులో ఇల్లు కూలకుండా నిట్టాడుకి తన భుజం మోపి అడ్డుపెట్టారని, బాధలను ప్రత్యక్షంగా ఆనాడే అనుభవించారని తెలిపారు. రైతులు, పేదల విపత్తు కష్టాలపై చిన్ననాటి నుంచే స్పందించారన్నారు. తుపాను బాధితులను ఆదుకునేందుకు విరాళం ప్రకటించటంతో పాటు తానే స్వయంగా జోలెపట్టి స్ఫూర్తి నింపారని తెలిపారు. లాంతర్ వెలుగులో చదువుకున్న ఆయన ఏ విద్యార్థికీ ఇలాంటి కష్టం రాకూడదని ప్రతి గ్రామానికి విద్యుత్ సరఫరా జరగాలని ఆకాంక్షించారని చెప్పారు. పేదల గుడిసెల్లో జీవనం సాగించటం ఆయన్ను కలచివేసిందని, అందుకే పక్కా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. ఎన్టీఆర్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అద్భుతంగా నటించారంటూ చిత్ర బృందాన్ని చంద్రబాబు అభినందించారు.

ఉద్యోగానికి సీబీఐ మాజీ డైరెక్టర్ వర్మ గుడ్ బై



❖ పదవీ విరమణ చేసినట్లుగా ఆదేశాలు ఇవ్వండి
❖ అభియోగాలపై నా వాదనలను పట్టించుకోలేదు
❖ కేంద్రానికి రాసిన లేఖలో వెల్లడించిన అలోక్‌వర్మ

న్యూఢిల్లీ, జనవరి 11: సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగించబడిన అలోక్ వర్మ అగ్నిమాపక సర్వీసులు, సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టులో చేరకుండా ఉద్యోగానికి రాజీనామా చేశారు. తనను పదవీ విరమణ చేసినట్లుగా భావించి ఆ మేరకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర సిబ్బంది సేవలు, శిక్షణ మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. తనపై వచ్చిన అభియోగాలపై సమాధానం చెప్పేందుకు ఉన్నతస్థాయి కమిటీ అవకాశం ఇవ్వలేదని ఆయన లేఖలో ప్రస్తావించారు. 1979 ఐపీఎస్ బ్యాచికి చెందిన సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సిక్రీ, ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలోని కమిటీ వేటు వేసిన సంగతి విదితమే. ఈ నెల 31వ తేదీతో అలోక్‌వర్మ సీబీఐ డైరెక్టర్‌గా కాలపరిమితి ముగుస్తుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక అధికారి ఇచ్చిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని సీవీసీ విచారించిందన్నారు. తన వాదనలను పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా సెలవుపై వెళ్లిన స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానా పేరును ఆయన ప్రస్తావించకుండానే ఆరోపణలు చేశారు. ఆస్థానా ఇచ్చిన ఫిర్యాదును ఉన్నత స్థాయి కమిటీ పరిశీలించి పరిగణనలోకి తీసుకున్నట్లు అర్థమవుతోందన్నారు. తనపై రాకేష్ ఆస్థానా చేసిన ఆరోపణల పత్రాన్ని కూడా జస్టిస్ ఏకే పట్నాయక్‌కు సీవీసీ ఇవ్వలేదన్నారు. సీబీఐ దేశంలో ప్రతిష్టాకరమైన సంస్థ అని చెప్పారు. సీవీసీని అడ్డుపెట్టుకుని సీబీఐను కేంద్రం నిర్వీర్యం చేస్తున్నట్లుగా ఉందన్నారు. ఈ వ్యవహారంపై పునసమీక్ష చేసుకోవాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. తాను ఢిల్లీ పోలీసు కమిషనర్‌గా పనిచేశానని, 40 సంవత్సరాలు సేవలు అందించానన్నారు.

సీబీఐ వ్యవహారంలో సీవీసీ బలిపశువు

❖ వ్యవస్థలను నాశనం చేస్తున్న ప్రధాని మోదీ
❖ కాంగ్రెస్ అధికార ప్రతినిధి సింఘ్వీ ధ్వజం



న్యూఢిల్లీ, జనవరి 11: సీబీఐ ప్రతిష్ట మసకబారేందుకు బీజేపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలే నని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) భుజాల మీద తుపాకీ పెట్టి ప్రత్యర్థి పార్టీనేతలను లక్ష్యంగా చేసుకుని అనైతిక విధానాలకు పాల్పడుతోందని ఆ పార్టీ పేర్కొంది. రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కేందుకు సీవీసీ కూడా కారణమవుతోందన్నారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ మాట్లాడుతూ సీవీసీ ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తోందన్నారు. సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను తొలగించడం అప్రజాస్వామిక చర్యన్నారు. సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను తొలగించేందుకు సీవీసీ అధికారాలను దుర్వినియోగం చేసిందన్నారు. సీవీసీ కూడా ఈ విషయంలో దాగుడుమూతలాడుతోందన్నారు. రాఫెల్ ఫైటర్ జెట్స్ కొనుగోళ్ల బండారం బయటపడుతుందనే భయం మోదీ ప్రభుత్వాన్ని వెంటాడుతోందన్నారు. కేంద్రానికి సీవీసీ గులాంగా మారడం నిజంగా శోచనీయమన్నారు. బీజేపీ హయాంలో ప్రతిష్టాకరమైన సంస్థల గౌరవం మంటగలిసిందన్నారు. సీబీఐ పరిణామంతో మోదీ పతనం ఆరంభమైందన్నారు. సీబీఐ స్పెషల్ డైరెక్టర్ రాకేష్ ఆస్థానా అవినీతికి పాల్పడ్డారని చెప్పేందుకు బలమైన ఆధారాలున్నా, సీవీసీ మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాజ్యాంగపదవులు, చట్టబద్ధమైన పదవుల్లో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని నిరాధారమైన ఆరోపణలతో తొలగించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

తొలి దక్షిణాది గిరిజన వర్శిటీ విద్యాసంవత్సరం మొదలు

జూలై నుండి ఆరు కోర్సులు ప్రారంభం ★ ప్రతి కోర్సులో 30 మంది విద్యార్థులు



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 11: వరంగల్ జిల్లా ములుగులో ఏర్పాటవుతున్న దక్షిణాది రాష్ట్రాల్లో మొట్టమొదటి గిరిజన వర్శిటీ అనుమతి రాగానే విద్యాసంవత్సరాన్ని ప్రారంభించింది. జూలై నుండి ఆరు కోర్సులను ఈ యూనివర్శిటీలో ఆఫర్ చేయనున్నారు. ప్రతి కోర్సులో 30 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్శిటీ కోసం భూ సేకరణకు 10 కోట్ల రూపాయిలను విడుదల చేసింది. పూర్తిస్థాయి యూనివర్శిటీ పని ప్రారంభించిన తర్వాత బీఏ, బీసీఏ , ఎంసీఏ , ఎంబీఏ మార్కెటింగ్, ప్యాకేజింగ్ , ఫారెస్టు ప్రొడ్యూస్, బీబీఏ , మాస్టర్ ఇన్ ట్రైబల్ కల్చరల్ ఫోక్‌లూర్ కోర్సులను నిర్వహించనుంది. ఈ మేరకు తగిన చర్యలను చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం నాడు సచివాలయంలో సీఎస్ డాక్టర్ ఎస్‌కే జోషి , గిరిజన సంక్షేమ శాఖ, విద్యాశాఖ, అటవీ శాఖ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అధికారులతో ఆయన గిరిజన యూనివర్శిటీపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ గిరిజన వర్శిటీ ద్వారా జాకారం వద్ద ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో తరగతులను నిర్వహించాలని, అందుకు అనుగుణంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ అధికారులు తాత్కాలిక నిర్మాణాలను చేపట్టాలని అన్నారు. యూనివర్శిటీలో స్థానిక గిరిజన యువత కోసం 30 శాతం సూపర్ న్యూమరీ సీట్లను కేటాయించాలని చెప్పారు. కాంపౌండ్ హాల్ నిర్మాణాన్ని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం చేపట్టాలని, గిరిజన యూనివర్శిటీ ద్వారా స్థానిక గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి, గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని అన్నారు. భూ సేకరణకు సంబంధించి 10 కోట్ల రూపాయిలను గిరిజన సంక్షేమ శాఖ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌కు ఇవ్వాలని అన్నారు.అటవీ శాఖకు సంబంధించిన భూమిలో అటవీ చట్ట నిబంధనల్లో అనుమతించిన మేరకు గిరిజన సంస్కృతికి సంబంధించిన కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. గిరిజన వర్శిటీ కమిటీలో ఉన్నత విద్య, గిరిజన సంక్షేమం, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శులను సభ్యులుగా నియమించాలని అన్నారు. తరగతుల నిర్వహణకు అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని అన్నారు. తగిన యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెన్‌హర్ మహేష్ దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టినా చొంగ్తు, జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాసం వెంకటేశ్వర్లు, అదనపు పీసీసీఎఫ్ రఘువీర్, చక్రధర్ రావు , సెంట్రల్ యూనివర్శిటీ నుండి ప్రొఫెసర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సొంత జిల్లాకు చేరుకున్న జగన్

కడప సిటీ, జనవరి 11: ప్రజా సంకల్పయాత్ర ముగించిన వైకాపా అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం సొంత జిల్లా కడపకు చేరుకున్నారు. తిరుమల నుంచి రోడ్డుమార్గంలో కడపకు చేరుకున్న జగన్‌కు అడుగడుగుగా జనం, పార్టీ కార్యకర్తలు నీరాజనం పలికారు. కడప పెద్దదర్గాలో ప్రార్థనలు జరిపిన జగన్ అక్కడ చాదర్ సమర్పించారు. అనంతరం సొంత నియోజకవర్గం పులివెందుల చేరుకున్నారు. జగన్ పులివెందులకు రాగానే కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. శనివారం పులివెందుల చర్చిలో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్ సమాధి వద్ద నివాళులర్పిస్తారు.

1వ పేజీ తరువాయి

ఏపీకి హోదా ఖాయం

దుబాయి నగరాన్ని తీర్చిదిద్దారు'అని రాహుల్ అన్నారు. 'మీ సేవలు లేకుండా ఇలాంటి నిర్మాణాలు అసాధ్యం. ఇంత అభివృద్ధి వెనకు మీరుండడం భారత్‌కు గర్వకారణం'అని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. '2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తాం'అని కార్మికులకు హామీ ఇచ్చారు. పార్లమెంట్‌లో కేంద్రం ప్రభుత్వం ఏపీకి ఇచ్చిన హామీలను ప్రధాని నరేంద్ర మోదీ అమలుచేయలేదని ఆయన విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ విమర్శలు గుప్పించారు. రెండ్రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన కాంగ్రెస్ అధినేతకు దుబాయి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. యూఏఈ అభివృద్ధిలో భాగస్వాములైన భారతీయ కార్మికులను రాహుల్ ప్రశంసలతో ముంచెత్తారు. గల్ఫ్‌లో సమస్యలు ఎదుర్కొంటున్న భారతీయ కార్మికులను తాము ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

కోడికత్తి నిందితుడికి 25 వరకు రిమాండ్

దర్యాప్తు ఎన్ఐఏ చేతిలోకి వెళ్లిన క్రమంలో అధికారుల విజ్ఞప్తి మేరకు కేసు పత్రాలు విశాఖ కోర్టు నుంచి విజయవాడలోని ఎన్ఐఏ కోర్టుకు బదిలీ అయ్యాయి. మరోవైపు విశాఖ జైలులో ఉన్న శ్రీనివాసరావు రిమాండు గడువు కూడా ముగియడంతో కేసు దర్యాప్తుకు సంబంధించి న్యాయపరమైన చర్యలు పూర్తి చేసిన ఎన్ఐఏ అధికారులు నిందితుడు శ్రీనివాసరావును విశాఖ నుంచి తీసుకువచ్చి మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టు ఇన్‌ఛార్జి ఫ్యామిలీ కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఈనెల 25వ తేదీ వరకు రిమాండు గడువు పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ కోర్టుకు తీసుకువచ్చిన అధికారులు కోర్టు ఆదేశాలతో నగరంలోని జిల్లా జైలుకు తరలించారు. నిందితుడు శ్రీనివాసరావుకు జిల్లా జైలులో ప్రత్యేక బ్యారక్ కేటాయించారు. కాగా కేసులో పూర్తి సమాచారాన్ని రాబట్టేందుకు నిందితుడిని విచారించాల్సి ఉన్నందున తమ కస్టడీకి ఇవ్వాలంటూ ఎన్ఐఏ అధికారులు కోర్టును కోరారు. ఎన్ఐఏ తరపు న్యాయవాది కోర్టులో ఈమేరకు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలు వినిపించేందుకు నిందితుడు శ్రీనివాసరావు తరుపు న్యాయవాది కోర్టుకు హాజరుకాలేదు. అయితే ఎన్ఐఏ దాఖలు చేసిన పిటిషన్‌పై జరిగిన విచారణలో నిందితుడు శ్రీనివాసరావు ఎన్ఐఏ అధికారుల కస్టడీకి అంగీకారం తెలిపాడు. తాను విచారణకు సహకరిస్తానని న్యాయమూర్తికి తెలియచేశాడు. దీంతో ఎన్ఐఏ విజ్ఞప్తితో వారం రోజులపాటు కస్టడీకి అనుమతి ఇస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

కూటమికి బీటలు!

మహా ర్యాలీకి వ్యక్తిగతంగా వచ్చి ఆహ్వానించలేదు. మమతా బెనర్జీ ఇతర మిత్రపక్షాల నాయకులను స్వయంగా కలిసి ర్యాలీ ఆహ్వానం అందజేయగా రాహుల్, సోనియాని మాత్రం ఆమె స్వయంగా పిలవలేదు. ర్యాలీకి రావలసిందంటూ ఆమె కాంగ్రెస్ పార్టీకి ఒక లేఖ మాత్రం రాశారు. మమతా బెనర్జీ స్వయంగా వచ్చి ఆహ్వానం ఇవ్వకుండా కాంగ్రెస్‌కు లేఖ రాయటం అంటే తమను అవమానించటమేనని రాహుల్, సోనియా భావిస్తున్నట్లు తెలిసింది. అందుకే కోల్‌కత్తా ర్యాలీకి హాజరు కాకూడదని రాహుల్ గాంధీ నిర్ణయించుకున్నారు. అయితే జాతీయ స్థాయిలోని ప్రతిపక్ష పార్టీల రాజకీయ ప్రయోజనాల కోసం సీనియర్ నాయకులను కోల్‌కత్తా ర్యాలీకి పంపించాలని రాహుల్ ఆలోచిస్తున్నట్లు తెలిసింది. కోల్‌కత్తా ర్యాలీకి బీజేపీయేతర ప్రతిపక్ష పార్టీల అధినాయకులందరు హాజరవుతుంటే కాంగ్రెస్ అధ్యక్షుడు హాజరు కాకపోవటం ఏమిటన్నది ప్రశ్న. రాహుల్ నాయకత్వంలో పని చేయటం తనకు ఎంత మాత్రం సాధ్యం కాదని మమతా బెనర్జీ ఇప్పటికే పలుమార్లు స్పష్టంగా చెప్పటంతోపాటు ఈ విషయాన్ని ఆమె సోనియాకి కూడా చెప్పారు. ఈ కారణం చేతనే ఆమె కోల్‌కత్తా ర్యాలీకి రాహుల్, సోనియాను వ్యక్తిగతంగా కలిసి ఆహ్వానించలేదని అంటున్నారు. మహా కూటమి సభ్యులైన చంద్రబాబు నాయుడు, ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, ఎన్‌సీ అధినాయకుడు ఫరూక్ అబ్దుల్లా, ఇతర పార్టీల సీనియర్ నాయకులు హాజరవుతున్నారు. ఈ పరిణామం కాంగ్రెస్ వర్గాల్లో ఆందోళన రేపుతున్నది.

ఇక పింఛన్ రూ.2 వేలు

తిరుపతి - చెన్నై కారిడార్ భవిష్యత్తులో ఒక పారిశ్రామిక జంక్షన్‌గా మారబోతోందన్నారు. నెల్లూరు జిల్లాలో సుమారు 65వేల మంది సి జె ఎఫ్ ఎస్ భూముల రైతులకు 66,272 ఎకరాలకు సంబంధించి డికెటి పట్టాలు ఒకే రోజు ఇవ్వడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని, ఇందులో అధికారుల పాత్ర ప్రశంసనీయమని అన్నారు. పొట్టిశ్రీరాములు జన్మస్థలమైన జువ్వలదిన్నెను పర్యాటక స్థలంగా అభివృద్ధి చేశామని, అందులో భాగంగానే రూ.4కోట్లతో నిర్మించిన పొట్టిశ్రీరాములు స్మారక భవన సముదాయాన్ని ప్రారంభించానన్నారు. రూ.110కోట్లతో ఈ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దే కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని, దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు మోదీలు తనపై గురిపెట్టారని, వారిలో ఒకరు ఢిల్లీ మోదీ కాగా, మరొకరు జగన్ మోదీ అని, ఇంకొకరు తెలంగాణలో కేసీఆర్ మోదీ అని ఎద్దేవా చేశారు. తాను ఎవరికీ భయపడనని, తనకు ప్రజాబలం ఉందని, తనను కాపాడుకునే బాధ్యత కూడా వారిదేనని పిలుపునిచ్చారు. అండగా ఉండే బాధ్యత ప్రజలదని, వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాను ఎన్ డీ ఏకు మద్దతునిచ్చానని, చివరకు మోసం చేశారని ఆరోపించారు. జయప్రకాష్ నారాయణ, పవన్‌కల్యాణ్ ఏర్పాటు చేసిన నిజ నిర్ధారణ కమిటీలు కూడా కేంద్రం రాష్ట్రానికి రూ.80వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని నివేదికలో పేర్కొన్నాయని గుర్తుచేశారు. అమరావతికి మోదీ మట్టి, నీళ్లు ఇచ్చారని, మీరు కూడా అవే ఇస్తారా.. అంటూ ప్రజల్ని ప్రశ్నించారు.

విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రానికి తనలాంటి అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ప్రజలు తనను గెలిపించారని అన్నారు. ప్రతి పనికీ నమ్మకమే ప్రధానమని, అదే నమ్మకంతో పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నారని అన్నారు. ఒకే రోజు లక్ష కోట్ల పెట్టుబడి పరిశ్రమలు రాష్ట్రంలో నెలకొల్పేందుకు ఎం ఓ యూలు కుదుర్చుకున్నామన్నారు. రామాయపట్నం సమీపంలో దేశంలోనే అతి పెద్ద విదేశీ పెట్టుబడిగా ఇండోనేసియా కంపెనీ పేపర్ పరిశ్రమ పెడుతోందన్నారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జగన్ గెలిస్తాడనే భయంతో కొందరు పెట్టుబడులు పెట్టేందుకు వెనకడుగు వేస్తున్నారని అన్నారు. తన కష్టాన్ని కుక్కలు చింపిన విస్తరి చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంక్షోభ సమయంలో సమర్థుడైన నేతను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని, ప్రపంచంలో పలు దేశాల్లో సంక్షోభాలు తలెత్తిన సమయంలో సమర్థుడైన నేతలకు పలుసార్లు ప్రజలు పట్టం కట్టారని గుర్తు చేశారు.

విమానాశ్రయానికి శంకుస్థాపన

జిల్లాకేంద్రానికి సమీపంలోని దగదర్తి వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన పైలాన్‌ను ఆవిష్కరించారు. అంతక్రితం జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. అదే గ్రామంలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ, స్మారక భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, పోలంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

54,14,592 మందికి ప్రయోజనం

అధికారులను ఆదేశించారు. దీంతో 54లక్షల 14వేల 592 మందికి లబ్ధి చేకూరనుంది. తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 80 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లకు ఇకపై రూ 3వేల పింఛను అందుతుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అధికారంలోకి వచ్చే ముందు నెలకు రూ 200 మాత్రమే పింఛను అందేది. ప్రమాణస్వీకారం చేసిన వెంటనే దాన్ని వెయ్యి రూపాయలకు పెంచారు. దీంతో పేదల్లో భరోసా కలిగింది. ఇంతకాలంగా కేంద్రం ఆర్థికంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తగిన సాయం అందించకపోయినా ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు. వెనుకబడిన జిల్లాలకు రూ 350 కోట్లు ఇచ్చినట్టే ఇచ్చి తిరిగి కేంద్రం తీసుకోవటం రాష్ట్రానికి శరాఘాతం అయినప్పటికీ పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. 2014 అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున ప్రారంభమైన 'ఎన్టీఆర్ భరోసా' పథకం తాజా పెంపుతో రాష్ట్ర సంక్షేమ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతున్న ఎన్టీఆర్ భరోసా పథకం దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకంగా రికార్డు సృష్టించింది. ఏ రాష్ట్రంలో లేనంతగా 54 లక్షల మందికి జీవన భృతిని అందిస్తోంది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో రూ 24,618 కోట్లు ఖర్చు చేసింది. జన్మభూమి 6వ విడతలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్తగా మరో 3,50,000 మందికి పెన్షన్ మంజూరు చేయాలని నిర్ణయించింది. తాజాగా పెంచిన అదనపు పెన్షన్‌ను ఫిబ్రవరి నెల కొత్త పెన్షన్‌తో కలిపి చెల్లిస్తారు. దీని ప్రకారం జనవరిలో ఇప్పటికే రూ 1000 పెన్షన్ తీసుకున్న లబ్ధిదారులు ఫిబ్రవరి నెలలో 3వేలు పొందుతారు. ఆ తరువాత నెల నుంచి యథావిధిగా 2 వేల రూపాయల కొత్త పెన్షన్ అందుతుంది. గత ప్రభుత్వంలో ఉన్న పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయగానే ఐదు రెట్లు పెంచగా ఇప్పుడు ఏకంగా రెట్టింపు చేశారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై వయోవృద్ధుల్లో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నాయి. సమజాంలో కుటుంబ సభ్యుల ఆదరణ కరవై, వయసు పైబడటంతో పనిచేసేందుకు శరీరం సహకరించక దుర్భర జీవితాలను అనుభవించే వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, వంటి లక్షలాది మందికి పింఛను భరోసా పెరిగింది. తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 54లక్షల మందికి ప్రభుత్వం పింఛన్లు ఇస్తుండగా వారిలో 24,22,444 మంది వృద్ధులే ఉన్నారు. ఇక 20,13,808 మంది వితంతువులు, 6,41,820 మంది దివ్యాంగులు, మరో 28,011 మంది కల్లుగీత కార్మికులు, 32వేల 979 మంది హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు, 1665 మంది ట్రాన్స్‌జెండర్లు, 45,358 మంది మత్స్యకారులు, 1,12,471 మంది ఒంటరి మహిళలు, 8044 మంది డయాలసిస్ వ్యాధిగ్రస్తులు పెన్షన్ లబ్ధిదారుల జాబితాలో ఉన్నారు.

వృద్ధులు- 24,22,444, వితంతువులు-20,13,808, దివ్యాంగులు- 6,41,820, చేనేత కార్మికులు- 1,07,992, కల్లుగీత కార్మికులు- 28011, హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు- 32,979, ట్రాన్స్‌జెండర్లు-1665, మత్స్యకారులు- 45,358, ఒంటరి మహిళలు- 1,12,471, డయాలసిస్ రోగులు- 2044, మొత్తం 54,14,592 మంది ప్రయోజనం పొంద నున్నారు.

మళ్లీ మోదీయే ప్రధాని

2019 ఎన్నికలు జరుగుతాయని అమిత్ షా జోస్యం చెప్పారు. ఈ ఎన్నికలు రెండు ఆలోచనా పద్ధతులు, రెండు సిద్ధాంతాల మధ్య జరిగే పోరాటంగా అభివర్ణించారు. దేశాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న ఎన్‌డీఏ ఈ ఎన్నికల్లో మరోసారి ఘన విజయం సాధించి తీరుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మోదీని మరోసారి ప్రధాన మంత్రి చేయాలనే సంకల్పంతో మనమంతా ముందుకు సాగాలని ఆయన సమావేశానికి దేశం నలుమూలల నుండి వచ్చిన పన్నెండు వేల మంది పార్టీ నాయకులకు పిలుపు ఇచ్చారు. ఆయోధ్యలో రామమందిరాన్ని నిర్మించి తీరుతామని అమిత్ షా ప్రకటించారు. ఈ నిర్మాణం వీలున్నంత త్వరగా జరగాలన్నారు. రామ మందిర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ అన్ని విధాల ప్రయోత్నిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబల్ కోర్టులో పిటిషన్ వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ తన అభిప్రాయం స్పష్టం చేయాలని అమిత్ షా డిమాండ్ చేశారు. ఉన్నత వర్గాలలోని బీద ప్రజలకు ఉద్యోగాలు, ఉన్నత విద్యారంగంలో పది శాతం రిజర్వేషన్లు కల్పించటం ద్వారా మోదీ ప్రభుత్వం దేశంలోని కోట్లాది మంది యువత ఆశలు, ఆశయాలకు ప్రాణం పోసిందని వ్యాఖ్యానించారు. వస్తు, సేవా పన్నులను (జీఎస్‌టీ) సరళీకృతం చేయటం ద్వారా ఎన్‌డీఏ ప్రభుత్వం వ్యాపార రంగంలో విప్లవం తెస్తోందన్నారు. చిన్న వ్యాపారస్తులు, చిన్న పారిశ్రామికవేత్తలకు ఇప్పుడు ఎంతో ప్రయోజనం కలుగుతోందని అన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలు బీజేపీతో పాటు దేశంలోని కోట్లాది మంది ప్రజానీకానికి కూడా ఎంతో ముఖ్యమని వ్యాఖ్యానించారు. దేశంలోని బీద ప్రజలు అభివృద్ధి చెందాలంటే మోదీ మరోసారి ప్రధాన మంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. నీతి, నిజాయితీలేని వారంతా మహా కూటమిగా ఏర్పడుతున్నరని అమిత్ షా ఎద్దేవా చేశారు. మోదీని ఓడించాలనే ఏకైక లక్ష్యంతో మహా కూటమి పని చేస్తోందని ఆరోపించారు. ఎన్‌డీఏ కూటమి నాయకుడు మోదీ అనేది అందరికీ తెలుసునని, మరి మహా కూటమి నాయకుడు ఎవరని అమిత్ షా ప్రశ్నించారు. 2019 లోక్‌సభ ఎన్నికలు దేశ భవిష్యత్తుపై, భావి తరాలపై పెద్ద ప్రభావం చూపిస్తుందన్నారు. 17వ శతాబ్దంలో శివాజీ మహారాష్ట్ర నాయకత్వంలో స్వాతంత్ర పోరాటం ప్రారంభమై ఎన్నో ప్రాంతాలను గెలుచుకోటం జరిగిందని, అయితే అబ్దాలీ, సదాశివ్‌భావ్ మధ్య జరిగిన మూడో పానిపట్టు యుద్ధంలో మరాఠా సైన్యాలు ఓడిపోయాయని తెలిపారు. ఈ ఓటమి మూలంగా దేశం దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు పరాయి పాలనలో బానిసలుగా బతకవలసి వచ్చిందని అమిత్ షా గుర్తుచేశారు. 2019 ఎన్నికలు కూడా ఇలాంటివేనని, ఒకవేళ ఈ ఎన్నికల్లో ఓడిపోతే బీజేపీకే గాక దేశానికి కూడా తీవ్ర నష్ట వాటిల్లుతుందని ఆయన హెచ్చరించారు.

క్రీడాభూమి

టెస్టు సిరీస్‌లో ఘన విజయంతో

వనే్డ సిరీస్‌పై కనే్నసిన టీమిండియా

నేడు ఆసిస్‌తో తొలి వనే్డ

సిడ్నీ, జనవరి 11: ఆతిథ్య ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో 2-1తో అద్భుత విజయాన్ని అందుకున్న విరాట్ కోహ్లీ నేతృత్వంలోని టీమిండియా ఇపుడు శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడు వనే్డ సిరీస్‌లోనూ మరో విజయాన్ని అందుకునేందుకు సిద్ధమైంది. ఆసిస్‌లో ఏడు దశాబ్దాల తర్వాత తొలిసారి టెస్టు సిరీస్‌లో ఘన విజయాన్ని నమోదు చేసిన కోహ్లీ సేన రానున్న వరల్డ్ కప్‌కు పూర్తి సన్నద్ధతగా ఉన్నామని తెలిపేందుకు శనివారం నుంచి ప్రారంభం కానున్న తొలి వనే్డ ద్వారా ప్రపంచానికి చాటిచెప్పాలని ఉవ్విళ్లూరుతోంది. మహిళలపై టీమిండియా ఆటగాళ్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించిన జట్టు సారథి కోహ్లీ దాని ప్రభావం వనే్డ సిరీస్‌పై ఎంత మాత్రం లేదని అందుకు తగ్గట్టు జట్టు ఎంపిక జరుగనుందని స్పష్టం చేశాడు. తొలి వనే్డలో చోటు దక్కించుకున్న రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌తోపాటు బౌలింగ్‌తో దాడి చేసేందుకు వీలుగా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, మహమ్మద్ షమీ, ఖలీల్ అహమ్మద్, ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, కేదార్ జాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. కేదార్ జాదవ్, మహేంద్ర సింగ్ ధోనీ, అంబటి రాయుడు మిడిలార్డర్‌లో బరిలోకి దిగొచ్చు.

టాప్-3 బ్యాట్స్‌మెన్‌పైనే దృష్టి : ఫించ్

సిడ్నీ, జనవరి 11: పర్యాటక భారత్‌తో శనివారం జరిగే తొలి వనే్డలో ప్రత్యర్థి జట్టులోని తొలి ముగ్గురు ఆటగాళ్లను పడగొట్టడంపైనే తాము దృష్టిని కేంద్రీకరిస్తామని ఆతిథ్య ఆస్ట్రేలియా కెప్టెన్ ఆరోన్ ఫించ్ అన్నాడు. టెస్టు సిరీస్‌లో ఓటమిని చవిచూసిన ఆసిస్ శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడు వనే్డల సిరీస్‌లో తన సత్తా చూపేందుకు సిద్ధమైంది. ప్రత్యర్థి టీమ్‌లోని టాప్-3 ఆటగాళ్లను ఆదిలోనే దెబ్బతీయడం ద్వారా వారి మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తామని ఆసిస్ కెప్టెన్ స్పష్టం చేశాడు. ముఖ్యంగా శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని త్వరితగతిన పెవిలియన్ పంపేందుకు తాము ప్రణాళికను రచిస్తున్నామని అన్నాడు. గడిచిన 12 నెలల కాలంలో విరాట్ కోహ్లీ సగటు పరుగులు 133, శిఖర్ ధావన్ 75, రోహిత్ శర్మ 50. కనుక పరుగుల వరద సృషించగల అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్‌లను దెబ్బతీయడమే తమ ముందున్న కర్తవ్యమని పేర్కొన్నాడు. టాప్ ఆర్డర్‌ను దెబ్బతీయడం వల్ల మిడిలార్డర్‌లో రానున్న ధోనీ, దినేష్ కార్తీక్, కేదార్ జాదవ్‌ను పంపించడం సులువు అవుతుందని అన్నాడు.

విరాట్ కోహ్లీ, రవి శాస్ర్తికి


సిడ్నీ గ్రౌండ్‌లో గౌరవ సభ్యత్వం

సిడ్నీ, జనవరి 11: టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, జట్టు ప్రధాన కోచ్ రవి శాస్ర్తికి అరుదైన గౌరవం దక్కింది. వీరిద్దరూ క్రికెట్‌కు అందించిన అపార సేవలకుగాను ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ)లో శుక్రవారం జీవితకాల గౌరవ సభ్యత్వాన్ని దక్కించుకున్నారు. 71 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై ఆతిథ్య జట్టును నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1 తేడాతో ఓడించి భారత్ ఘన విజయాన్ని నమోదు చేసింది. 'ఆసిస్ మైదానంపై తొలిసారిగా టెస్టు సిరీస్‌ను చేజిక్కించుకున్నందుకు ఎస్‌సీజీ అభినందనలు తెలుపుతోంది. ఇది అత్యద్భుతం. అతి పెద్ద క్రికెట్ దేశంగా వెలుగొందుతున్న భారత్ టెస్టులకు పునర్వైభవం కల్పించేందుకు ఇది కీలక అడుగు' అని అభివర్ణిస్తూ ఎస్‌సీజీ చైర్మన్ టోనీ షెపర్డ్ తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్నాడు. కోహ్లీతోపాటు తనకు ఎస్‌సీజీలో గౌరవ సభ్యత్వం దక్కడం గొప్ప ఘనతగా అభివర్ణించాడు టీమిండియా కోచ్ రవి శాస్ర్తి. ఈ సిడ్నీ మైదానంలో గౌరవ సభ్యత్వం పొందినవారిలో క్రికెట్ దిగ్గజాలు సచిన్ తెండూల్కర్, బ్రియాన్ లారా ఉన్నారు.

రాహుల్, పాండ్యపై నిషేధం

★ మహిళలపై అనుచిత వ్యాఖ్యల ఫలితం ★ యువ ఆటగాళ్లపై దర్యాప్తు: వినోద్‌రాయ్
★ క్షమాపణలు సరిపోవు, రెండు మ్యాచ్‌ల్లో నిషేధం విధించాలి : డయానా ఎడుల్జీ
★ ఆ క్రికెటర్ల చర్యను టీమిండియా సమర్థించదు: కోహ్లీ ★ తొలి వనే్డలో హార్దిక్ స్థానే జడేజా


విరాట్ కోహ్లీ


వినోద్ రాయ్


డయానా ఎడుల్జీ

సిడ్నీ, జనవరి 11: ఆస్ట్రేలియా గడ్డపై 71 ఏళ్ల తర్వాత తొలిసారిగా టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకున్నామన్న విజయగర్వంతో ఉన్న టీమిండియాకు కాఫీ విత్ కరణ్ టీవీ షోలో మహిళలపై అనుచితంగా, అసభ్యకరంగా యువ క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్య చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. ఈ ఏడాది ఇంగ్లాండ్‌లో ప్రారంభమయ్యే వరల్డ్ కప్‌కు ఇప్పటినుంచే సన్నాహాలు మొదలుపెట్టిన నేపథ్యంలో వారిద్దర్నీ శనివారం ఆతిథ్య ఆస్ట్రేలియాతో జరుగనున్న తొలి వనే్డ ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో ఆడకుండా బీసీసీఐ తాజాగా నిర్ణయం తీసుకుంది. అయితే, రాహుల్, పాండ్య మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై ఒక మ్యాచ్‌లో ఆడకుండా సస్పెండ్ చేసిన నేపథ్యంలో వారిపై తదుపరి చర్యలు తీసుకునేందుకు వీలుగా సమగ్ర దర్యాప్తు చేపడతామని పాలక వర్గ కమిటీ (సీఓఏ) చైర్మన్ వినోద్ రాయ్ స్పష్టం చేశాడు. అయితే, యువ క్రికెటర్లు మహిళలపై చేసిన వ్యాఖ్యలు అసభ్యకరంగా, నిస్సిగ్గుగా ఉన్నాయని, తమ వ్యాఖ్యలపై వారిద్దరూ క్షమాపణలు కోరినా సరిపోవని, వారిని సస్పెండ్ చేయాలని సీఓఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ డిమాండ్ చేశారు. సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్ పాండ్య, రాహుల్‌పై రెండు వనే్డల్లో నిషేధం విధించాలని అభిప్రాయపడగా, ఈ అంశాన్ని బీసీసీఐ లీగల్ సెల్‌కు పంపాలని డయానా కోరారు. అయితే, క్రికెటర్ల వ్యాఖ్యలు బీసీసీఐ నిబంధనల ఉల్లంఘన కిందకు రాదని చెప్పడంతో వారిని సస్పెండ్ చేశారు. కాగా, పాండ్య, రాహుల్ వ్యాఖ్యలు ఎంతమాత్రం సమర్థనీయం కావని, వీటిని టీమిండియా ఎంతమాత్రం సహించబోదని కెప్టెన్ విరాట్ కోహ్లీ పేర్కొన్నాడు. మహిళలపై ఆ యువ ఆటగాళ్ల వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని, ఆ వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమైనవని, వాటి ప్రభావం జట్టుపై ఏమాత్రం పడదని అంటూ వారి వ్యాఖ్యలు వారి విచక్షణకే వదిలేస్తున్నానని అన్నాడు. వీరిద్దరూ తదుపరి మ్యాచ్‌లలో ఆడేది లేనిదీ అనే విషయమై బీసీసీఐ తుది తీర్పు కోసం ఎదురు చూస్తున్నామని అన్నాడు. ఏడాది వరల్డ్ కప్ సన్నద్ధమవుతున్న తరుణంలో అత్యుత్సాహంతో ఆ ఇద్దరు క్రికెటర్లు చేసిన వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నాడు. అయినా, ఇవేమీ తమ జట్టుపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోవమని తాము బలంగా నమ్ముతున్నామని అన్నాడు. ఒక మ్యాచ్‌లో సస్పెన్షన్ నేపథ్యంలో శనివారం ఆస్ట్రేలియా-భారత్ మధ్య జరిగే తొలి వనే్డలో పాండ్య, రాహుల్ ఆడేందుకు అవకాశం లేదని బీసీసీఐ అధికార వర్గాలు పీటీఐ ప్రతినిధికి తెలిపాయి. ఈ యువ బ్యాట్స్‌మెన్‌లపై ఒక మ్యాచ్‌కు సస్పెండ్ చేయడంతో వారు చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ చేపడతామని సీఓఏ చైర్మన్ వినోద్ రాయ్ పీటీఐ ప్రతినిధికి తెలిపాడు.

బీసీసీఐ అంతర్గత కమిటీ లేదా అడ్‌హాక్ అంబుడ్స్‌మన్ కమిటీ దీనిపై విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఇద్దరు ఆటగాళ్లు చేసిన వ్యాఖ్యలు క్రికెట్ క్రీడా నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తాయా లేదా అన్న విషయమై వ్యాఖ్యానించేందుకు బీసీసీఐ లీగల్ టీమ్ నిరాకరించింది. ఇప్పటికే టీమిండియా జట్టుతో ఆస్ట్రేలియాలో ఉన్న రాహుల్, పాండ్యను స్వదేశానికి రప్పించేందుకు, వారి స్థానంలో రిషబ్ పంత్, మనీష్ పాండ్యను తీసుకునే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా విజయ్ శంకర్, శ్రేయాస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకున్నా ఆశ్చర్యపడాల్సిన పని లేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

పాండ్య స్థానే జడేజా: కోహ్లీ

ఆస్ట్రేలియాతో శనివారం జరిగే తొలి వనే్డలో తొలుత చోటుదక్కించుకుని మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సస్పెండైన యువ బ్యాట్స్‌మన్ హార్దిక్ పాండ్య స్థానంలో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చోటుదక్కింది. పాండ్య, రాహుల్ చేసిన వ్యాఖ్యలతో తాను ఎలాంటి ఒత్తిడి గురికాలేదని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. ఇద్దరు యువ ఆటగాళ్లపై తొలి వనే్డకు నిషేధం విధించిన నేపథ్యంలో దాని ప్రభావం మ్యాచ్‌లపై ఎంతమాత్రం పడబోదని కోహ్లీ అన్నాడు. 'ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన ఫింగర్ స్పిన్నర్, రిస్ట్ స్పిన్నర్‌తో బరిలోకి దిగాం, ఇపుడు తొలి వనే్డలో పాండ్య స్థానే జట్టులోకి తీసుకుంటున్న రవీంద్ర జడేజా కీలక భూమిక పోషించగలడని నమ్ముతాం' అని కోహ్లీ అన్నాడు. కొన్ని సందర్భాల్లో అక్కరకు వచ్చేందుకు కొంతమంది ఆటగాళ్లను తామెప్పుడూ సిద్ధంగా ఉంచుతామని, కనుక ఆసిస్‌తో జరిగే తొలి వనే్డలో సమతూకం పాటించడం ద్వారా తాము ఎలాంటి ఒత్తిడికి గురికాబోమని స్పష్టం చేశాడు. ఇద్దరు కీలక ఆటగాళ్లను తప్పించినంతమాత్రాన దాని ప్రభావం మారిన జట్టుపై ఎలాంటి ప్రతికూల వాతావరణం చూపబోదని అన్నాడు. రానున్న వరల్డ్ కప్ కంటే ముందు ఆడేందుకు మరీ ఎక్కువ మ్యాచ్‌లు లేనందువల్ల తాము ఆటగాళ్లపై ఒత్తిడి పెంచకుండా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నాడు. ఇందులో భాగంగానే జస్ప్రీత్ బుమ్రాపై ఒత్తిడి పెరగకుండా టెస్టు సిరీస్ తర్వాత విశ్రాంతి కల్పించామని అన్నాడు. వరల్డ్ కప్‌లో పూర్తిగా అటాక్ చేసేందుకు వీలుగా పలువురు పేసర్ల సేవలను వినియోగించుకునే ఆలోచన కూడా ఉందని అన్నాడు.

రిటైర్మెంట్ అయితే బ్యాట్ పట్టను : విరాట్ కోహ్లీ

క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించే రోజు వస్తే ఆ తర్వాత బ్యాట్ పట్టే అవకాశం లేదని టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. కొంతమంది ఆటగాళ్లు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన తర్వాత టీ-20 వంటి లీగ్ మ్యాచ్‌లలో ఆడుతున్న నేపథ్యంలో సంచలన ప్రకటన చేశాడు. క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాక ఆస్ట్రేలియా బిగ్ బాష్ తోపాటు పలు లీగ్ మ్యాచ్‌లలో ఆడే అవకాశం ఉందా అన్న మీడియా ప్రశ్నలకు కోహ్లీ తన వైఖరిని మరోసారి స్పష్టం చేస్తూ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తే బ్యాట్ పట్టేది లేదని అన్నాడు. క్రికెట్‌లోనే ఎక్కువ కాలం కొనసాగాలని అభిలషిస్తున్నానని స్పష్టం చేశాడు. క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఏబీ డివిలియర్స్, బ్రెండన్ మెక్‌కల్లమ్ వంటివారు రెగ్యులర్‌గా టీ-20, ఐపీఎల్, బిగ్ బాష్ వంటి లీగ్‌లలో ఆడుతున్న నేపథ్యంలో తాను మాత్రం వారి జాబితాలో చేరేందుకు ఆసక్తి కనబరచడం లేదని పేర్కొన్నాడు. 'గత ఐదేళ్ల కాలంగా నేను ఎన్నో మ్యాచ్‌లలో ఆడాను. రిటైర్మెంట్‌పై ప్రకటించే ఆలోచన ఎంతమాత్రం లేదు. ఒకవేళ అలాంటి పరిస్థితే వస్తే ఆ తర్వాత బ్యాట్‌ను ముట్టను. మైదానంలో అడుగుపెట్టను' అని కోహ్లీ మరోసారి స్పష్టం చేశాడు.

బులియన్

ముంబయిలో		**హైదరాబాద్‌లో**	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,128.00	1 గ్రాము:	రూ. 3,072.00
8 గ్రాములు:	రూ. 25,024.00	8 గ్రాములు:	రూ. 24,576.00
10 గ్రాములు:	రూ. 31,280.00	10 గ్రాములు:	రూ. 30,720.00
100 గ్రాములు:	రూ. 3,12,800.00	100 గ్రాములు:	రూ. 3,07,200.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,345.455	1 గ్రాము:	రూ. 3,285.561
8 గ్రాములు:	రూ. 26,763.640	8 గ్రాములు:	రూ. 26,284.488
10 గ్రాములు:	రూ. 33,454.550	10 గ్రాములు:	రూ. 32,855.610
100 గ్రాములు:	రూ. 3,34,545.50	100 గ్రాములు:	రూ. 3,28,556.10
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 331.20	8 గ్రాములు:	రూ. 331.20
10 గ్రాములు:	రూ. 441.00	10 గ్రాములు:	రూ. 441.00
100 గ్రాములు:	రూ. 4,140.00	100 గ్రాములు:	రూ. 4,140.00
ఒక కిలో:	రూ. 41,400.00	ఒక కిలో:	రూ. 41,400.00

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతం

జీఎస్‌టీ మినహాయింపును రెట్టింపు చేయడంపై
'ఫిక్కీ' అధ్యక్షుడు సోమానీ హర్షం



ఆంధ్రభూమి బ్యూరో


హైదరాబాద్, జనవరి 11: జీఎస్‌టీ మినహాయింపును రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలుగా రెట్టింపు చేయడం పట్ల 'ఫిక్కీ' హర్షం వ్యక్తం చేసింది. దీంతో సింప్లిఫైడ్ కంపోజిషన్ స్కీంతో పాటు తన పరిధిలోకి సర్వీస్ ప్రొవైడ్లను తీసుకుని రావడం ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజ్‌లకు గొప్ప ప్రయోజనం చేకూరుతుందని 'ఫిక్కీ' ప్రెసిడెంట్ సందీప్ సోమాని అన్నారు. కౌన్సిల్ నిర్ణయాలలో ఇది అత్యంత కలికమైందని, దీనిని మరింత పెంచుతుందని ఆశిస్తున్నానని ఆమె చెప్పారు. కంపోజిషన్ స్కీమ్‌కు వార్షిక టర్నోవర్ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లకు పెంచాలన్న నిర్ణయంతో పాటు వార్షిక రిటర్న్ ఫైలింగ్‌తో పాటు త్రైమాసిక పన్ను చెల్లింపు సౌకర్యం కల్పించడం వల్ల వ్యాపారులకు ఊరట అని ఆమె తెలిపారు.

మంజీరా మాల్‌లో స్టోర్‌ను ప్రారంభించిన లైఫ్ స్టయిల్

హైదరాబాద్‌లోని మంజీరా మాల్‌లో లైఫ్ స్టయిల్ నూతనంగా స్టోర్‌ను ప్రారంభించింది. సుమారు 48 వేల చదరపు అడుగుల సువిశాల విస్తీర్ణంలో 2 అంతస్థులలో స్టోర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా లైఫ్ స్టయిల్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వసంత్ కుమార్ మాట్లాడుతూ లైఫ్ స్టయిల్‌కు హైదరాబాద్‌లో నాలుగవదని, దేశంలో 76వ స్టోర్ అని తెలిపారు. క్లిక్ అండ్ కలెక్టర్, ఇంకా రిటర్న్ టు స్టోర్ వంటి సౌకర్యాలతో తమ కస్టమర్లకు అన్ని రకాలైన షాపింగ్ అనభవాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ స్టోర్‌ను లైఫ్ స్టయిల్ 'సేల్'తో ప్రారంభించి ప్రముఖ బ్రాండ్లపై 50 శాతం వరకు తగ్గింపు ధరలతో అందిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకు, స్టాండర్స్ ఛార్టర్డ్ బ్యాంక్ డెబిట్, క్రెడిట్ కార్డును కలిగిన వారు రూ.8 వేలు లేదా ఆపై కొనుగోలు చేస్తే 5 శాతం వరకు అదనపు క్యాష్ బ్యాక్ సదుపాయాన్ని (షరతులు వర్తిస్తాయి) పొందవచ్చని ఆయన వివరించారు.

'బై బ్యాక్'కు ఇన్ఫోసిస్ సిద్ధం

◆ ప్రత్యేక డివిడెండ్లు ఇస్తామని ప్రకటన



న్యూఢిల్లీ, జనవరి 11: వాటాల బై బ్యాక్‌కు ఇన్ఫోసిస్ సిద్ధమైంది. 8,260 కోట్ల రూపాయల విలువైన వాటాలను తిరిగి కొనాలని పాలక మండలి నిర్ణయించినట్టు ఇన్ఫోసిస్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. 13,000 కోట్ల రూపాయల పెట్టుబడుల కేటాయింపులో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. షేర్లను అమ్మేందుకు వాటాదారులను ఆకర్షించే దిశగా ఒక్కో వాటాకు నాలుగు రూపయల చొప్పున ప్రత్యేక డివిడెంట్ ఇవ్వాలని తీర్మానించినట్టు ఇన్ఫోసిస్ వివరించింది. కంపెనీకి లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కిరణ్ మజుందార్ షాను మళ్లీ నియమించాలని కూడా నిర్ణయించినట్టు పేర్కొంది. ఈ నియామకం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 22వ తేదీ వరకు అమల్లో ఉంటుందని తెలిపింది. ఇన్ఫోసిస్ ప్రకటన ప్రకారం, ఆ కంపెనీ 10,32,50,000 ఈక్విటీ షేర్లను తిరిగి కొనుగోలు చేయనుంది. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి చెల్లించిన మూల ధనంలో ఇది 2.36 శాతం. ఈ వాటాలు కొనేందుకు 8,260 కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో భారత స్టాక్ ఎక్ఛ్సేంజ్ ద్వారా ఇన్ఫోసిస్ షేర్లను అమ్మింది. ఇప్పుడు ఒక్కో వాటాను 800 రూపాయలకు మించకుండా తిగిరి కొనడానికి తీర్మానించింది. అమెరికన్ డిపాజిటరీ షేర్ (ఏడీఎస్)ను షేర్ల రూపంలోకి మార్చుకోవడానికి కూడా ఇన్ఫోసిస్ అనుమతించింది. ఫలితంగా ఏడీఎస్‌లో ఉన్న వాటాలు ఈక్విటీ కిందకు మారిపోతాయి. అప్పుడు వాటిని 'బై బ్యాక్'లో కొనుగోలు చేసే వీలుంటుంది. ఇన్ఫోసిస్ ఈ విధంగా గతంలో అమ్మిన ఈక్విటీ వాటాలను తిరిగి కొనడం ఇది రెండోసారి. 2017 డిసెంబర్‌లో, మొదటిసారి 13,000 కోట్ల రూపాయలతో, 11.3 శాతం షేర్లను ఒక్కొక్కటీ 1,150 రూపాయలు చెల్లించి కొనింది. సుమారు మూడు దశాబ్దాల కంపెనీ చరిత్రలో ఇన్ఫోసిస్ వాటాలను తిరిగి కొనడం అమే మొదటిసారి. సుధా గోపాలకృష్ణన్, రోహన్ మూర్తి, ఎల్‌ఐసీ కీలకంగా వ్యవహరించడంతో అప్పుడు 'బై బ్యాక్' విజయవంతమైంది. కాగా, శుక్రవారం సెబీకి సమర్పించిన ఫైలింగ్‌లో మరోసారి 'బై బ్యాక్' నిర్ణయాన్ని ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఈసారి 2.36 శాతం వాటలను కొనాలని తీర్మానించింది.

త్రైమాసిక లాభాలు రూ. 3,609 కోట్లు

గడచిన డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి ఇన్ఫోసిస్ ఆదాయం రూ.21.400 కోట్ల రూపాయలు కాగా అంతకు ముందు యేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 3.8 శాతం అధికం, ఆ త్రైమాసికంలో ఈ కంపెనీ కోట్లు 20,607 ఆర్జించింది. జనవరి 11 నాటికి గడచిన త్రైమాసికంలో ఇన్ఫోసిస్ రూ.3,609 కోట్ల రూపాయల లాభాలను ఆర్జించింది. అయితే లాభాల్లో మాత్రం ఈ త్రైమాసికంలో 12.2 శాతం తగ్గుదల దమోదైంది. గడచిన త్రైమాసికంలో రూ.4,110 కోట్ల లాభాలు ఈ కంపెనీకి రాగా ప్రస్తుత త్రైమాసికంలో సుమారు 500 కోట్లమేర తగ్గడం గమనార్హం. కంపెనీ మార్కెట్ నియంత్రణ విభాగానికి సమర్పించిన గణాంకాల మేరకు దాదాపు 25 విశ్లేషణల మేరకు ఈ ఐటీ రంగ దిగ్గజ కంపెనీ త్రైమాసిక అంచనాలు రూపొందించారు.

అందులో ప్రధానమైన అంశాలివే..

ద్రవ్య లభ్యతను అనుసరించి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కంపెనీ ఆదాయాభివృద్ధి 2.7 శాతం, ఇదే త్రైమాసికంలో అంతకు క్రితం యేడాది 10.1 శాతం ఆదాయభివృద్ధి జరిగింది. పెరుగుతున్న క్లైయింట్ రిలవెన్స్‌తో తాము వృద్ధిలో ఏ యేటికాయేడు స్థిరమైన కరెన్సీ ప్రాతిపదికన డబుల్ డిజిట్ వృద్ధి రేటును అందుకోగలుగుతున్నామని ఆ కంపెనీ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ ప్రకాష్ పేర్కొన్నారు. అదే క్రమంలో డిజిటల్ ఆదాయంలో సైతం గడచిన సెప్టెంబర్ మాసంతో ముగిసిన త్రైమాసికంలో 5 శాతం వృద్ధిని చూస్తున్నామని అన్నారు. ఈ ఆదాయంలో సైతం యేడాదికి 33.1 శాతం వృద్ధి జరుగుతోందన్నారు. 2019వ సంవత్సరంలోకి మంచి ఫలితాలతోనే అడుగిడుతున్నందున ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు.



కిరణ్‌కు మళ్లీ అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 11: కంపెనీకి ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా వ్యవహరించే అవకాశం కిరణ్ మజుందార్ షాకు ఇన్ఫోసిస్ రెండోసారి కల్పించింది. ఏప్రిల్ ఒకటి నుంచి అమె అధికారికంగా బాధ్యతలు తీసుకుంటారు. సుమారు మూడు సంవత్సరాలు పాటు ఆమె ఈ పదవిలో ఉంటారు. ఆమెకు ఉన్న అపారమైన అనుభవం, వివిధ అంశాలపట్ల అవగాహన కంపెనీకి ఎంతగానో ఉపయోగపడతాయని ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలెకనీ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. బోర్డులో ఆమె పాత్ర కీలకమని, అందులో మరోసారి ఆమెకు అవకాశం కల్పించామని వివరించారు.

వాణిజ్యభూమి



వచ్చే వారం స్టాక్ మార్కెట్ పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనన్న అనుమానాన్ని రేకెత్తించేలా ఈవారానికి చివరి రోజైన శుక్రవారం నాటి లావాదేవీలు కొనసాగాయి. నష్టం స్వల్పమేగానీ, అంతర్జాతీయ సూచీలు సానుకూలంగా ఉన్న సమయంలో ఇలాంటి ప్రతికూల వాతావరణం నెలకొనడం అందరినీ ఆశ్చర్యానికీ, ఆందోళనకూ గురి చేస్తున్నది. సెనె్సక్స్ వరుసగా నాలుగు రోజులు లాభాలను ఆర్జించిన తర్వాత రెండు రోజుల నష్టాలు వచ్చే వారం ట్రెండ్ ఏ విధంగా ఉంటుందోనన్న ఆందోళనకు కారథమవుతున్నది. రూపాయి మారకపు విలువ పతనం కొనసాగడం మార్కెట్ నష్టాలకు ప్రధాన కారణమన్న వాదన బలంగా వినిపిస్తున్నది.

స్వల్ప పతనంతో ముగిసిన మార్కెట్

ముంబయి, జనవరి 11: లావాదేవీలకు ఈవారం చివరి రోజైన శుక్రవారం స్వల్ప నష్టంతో స్టాక్ మార్కెట్ ముగిసింది. నాలుగు రోజుల వరుస లాభాలకు గురువారం గండిపడిన విషయం తెలిసిందే. అయితే, అంతర్జాతీయ మార్కెట్ సూచీలు సానుకూల ధోరణులను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో, బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బీఎస్‌ఈ)లోనూ లాభాలు నమోదవుతాయన్న అభిప్రాయం వ్యక్తమైంది. కానీ, అందుకు భిన్నంగా సెనె్సక్స్ 36,214.26 నుంచి 35,840.60 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. చివరికి అత్యధికంగానీ, అత్యల్పంగానీ కాకుండా మధ్యస్తంగా 96.66 పాయింట్లు (0.27 శాతం) పతనమై 36,191.87 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 26.65 పతనమై 10,794.95 పాయింట్లుగా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లు బలపడుతున్న తరుణంలో బీఎస్‌ఈలో అందుకు ప్రతికూలమైన వాతావరణం కనిపించడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే, సంక్రాంతి పండుగ సీజన్ కావడంతో, ఇతరత్రా వ్యాపకాల్లో మునిగి, స్టాక్ మార్కెట్‌పై మదుపరులు పెద్దగా ఆసక్తి చూపలేదన్న వాదన వినిపిస్తున్నది. కాగా, శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, టీసీఎస్, ఎస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ కంపెనీల షేర్లు నష్టాలను ఎదుర్కొన్నాయి. లాభాలను ఆర్జించిన కంపెనీల్లో ఐటీసీ, ఓఎన్‌జీసీ, వేదాంతా లిమిటెడ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ ఉన్నాయి. ఫోరెక్స్‌లో డాలర్ 70.55 రూపాయలుగా ట్రేడ్ అయింది. అంటే, డాలర్‌కు రూపాయి విలువ 21 పైసలు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర 1.10 శాతం పెరిగి, బ్యారెల్ ధర 62.36 డాలర్లకు చేరింది.

మూడు శాతం పతనమైన టీసీఎస్ షేర్లు

టీసీఎస్ షేర్లు 3 శాతం పతనమైంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఆదాయం 24.1 శాతం పెరిగినట్టు టీసీఎస్ ప్రకటించింది. అయినప్పటికీ, ఆ కంపెనీ షేర్ల అమ్మకాలు నష్టాలతో ముగిశాయి. బీఎస్‌ఈలో టీసీఎస్ షేర్ 1,840 రూపాయలకు పడిపోయింది. నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్‌ఎస్‌ఈ)లోనూ ఈ పతనం స్పష్టంగా కనిపించింది. 2.71 శాతం నష్టపోయిన టీసీఎస్ షేర్ ధర 1,837.15 రూపాయలకు చేరింది. సాఫ్ట్‌వేర్ రంగంలో దేశంలోనే అగ్రస్థానాన్ని ఆక్రమించిన టీసీఎస్ మూడో త్రైమసాకంగా నికర లాభంలో 24.1 శాతం పెరిగినట్టు ప్రకటించింది. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఈ కంపెనీ త్రైమాసికంగాలో 8,105 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. రెండో త్రైమాసికంలో 6,531 కోట్ల రూపాయల లాభాన్ని ప్రకటించిన టీసీఎస్ మూడో త్రైమాసికంలో అంతకంటే మెరుగైన వృద్ధి రేటును నమోదు చేసింది. మొత్తం మీద ఈ కంపెనీ రెవెన్యూ వృద్ధి సగటున 20.8 శాతానికి చేరి, 37,338 కోట్ల రూపాయలుగా నివేదికలో కనిపిస్తున్నది. గత ఏడాది ఇదే సమయానికి టీసీఎస్ మొత్తం లాభం 30,904 కోట్ల రూపాయలు.



ఢిల్లీలోని రామలీలా మైదానంలో శుక్రవారం ప్రారంభమైన బీజేపీ రెండు రోజుల జాతీయ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, సీనియర్ నేత అద్వానీ తదితరులు

'ముందస్తు' తాయిలాలు

ఎన్నికల్లో లబ్ధిపై ప్రధాని దృష్టి ◆ చిన్న వ్యాపారులకూ జీఎస్టీ రాయితీలు

న్యూఢిల్లీ, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించిన వస్తుల సేవల పన్ను (జీఎస్టీ) నిబంధనల్లో మార్పుతో అదనంగా 20 లక్షల చిన్న వ్యాపారాలకు పన్ను మినహాయింపుదక్కనుంది. కాగా ఎన్నికల ముందస్తు తాయిలాలుగా ఆరు అదనపుప్రయోజనాలు మోదీ ప్రభుత్వం కల్పించింది. గడచిన డిసెంబర్ 28న ఉల్లి ఎగుమతుల రాయితీలను ద్విగుణీకృతం చేసిన కేంద్ర సర్కారు మొత్తం 10 శాతం రాయితీల ద్వారా రైతుల అభిమానాన్ని చూరగొనే ప్రయత్నం చేసింది. ఇలా మొత్తం ఆరు తాయిలాలతో అటు రైతులు, ఇటు వ్యాపారుల దృష్టిని ఆకట్టుకునే చర్యలు చేపట్టింది. ఇటీవలి ఎన్నికల్లో తగిలిన ఎదురు దెబ్బతోబాటు, రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం కొత్త తాయిలాలకు తెరలేపింది. ఈ కారణంగా ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా పేరున్న మనదేశ ఆర్థిక రంగానికి ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయం ఆర్థిక నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. దాదాపు దశాబ్ధ కాలానికన్నా అధిక స్థాయి ఆర్థిక లోటుకు, దేశ స్థూల వృద్ధి రేటులో 3.3 శాతం తరుగుదలకు దారితీయవచ్చని అంటున్నారు. కానీ దాదాపుగా మేలో వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం మరిన్ని హామీలను, రాయితీలకు ప్రకటించడం జరుగుతోంది. 'జనం అభివృద్ధినీ, ఆర్థిక వృద్ధినీ కోరుకుంటున్నారు' అని కేంద్ర న్యాయ, సమాచార సాంకేతిక శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

ఆర్బీఐ డివిడెండ్‌తో లోటు పూడ్చవచ్చు

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మధ్యంతర డివిడెండ్‌గా 30 నుంచి 40 వేల కోట్ల రూపాయలు వచ్చే మార్చి నాటికి ప్రకటించే అవకాశం ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ అంచనా వేసింది. ఈ మొత్తంతో ఆర్థిక లోటును భర్తీచేసే వీలుందని, అయితే ఎన్నికల తాయిలాల కారణంగా ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

కొత్త రాష్ట్ర ప్రభుత్వాలదీ అదేతీరు

ఇటీవల రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీని ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాలు సైతం జనాకర్షక పథకాలతో ఆర్థిక వ్యవస్థకు గండికొట్టే చర్యలు చేపడుతున్నాయి. ప్రధానంగా రైతు రుణాల మాఫీపై హామీలు నిలుపుకునేందుకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇక కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనాకర్షక చర్యల విషయానికి వస్తే వరుసగా కింది విధంగా ఉన్నాయి. ఈనెల 10న కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్ను విధానంలో మార్పును ప్రకటించడం ద్వారా 20 లక్షల చిన్న వ్యాపారాలకు పన్ను మినహాయింపునిచ్చింది. రూ.40 లక్షల వరకు వార్షిక అమ్మకాలతో నడిచే వ్యాపారాలకు జీఎస్టీ మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.20 లక్షల వరకే ఉంది. వచ్చే ఏప్రిల్ మాసం నుంచి సవరణ అమలులోకి వస్తుంది.

రైతులకు బాసటగా..

రైతులను ఇబ్బందుల నుంచి గటెక్కించేందుకు మూడు ఐచ్ఛికాలతో కూడిన సహాయ ప్యాకేజీని మోదీ ప్రభుత్వం రూపొందించింది. ప్రత్యేకించి సుమారు 3లక్షల కోట్ల విలువైన పంటలకు మద్దతు ధర కరవైన సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందుకు నేరుగా నగదును అందించి ఆదుకునే సాధ్యాసాధ్యాల పరిశీలన, అలాగే తక్కువ ధరకు ఉత్పత్తులను విక్రయించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడం, వ్యవసాయ రుణాలను రద్దు చేయడం వంటివి కేంద్రం చేపట్టింది. కాగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు, ఉల్లి రైతుకు ఎగుమతులపై ఇచ్చే రాయితీలను ద్విగుణీకృతం చేయడం, ఈ కామర్స్ కంపెనీలపై నిబంధనలను కఠినతరం చేయడం, 20 గృహోపకరణాలపై పన్ను రాయితీ కల్పించడం వంటి చర్యలు కేంద్రం చేపట్టిన సంగతి తెలిసిందే.

Printed and Published from Vijayawada by **K.Sudhakar** on behalf of Deccan Chronicle Holdings Limited at Deccan Chronicle Holdings Press, No.C 3 & 4, Patamata, Industrial Estate, Vijayawada. Chief Editor **T.V.Ravi Reddy**, Phones:2555284,2555185,2555287 Regd. No.AP/VJA/41/51/2000. RNI Registration No.52743/90

బరిలోకి పందెం కోళ్లు!

లాంఛనంగా ప్రారంభించిన టీడీపీ నేత

వీరవాసరం, జనవరి 11: పశ్చిమ గోదావరి జిల్లాలో సంక్రాంతి సంప్రదాయం పేరిట జరిగే కోడి పందేలు ఈ ఏడాదీ షరా మామూలే అనే సంకేతాలు శుక్రవారం వెలువడ్డాయి. అధికార తెలుగుదేశం పార్టీ నరసాపురం నియోజకవర్గ కన్వీనర్, ప్రభుత్వ పెద్దలతో సన్నిహిత సంబంధాలున్న కనుమూరి రఘురామకృష్ణంరాజు శుక్రవారం లాంఛనంగా కోడి పందేలను ప్రారంభించడమే ఇందుకు సంకేతంగా చెప్పవచ్చు. అలాగే సంకాంత్రి సంప్రదాయాల్లో కోడి పందేలు భాగమని, వాటిని ఎవరూ అడ్డుకునే ప్రయత్నం చేయరంటూ జిల్లాలోని వీరవాసరం మండలంలో జరిగిన జన్మభూమి సభ సాక్షిగా ఆయన ప్రకటించేశారు. ఏటా రఘురామకృష్ణంరాజు ఇదే తరహాలో పండుగకు కొద్ది రోజుల ముందు కోడి పందేలను ప్రారంభించడం, తదనంతరం పండుగ సీజను మూడు రోజులు భారీగా పందేల జాతర జరగడం గత కొన్ని సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. దీనితో ఈ ఏడాదీ షరామాములుగా పందేల జాతర ఖాయమనే ధీమా నిర్వాహకులు, పందేలరాయుళ్లలో వ్యక్తమవుతోంది.

వివరాల్లోకి వెళితే... ఆరో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం నందమూరిగర్వు గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన తెలుగుదేశం పార్టీ నరసాపురం లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు స్వయంగా కోడి పుంజును చేతపట్టుకుని కోడి పందెం వేశారు. ఈ సందర్భంగా తెలుగువారి సంస్కృతీ, సంప్రదాయాల్లో భాగమే కోడి పందాలని ఆయన పేర్కొన్నారు. కోడి పుంజులకు కత్తులు కట్టకుండా పందేలు నిర్వహించుకోవచ్చునన్నారు. ఇది తెలుగువారి సాంప్రదాయంలో ఒక భాగమేనన్నారు. రఘురామకృష్ణంరాజు ఈ పోటీలను ప్రారంభించటంతో అక్కడకు చేరుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. రఘురామకృష్ణంరాజు పందాలు నిర్వహిస్తున్నట్టు మండలంలోని ప్రజలకు సమాచారం అందడంతో పెద్దసంఖ్యలో అక్కడకు తరలిరావడం విశేషం. అనంతరం జరిగిన జన్మభూమి సభలో సైతం ఆయన ఇదే వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఎంతో ఉత్సాహంగా చేసుకునే పండుగల్లో ప్రభుత్వం కానీ, ఇతరుల జోక్యం కానీ ఎప్పుడూ ఉండదని, సంక్రాంతి సందర్భంగా సాంప్రదాయకంగా నిర్వహించుకునే భోగి మంటలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల నృత్యాలు, కోడి పందాలు తదితర వాటితో ప్రజలంతా సంతోషంగా ఉంటారని రఘురామకృష్ణంరాజు పేర్కొన్నారు.

అయితే గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు, తహసీల్దార్లు సంక్రాంతి పేరిట నిర్వహించే కోడిపందేలు, జూదాలు జరగనివ్వబోమని ప్రకటనలు చేస్తున్నారు. ఫ్లెక్సీలతో ప్రచారం చేస్తున్నారు. పందేల నిర్వహణకు ఏర్పాటుచేస్తున్న బరులను ధ్వంసం చేయిస్తున్నారు. దీనితో పందేల నిర్వహణపై ఇప్పటివరకు కొంతమేర సందేహాలున్నా, శుక్రవారం నాటి లాంఛనంతో అందరిలో ఆ భ్రమలు తొలగిపోయాయి. ఆ మూడు రోజులు వచ్చే మౌఖిక ఆదేశాలతో అధికారులంతా మౌనం పాటిస్తారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.




ప.గో. జిల్లాలో కోడిపుంజు చేతపట్టుకుని పందెం వేస్తున్న టీడీపీ నేత రఘురామకృష్ణంరాజు (కుడి వైపు వ్యక్తి)

మాతృభూమి

పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే

ఆంధ్రభూమి

శనివారం, 12 జనవరి 2019





అతివకు అవకాశం.. జాతి వికాసం

అధిక సంఖ్యాకులైన బడుగు, బలహీన జనులను దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేయడమే ఈ దేశ పతనానికి ముఖ్య కారణం. అత్యంత నిరుపేదలుగా మిగిలిపోయిన ఈ దేశ శ్రమజీవుల హృదయాల నుంచి స్రవించే రక్తంతో పెరిగి, విద్యాబుద్ధులు గడించి, తదనంతరం వారి బాగోగులను పట్టించుకోని ప్రతి ఒక్కరూ దేశద్రోహులే అని తొట్టతొలిగా సామాజిక పరివర్తనకు నాంది పలికిన హిందూ ధార్మిక నాయకుడు స్వామి వివేకానంద.

దేశంలోని కోట్లాది అన్నార్తుల కనీస అవసరాలు తీర్చడమే ప్రథమ కర్తవ్యం కావాలని గుర్తుచేసిన సాహసి, మానవతామూర్తి స్వామి వివేకానందుడు. దానికి సరైన మార్గం శిక్షణతో కూడిన విద్య ప్రధానమైనదని స్త్రీలు కూడా విద్యాబుద్ధులు నేర్చి, సమాజంలో నేర్చి, సమాజంలో సమానావకాశాలను పొందినప్పుడే జాతి సంపూర్ణంగా వికసిస్తుందని ఆకాంక్షించిన క్రాంతదర్శి. 'లెండి మేల్కొనండి! గమ్యం చేరేవరకూ విశ్రమించకండి. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్రతుల్యమైన మనసుతో లక్ష్యాన్ని చేధించండి' అంటూ యువతకు ఉద్బోధించి 'నాయకుడివి కాదలచుకుంటే ముందు సేవకుడిగా మారు' అని సగర్వంగా ప్రకటించిన ధీరోదాత్తుడు స్వామి వివేకానందుడు.

1863 జనవరి 12న కలకత్తాలో భువనేశ్వరీదేవి, విశ్వనాథ దత్తులకు జన్మించాడు. తల్లిదండ్రులు పెట్టిన పేరు నరేంద్రనాథ దత్తు. అందరూ నరేన్ అని పిలిచేవారు. నరేన్ బాల్యంనుంచే ఆటపాటలు, అల్లరితోపాటు ధ్యానంలో మునిగిపోతుండేవాడు. తల్లి భువనేశ్వరి ద్వారా రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలను ఔపాసన పట్టారు. చిన్నవయసులోనే వివిధ మతాల సిద్ధాంతాల పట్ల ఆకర్షితుడై కొంతకాలం బ్రహ్మసమాజం ప్రభావంతో గడిపాడు. సంస్కృతం, బెంగాలీ, ఆంగ్ల భాషలు నేర్చుకోవడంతోపాటు ఈత, కర్రసాము, కుస్తీలు, మల్లయుద్ధం, వ్యాయామం వంటి ఇతర వ్యాపకాలలోనూ నిష్ణాతుడయ్యాడు. చిన్న వయసులోనే వాక్చాతుర్యంలో దిట్టగా నిలిచాడు.

భగవాన్ రామకృష్ణ పరమహంస సన్నిధిలో తన ప్రశ్నలకు సమాధానం లభించడంతో, ఆంతరంగిక సంఘర్షణ తొలగి ప్రశాంతత చేకూరి శిష్యునిగా మారిపోయాడు. శ్రీరామకృష్ణుని శిక్షణలో నరేంద్రుడు నిర్వికల్ప సమాధి స్థితితో సహా అనేకమైన మహోన్నత ఆధ్యాత్మిక అనుభూతులను పొందాడు.

గురుదేవులు రామకృష్ణ పరమహంస మరణానంతరం సన్యాసం స్వీకరించిన నరేంద్రుడు వివేకానందుడైనాడు. గతంలో శ్రీరామకృష్ణులువారు చెప్పిన అమృతవాక్కులు జీవారాధనయే శివారాధనని మార్గదర్శకంగా తీసికొని, భారతదేశ స్థితిగతులను ఆకళింపు చేసుకోవడానికి హిమాలయాలనుంచి కన్యాకుమారి వరకూ పర్యటించారు. కన్యాకుమారి సముద్రగర్భంలోగల శ్రీపాద శిలపై ఆశీనులై మూడురోజులపాటు ఎడతెగని ధ్యానంలో లీనమయ్యారు. అక్కడే ఆయన భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకున్నారు. రామకృష్ణ పరమహంస శిష్యునిగా గడించిన సేవానుభూతులే రామకృష్ణమిషన్ సేవాకేంద్రాన్ని స్థాపించడానికి పునాదిగా మారాయి.

నవభారత నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలు వివేకానందుడి మనసులో మెదులుతున్న సమయంలోనే 1893న చికాగోలో జరుగుతున్న విశ్వమత మహాసభలు జరగనున్నాయన్న వార్త వివేకానందుడిని ఉత్తేజితుణ్ణి చేసింది. మిత్రులు, సన్నిహితుల ప్రోత్సాహంతో భారతీయతలో దాగిన విశిష్టతను, సనాతన హిందూధర్మ మూలసూత్రాలను ప్రపంచానికి చాటడానికి చికాగో 'సర్వమత సమ్మేళనాన్ని' చక్కని వేదికగా భావించిన వివేకానందుడు అమెరికాకు ప్రయాణమయ్యారు.



1893 సెప్టెంబర్ 11న చికాగో నగరంలో జరిగిన విశ్వమత మహాసభలో పాల్గొని, అమెరికా సోదరసోదరీమణులారా! అని సంబోధిస్తూ వివేకానందుడు సాగించిన మహోపన్యాసం వివిధ దేశాలనుంచి వచ్చిన శ్రోతలను సమ్మోహనంతో పరవశులనుగావించింది. ఆ మహాసభలలో వివేకానందుడు విశ్వగురువుగా, 'ఈశ్వర ప్రేరేపిత మహావక్త'గా కీర్తిపొంది, విశ్వవిఖ్యాతి నొందారు. అప్పటివరకు హిందూ మతంపై పాశ్చాత్యులలో పేరుకుపోయిన అపోహలు పటాపంచలు కావడం ప్రారంభమైందనుటలో అతిశయోక్తి కాదు.

యుగద్రష్ట వివేకానందుని 155వ జయంతి సందర్భంగా

ఇంగ్లండు, స్విట్జర్లాండు మొదలైన పాశ్చాత్య దేశాలతో పాటు శ్రీలంక వంటి దేశాల్లోనూ పర్యటించి, అన్ని మతాలకూ మూలమైన వేదాంతాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. మూడు సంవత్సరాలు పర్యటించిన అనంతరం 1897లో భారతదేశానికి తిరిగి వచ్చారు. తదనంతర కాలంలో దేశ వ్యాప్తంగా తన ప్రసంగాలతో మూఢాచారాలను, జాతి బలహీనతలను, పాశ్చాత్య వ్యామోహాన్ని, కుల దురభిమానాలను బలంగా విమర్శించారు. భారత జాతికి పునాది మతమే అయినప్పటికీ, దాని సారాంశం ఆధ్యాత్మిక ఏకత్వమని ప్రబోధించారు. ఆ లక్ష్యసాధనకే రామకృష్ణ సేవాసంఘాన్ని స్థాపించారు. 1898లో కలకత్తాలోని బేలూరులో రామకృష్ణమఠం నిర్మాణానికి పూనుకున్నారు. రామకృష్ణ మిషన్‌లు నాటినుంచి నేటివరకూ వివిధ ఆధ్యాత్మిక, విద్యా, సేవా కార్యక్రమాలను నలుమూలలా విజయవంతంగా నిర్వహిస్తుండటం గమనార్హం.

ఇంగ్లాండులో స్వామి వివేకానందుని బోధనలకు ముగ్ధురాలైన మార్గరెట్ శిష్యురాలిగా భారతదేశానికి వచ్చి 'సిస్టర్ నివేదిత'గా మారింది. రామకృష్ణ పరమహంస పేర ప్రారంభించిన మఠాలు, మిషన్ కార్యకలాపాలు, పర్యవేక్షణలు, శిక్షణలతో నిరంతరం శ్రమలో లీనంకావడంతో వివేకానందుడి ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. 1902 జూలై 3న బేలూరులో వివేకానందుడు పరమపదించారు.

అభాగ్యులు, అన్నార్తుల కష్టాలను రూపుమాపి సుసంపన్నమైన, సుదృఢమైన భారత జాతి నిర్మాణానికి యువత పట్టువీడని దీక్షతో కొనసాగించాలన్న వివేకానందుని సందేశం నేటి విద్యార్థులు, యువతకు, యువతరం నేతలకు స్ఫూర్తి కావాలి. 'పేదలకోసం ఎవరి హృదయం తపిస్తుందో, వారినే నేను మహాత్ములు'గా భావిస్తాను అన్న వివేకుని లోకోక్తిగా సదా నిలిచిపోవాలి. వారు ప్రాతఃస్మరణీయులు.

- వేదుల జనార్దనరావు
95024 69464

విశిష్టతల కలబోత భారతనారి

★ మహిళల స్థితిగతులు మెరుగుపరచకపోతే ప్రపంచ సంక్షేమానికి ఆస్కారం ఉండదు. ఒంటి రెక్కమీద ఎగరడం పక్షికి అసాధ్యం కదా!

★ హైందవ స్త్రీలు ఎంతో ధర్మపరాయణులు; బహుశా ప్రపంచంలోని ఏ ఇతర స్త్రీలకంటే కూడా వారు అధిక ధర్మపరాయణులై విరాజిల్లుతున్నారు. పరిపూర్ణ స్త్రీత్వ భావమే పరిపూర్ణ స్వాతంత్ర్యం.



★ తండ్రి అనుగ్రహం కంటే తల్లి అనుగ్రహం లక్ష రెట్లు విలువైనదని నా అభిప్రాయం, తల్లి ఆశీస్సులే నాకు శిరోధార్యం.

★ మంచికి గాని, పవిత్రతకు గాని, పాతివ్రత్యానికి గాని, భారతీయ మహిళా ధర్మానికి సీత పెట్టింది పేరు. సీత అపకారానికి, ప్రత్యపకారానికి ఎన్నటికీ తలపడదు. సీతలా ఉండడానికి ప్రయత్నించండి.

★ ఓ భారతదేశమా! నీ సతీత్వ ఆదర్శం సీత, సావిత్రి, దమయంతి అని మరువద్దు.

★ మన మహిళలకు విద్య తక్కువేగాని, పవిత్రత ఎక్కువ. తన భర్తను తప్ప, తక్కిన పురుషులనందరినీ ప్రతి మహిళా తన కొడుకులుగా భావిస్తుంది. తన భార్యను తప్ప తక్కిన మహిళలనందరినీ పురుషుడు తన తల్లులుగా భావిస్తాడు.

★ పురుషులకు కేంద్రాలను నెలకొల్పినట్లే, స్త్రీలకు కూడా బోధనా కేంద్రాలు ప్రారంభించాలి. స్త్రీ జనోద్ధరణ, జనబాహుళ్య జాగృతం ముందుగా జరగాలి. అది జరిగిన తరువాత మాత్రమే భారతదేశానికి నిజమైన శ్రేయస్సు ఒనగూరుతుంది.

★ స్త్రీలను, తమ సమస్యలను తమ మార్గాలతోనే పరిష్కరించుకొనే స్థితికి తీసుకుపోవాలి. వారి తరఫున దీనిని ఎవరూ చేయగూడదు. భారతీయ మహిళ తన సమస్యలను పరిష్కరించడంలో ఏ స్త్రీలకూ తీసిపోదు.

★ ఇతర విషయాలతోపాటు మన మహిళల ధైర్యసాహసాలు సంతరించుకోవాలి. నేటి కాలంలో ఆత్మరక్షణ నేర్పడం వారికి ఎంతో ఆవశ్యకమైపోయింది. ఝాన్సీరాణి ఎటువంటి పరాక్రమవంతురాలో చూడండి.

★ స్త్రీలు అత్యున్నత సత్యాలను బోధించేవారనీ, పురుషులకు సాటిగా ఆదరణ పొందారనీ, వేదాలూ ఉపనిషత్తులూ చాటిచెబుతున్నాయి.

★ స్త్రీలకు మొదట విద్యను గరపండి. తరువాత వారికి స్వేచ్ఛను ఒసగండి. అప్పుడు తమకు ఏ సంస్కారాలు ఆవశ్యకాలో వారే మీకు తెలుపుతారు. వారి విషయాలకు మీరెవరు?

★ మాతృదేవి (శారదామాత) భారతదేశంలో ఒక అద్భుతశక్తిని పునరుద్ధరించడానికి జన్మించింది. ఆమెను మూలకేంద్రంగా చేసుకునే మళ్ళీ గార్గులు, మైత్రేయిలు ఈ ప్రపంచంలో జనిస్తారు. ఆ మహిళా శక్తి అనుగ్రహం లేకుండా ఏవీ సాధింపబడవు.

యువతా! ఓ నవతా!

యువతా! ఓ నవతా!
నవభారత ఘనభవితా!
స్వామివివేకానందుడా..
వ్రాస్తున్నా ఈ లేఖను..

కాలమందు మరో ఏడు
కరిగిపోయెనది చూడు
అయినవిగా విలాసాలు
ఆపుమింక కులాసాలు

ప్రభాతాన ప్రతిరోజూ
వ్యాయామం నీ సాధన
ఫుట్‌బాల్ మైదానమిచ్చు
పూర్ణశక్తి ప్రదర్శన!

ఇనుప కండలున్నవాడు
ఉక్కు నరాలున్నవాడు
జాతి సమస్యలు చీల్చే
జగజ్జెట్టి అర్జునుడు!

నిదుర వదిలి లే నిలబడు!
బెదురు విడిచి నువ్వు బలపడు!
భవిష్యత్తు నీకోసం
చూస్తున్నది నీ దేశం!

ధైర్యమాత్మ విశ్వాసం
భీమబలం దేశభక్తి
శ్రమజీవన సౌందర్యం
క్రమశిక్షణ సహజగుణం

ఆరు లక్షణాలుంటే
ఆయుధాలు మనకేల
అవనీతల జాతులన్నీ
తలదించవ- మనమ్రోల!

బలమే జాతికి జీవం
బలమే నీతికి ప్రాణం
బలవంతుడు కాని నరుడు
శిలరూపున మృగరాజం!

అన్యాయం గుండెల్లో
అదురుపాటు నీ ధైర్యం
అవినీతిని చీల్చిచెండు
రవికిరణం నీ తెగింపు

కృషితోనే దుర్భిక్షం
కృశిస్తుంది నశిస్తుంది
కష్టేఫలి సూక్తి మీకు
ఇష్టచెలిగ మారుతుంది

ప్రాణమున్న వరకు మీరు
శ్రమించాలి తపించాలి
దేశధర్మ రక్షణకై
దేహముందని గ్రహించాలి!

జీవితాన్ని తెరచి తరచి
భావి తరం కొరకు పరచి
నే చెప్పిన ఈ మాటలు
మీ ప్రగతికి సుమబాటలు

- కడియాల మధుసూదనరావు
90309 07191

ముంగిళ్లలో ముగ్గులు

శుచిత్వం, ఆచారం, అలంకార ప్రియత్వం, కళా ప్రదర్శనం, ఆరాధనా విధానానికి సంకేతాలు రంగవల్లులు. శుభ్రంగా ఊడ్చి, కళ్ళాపు చల్లి, ముంగులతో అలంకృతాలయ్యే తెలుగునాట ముంగిళ్ళు తరతరాల వారసత్వ సంస్కృతులకు ప్రతిబింబాలు. తెలుగు సీమల్లో ప్రతి ఇంటి లోగిళ్లలో ముగ్గులు వేయడం అనాదిగా వస్తున్న సాంప్రదాయాలు. అయితే ధనుర్మాస యుక్త సంక్రాంతి సంబంధిత పర్వదినాలలో వేసే ముగ్గులు పలువిధ ప్రత్యేకాలు. చుక్కలు పెట్టి, హద్దులు ఏర్పరచి, గీతలను సున్నితంగా కలపడంలో, మెలికలు తిప్పడంలో కళానైపుణ్యాలు ప్రదర్శితాలవుతాయి. సర్వ సంపదలకూ అధిష్ఠాన దేవతయైన అష్టలక్ష్మికి ఇంటి తల వాకిట పీఠం వేయబడుతుంది. కనుమనాడు వాకిళ్ళను మూసేసే ముగ్గు కూడా వేసి, లక్ష్మీదేవిని బయటకు వెళ్ళనీయకుండా వాకిళ్ళను మూసివేసే ముగ్గులు పెడతారు. నెమళ్ళు, హంసలు, రామచిలుకలు, గరుత్మంతులు, మత్స్య కూర్మాది అవతారాలు అందానికి ప్రయోజకత్వానికి, మెలికలు తిప్పడంలో కళాభిజ్ఞతను తెలియ జేస్తాయి. స్వర్గ ద్వారాలు తెరిచి ఉంచే ముగ్గు, గుమ్మడి పండు ముగ్గు, సూర్య రథాల ముగ్గు, చుక్కల రథాల ముగ్గు ఉత్తరాయణంలో ప్రత్యక్ష దైవమైన సూర్య గమనాన్ని సూచించే ముగ్గులు. ముగ్గులలో గణిత శాస్త్ర సంబంధిత కోణాలు, త్రిభుజాలు, చతుర్భుజాలు, త్రికోణాలు, దీర్ఘ చతురస్రాలు, అష్ట కోణాలు, సమాంతర రేఖలు చోటు చేసుకుంటాయి. రాళ్లు రప్పలూ లేకుండా ముంగిట అలంక బడిన నేల...మేఘాలు లేని గగనతలం. అందలి చుక్కలు రాత్రి వేళల కానవచ్చే నక్షత్రాలు. చుక్కల చుట్టూ తిరుగుతూ గళ్ళల్లో చుక్కలను పదిలపరిచే ముగ్గులు ఆకాశంలో కనిపించే మార్పులకు సంకేతాలు. ముగ్గు మధ్యలో చుక్క అనాదిగా సూర్య కేంద్రక సిద్ధాంతానికి ఆధార భూతమైన సూర్య స్థానానికి సంకేతం. గీతలు స్థిత శక్తికి, చుక్కలు గతి శక్తికి సంకేతాలని, ముగ్గులు శ్రీచక్ర సమర్పణా సంకేతాలని తత్వవేత్తల భావన. విల్లు ధనుర్రాశికి, ప్రతీక అయినట్లు మేక, ఎద్దు, సింహం, పీత, చేప లాంటివి నవగ్రహాలకు గుర్తులుగా ముగ్గులు వేస్తారు. భూమికి ఉన్న దక్షిణ దిక్కులో దక్షిణ ధృవం ఉంటుంది. దానినుండి వచ్చే అయస్కాంత శక్తులనే పిశాచాలు, రాక్షసులు అని ప్రాచీనులు చెప్పేవారు. పాములు కూడా దక్షిణ దిశనే ఎక్కువగా సంచరిస్తుంటాయి. అవి ఇళ్ళల్లోకి ప్రవేశించనీయ కుండా వాకిలి ముందు ముగ్గులు వేయడం, అవి బియ్యపు పిండితో వేయడం అత్యంత ప్రాచీన కాలం నుండి ఉంది. ఇంటి ముందున్న పిండి తిని సూక్ష్మజీవులు ఇళ్ళల్లోకి రాకూడదనే భావన ఇందు ఇమిడి ఉంది. మూడు రోజులు బంధుగణ సమేతులై ఆనందోత్సాహాలను పంచుకున్న అనంతరం పండగను సాగనంపేందుకే రథం ముగ్గు వేస్తారు. అందరూ ఒకరికొకరు తోడుగా, కలసి మెలసి సహజీవనం గడపాలనేదే ఒక రథం తాడును, పక్క ఇంటి రథం ముగ్గుతో కలిపే రథం ముగ్గు వెనక ఉండే భావం.



- సంగనభట్ల రామకిష్టయ్య



24 చుక్కలు
8 వరుసలు
8 వచ్చే వరకు
సరి చుక్కలు



వాణీ ప్రభాకరి,
తణుకు





కె.అమ్మాజీ
విజయవాడ

23 మధ్యచుక్కలు
12 వచ్చేవరకు

కర్మభూమి

రచనే, చిత్రమే నాట్యమో
రుచి పెంచెడి కర్మమొకటి ఋతమై నిలుచున్
శుచియౌ ప్రేరణ నొసగుచు
కామ్యమ్మొసగుచు మనుజుల కాంక్షలు తీర్చున్

ఆంధ్రభూమి శనివారం, 12 జనవరి 2019

శ్రీనరసింహ శతకము

సీ. ఉర్విలో వాయు ష్యమున్న పర్యంతంబు
మాయ సంసారంబు మఱఁగి నరుఁడు
సకల పాపములైతె సంగ్రహించు ను గాని
నిన్నుఁ జేరెడి యుక్తి నేర్వలేఁడు
తుదకుఁ గాలుని యొద్ద దూతలిద్దఱు వచ్చి
గుంజుక చనినారు కొట్టుచుండ
హింస కోర్వఁగ లేక యేడ్చి గంతులు నైచి
దిక్కు లేదని నాల్గు దిశలు చూడ

తే॥ తన్ను విడిపింప వచ్చెడి ధన్యుఁడేడి
ముందె నీ దాసుఁ డై యున్న - ముక్తి గలుగు
భూషణ వికాస ! శ్రీధర్మ పుర నివాస!
దుష్టసంహార! నరసింహా! దురితదూర!

భావం: ఓ స్వామీ! మానవుడు ఈ ప్రపంచంలో బతికినంతకాలం సంసార మాయకు లోబడి సమస్త పాపాల్ని ప్రోగు చేసుకొంటాడే కానీ నిన్ను పొందే ఉపాయాన్ని కనుగొనలేడు. చిట్టచివర యమభటులిర్వురు వచ్చి ప్రాణాల్ని గుంజుతూ ఉంటే ఆ బాధకు తట్టుకోలేక కాపాడమని చూస్తాడు. విడిపించే పుణ్యాత్ముడెవడూ కన్పించడు. అందువల్ల ముంద నీ భక్తుడై ఉంటే మేలు కదా. మోక్షం సిద్ధిస్తుంది.



అనంతం

34 -గోపరాజు నాగేశ్వరరావు

అందుకే నేను టోపీ తీసేసి, చొక్కా విప్పి ప్రక్కనపెట్టి, పూనకం వచ్చినట్టు చిందులేస్తూ, వేప మండలతో సీతాల్ని చావగొడుతూ–

'నన్నే గురుతుపట్టలేదంటనే పోలేరా! రాజుని. పోతురాజుని! నీ పెనివిట్ని! గాచారవ్ గాలి నీకాడికి సందాకొచ్చిందుగానీ, కానిస్టేబుళ్ళు తల్సుకుంటే కొమ్ముల్దిరిగినోళ్ళే ఇత్తారు సందాలు! ఇడ్సిపెట్టు. ఆడ్నిస్సిపెట్టు' అంటూ నేను వేపమండలతో సీతాల్ని ఇంకా బలంగా బాదాను.

పోలేరమ్మా లేదు పూనకం లేదు!

కానిస్టేబుల్ని విడిచిపెట్టి పరారరయ్యింది సీతాలు'' అని, సీతాలు కథ చెప్పటం ముగించాడు మఫ్టీ కనకయ్య.

పగలబడి నవ్వారు!

''బాగానే పనికొస్తావు. అలాగే అభినయించి ఎలాగో, యీ పని గట్టెక్కించు.. ప్రమోషన్ విషయం వొదిలెయ్యి నాకు'' అన్నాడు ఎమ్మెల్యే.

గురుడాచలానికి నమ్మకం పూర్తిగా కుదిరింది!

పూనకం వచ్చినట్టు నటించడంలో కానిస్టేబుల్ కనకయ్య పరమ భక్తులక్కూడా తీసిపోడు!

కొండదేవర పూనాడని అతను అభినయిస్తే, నిస్సందేహంగా అడవి పుత్రులు నమ్ముతారు. భయపడతారు. దేవరలా నటిస్తూ కనకయ్య ఏం చెప్పినా మూఢ విశ్వాసాలతో చేస్తారు.

చదువూ సంధ్య, నాగరికత వున్నవాళ్లే పూనకాలను నమ్మి భక్తి ప్రపత్తులు ప్రకటిస్తున్నపుడు అమాయకులైన అడవి పుత్రులు పూనకాలను నమ్మటంలో ఆశ్చర్యం ఏముంది?

''పథకం పర్‌ఫెక్టుగా వుంది'' అన్నాడు గరుడాచలం.

''ఇక నీదే ఆలస్యం'' అన్నాడు ఎమ్మెల్యే.

అభినయించటం ఆపి కానిస్టేబుల్ కనకయ్య ఎమ్మెల్యే వైపు చూశారు.

''సామానంతా ఒకసారి చెక్ చేసుకో'' అన్నాడు ఎమ్మెల్యే.

కనకయ్య గోతాల దగ్గరికి వెళ్ళాడు. ఒక్కో గోతాన్ని తెరుస్తూ సామాన్లు క్రింద పెడుతున్నాడు!

పెయింట్ డబ్బాలు, బ్రష్‌లూ, కొన్ని పక్షుల్నిపట్టే వలలూ కనిపించాయి గరుడాచలానికి!

ఎమ్మెల్యేని మనసులోనే అభినందించాడు గరుడాచలం!

పగలు వేగంగా గడిచిపోయింది.

రాత్రయ్యింది.

అధికారులకూ, సిబ్బందికీ ఆ రాత్రంతా నిద్రలేదు.

ఎమ్మెల్యే వ్యూహాన్ని అమలు చేసే సన్నాహాల్లో వున్నారు!

రాగ్యాతో రహస్యంగా ఏదో మాట్లాడుతున్నాడు గరుడాచలం.



అంతా హడావుడిగా వుంది.

తెల్లవారితే కొండదేవర జాతర!

:::::

రాత్రికి రాత్రే దూరంనుంచి వచ్చిన వ్యాపారుల దండునల్లకొండ దగ్గర కుదురుకుంది. టెంట్లు వేశారు. తోరణాలు కట్టారు. ఫ్లెక్సీలు అలంకరించారు.

ఫలహాలశాలలూ, టీస్టాళ్ళూ, చెరకు దుకాణాలూ, ప్లాస్టిక్ సామాన్ల కొట్లు, చాలా రకాల వస్తువులమ్మే దుకాణాలు వెలిశాయక్కడ.

పేద వ్యాపారులు కొద్ది పెట్టుబడితో దువ్వెన్లు, గాజులు, పూసలూ తెచ్చిరోడ్ల పక్కన చాపల మీద పరచి వ్యాపారం కోసం ఎదురు చూస్తున్నారు.

శ్రమకోర్చి, ఎవ్వరో రంగులరాట్నం తెచ్చారు.

పిల్లల్ని వూరించే బయస్కోప్ వుంది.

ఆధునిక టెక్నాలతో బూతు సినిమాలు చూపించే హైటెక్ వ్యాపారి ఒకడు అమాయకులను ముగ్గులోకి దించేందుకు కాపు కాచి కూర్చున్నాడు.

ఎక్సయిజ్‌వాళ్ళతో మామూళ్ళు మాట్లాడుకొన్న మద్యం వ్యాపారి చీపు లిక్కరు సీసాలు దించి, రాబోయే లాభాలను ఊహించుకొని మురిసిపోతున్నాడు.

అడవిలో దొరకని చాలావస్తువులు అక్కడికే వొచ్చాయి.

ఏ వస్తువైనా అసలు ధరకు ఆరు రెట్లు!

సంత బేరం అంతే మరి!

అధిక ధరలకు అమ్ముతున్నారని అసూయపడితే ఎలా?

'ప్రభుత్వమే ప్రజల వద్దకు' అన్నట్టు 'సరుకు అడవి పుత్రుల వద్దకు' వస్తుంటే, ఆనందించాల్సింది పోయి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటే ఎలా?

వ్యాపారులు కూడా శ్రమ చెయ్యాలి.

పట్నాలనుంచి సరుకు తెచ్చి అడవిలో అమ్మటం మాటలా?

ఎంత కష్టం! ఎంత శ్రమ!

అడవి జనానికి సరుకుల అందుబాట్లోకి తెచ్చి 'సేవ' చెయ్యబోతే దార్లో పాములు కరవొచ్చు. తేళ్లు కుట్టొచ్చు. పులులు, సింహాలూ నమిలి మింగొచ్చు. సరదా పడ్డ కూంబింగ్ పార్టీ తుపాకుల్తో కాల్చి చంపొచ్చు. వర్గ శత్రువులనుకొని అన్నలు మందుపాతరలు పెట్టొచ్చు.. అలా–

ప్రమాదాల్ని సైతం లెక్కచెయ్యకుండా ప్రజల ముంగిట సరుకులమ్మటం, శ్రమని లెక్క కట్టి, అసలు ధరకు జోడించి అధిక లాభాలకు అమ్మటం ఎందుకు తప్పు?

సరుకు ధర వ్యాపారులే నిర్ణయించటంలో ఏమిటి తప్పు?

ఫ్రెంచివాళ్ళు, డచ్చివాళ్ల, యీస్టిండియా కంపెనీ వాళ్ళూ అన్నట్టు, రాజకీయాధికారంకూడా కావాలంటే కదా తప్పు?

ఆనాడు విదేశీయులకిచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలీనాడు స్వదేశీ వ్యాపారులకు ఇవ్వకపోతే ఎలా?

ఎక్సయిజ్ వాళ్ళూ, పోలీసు వాళ్ళూ కొంతలో కొంత నయం!

వ్యాపారుల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను గుర్తించారు!

అక్రమ మద్యం అమ్మకాల్ని అనుమతించారు!

బూతు సినిమాలు వెయ్యనిస్తున్నారు!

గుట్కాలు అమ్మనిస్తున్నారు.

(ఇంకా ఉంది)



రాశిఫలం

- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)** చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి. ప్రయత్న కార్యాలు ఫలిస్తాయి. కొన్ని పనులు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. ప్రయాణాలుంటాయి.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)** సంపూర్ణ ఆరోగ్యంగా వుంటారు. కుటుంబంలో సుఖ సంతోషాలు అనుభవిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. విజయం సాధిస్తారు. శుభవార్తలు వింటారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)** విదేశయాన ప్రయత్నం సులభంగా నెరవేరుతుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త వహించుట మంచిది. నూతన కార్యాలు వాయిదా వేసుకుంటారు. ప్రయాణాలు ఎక్కువ చేస్తారు.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్లేష)** విదేశయాన ప్రయత్నం సులభమవుతుంది. కుటుంబ కలహాలకు తావీయరాదు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. పిల్లలతో జాగ్రత్త వహించుట మంచిది. వృత్తి, ఉద్యోగ రంగంలోనివారికి ఆటంకాలెదురగును. ఆరోగ్యం గూర్చి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)** గొప్పవారి పరిచయం ఏర్పడుతుంది. స్త్రీల మూలకంగా లాభం వుంటుంది. మంచి ఆలోచనలను కలిగివుంటారు. బంధు, మిత్రులు గౌరవిస్తారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా పొందుతారు. సత్కార్యాల్లో పాల్గొంటారు. గృహ అవసరాలకు ప్రాధాన్యమిస్తారు.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)** కుటుంబంలో చిన్న చిన్న గొడవలు వచ్చే అవకాశం వుంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించుటకు ఋణప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు ఆలస్యంగా లభిస్తాయి.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)** ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబ సౌఖ్యముంటుంది. మానసికానందాన్ని అనుభవిస్తారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది. శుభవార్తలు వింటారు. శుభ కార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)** నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. ఋణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశముంటుంది.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)** మనస్సు చంచలంగా ఉంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్త పడుట మంచిది. అనారోగ్య బాధలనుభవిస్తారు. చెడు సహవాసానికి దూరంగా నుండుటకు ప్రయత్నించాలి.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)** ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)** వ్యవసాయ రంగంలోనివారికి లాభదాయకంగా వుంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి. శారీరకంగా బలహీనమేర్పడుతుంది.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)** ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. మీరు చేసే ప్రతి పనిలో వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం. నూతన కార్యాలు ప్రారంభించకుండా ఉంటే మంచిది. ధైర్యసాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

మాటాట

నిర్వహణ: సుధామ **1844**

1		2	■	3		■
■	■	4	5		■	6
7	■	■		■	■	
8			■	9		
	■	■	10	■	■	
	■	11		12	■	■
13			■	14		

అడ్డం — **ఆధారాలు** — **నిలువు**

అడ్డం:
1. అమెరికాలో స్వామి వివేకానంద ఉపన్యసించిన చోటు
3. జుగుప్స వంటిదే
4. రీతి తోడిది
8. నాగలి
9. .. లోయలో కూలిన శిఖరం బుచ్చిబాబు కథ
11. చుట్టల చుట్టల తీపిపదార్థం
13. ఇదోరకం దుంప ముల్లు కాదు
14. చేతిబట్ట

నిలువు:
1. సమాధి
3. దినము,
5. మాట, పలుకు
6. యవ్వనంలోని అబ్బాయిలు
7. పిల్లి , మంచము, నల్లని తొండ
10. మెకాలే లో చెయియ కాదు పాదమే
11. కాంతి
12. ఓ మత్తు ద్రావకం

మాటాట-1843 సమాధానాలు

అడ్డం		నిలువు	
2. మహానటి	10. వీలు	1. జగతి	9. పొలతు
3. గజము	11. చీల	3. హాయి	10. వీర్యము
7. దడ	12. గురుతు	4. టిట్టిభ	11. చీరు
8. పాము	13. మున్నుడి	6. ముదము	12. గుడి
9. పొత్తము	14. కసవు	8. పాలు	

యువత ప్రభావితం..

శ్రీ వివేకానందుని ప్రబోధం!

శ్రీ వివేకానంద స్వామీ జయంతి నుద్దేశించి జరుపుకుంటున్న ఉత్సవంలో నేడు ముఖ్యంగా నేటి యువతకు ఆయన ప్రబోధాలు ఎంతవరకు ఉపయుక్తమో తెలుపడానికి ఈ వ్యాసం! ఆయన పుట్టుపూర్వోత్తరాలు, ఆయన పర్యటనలు, ఆయన ప్రపంచ మహాసభ వివరాలు- నేను వ్రాయడం లేదు. హరినాథ్ నాకు ఓ పూర్వ విద్యార్థి. 'ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం' అందుకుంటున్న సందర్భంలో 'ది కంప్లీట్ వర్క్స్ ఆఫ్ స్వామి వివేకానంద' వేదిక మీద నాకు బహూకరిచాడు. అన్నింటిని సమగ్రంగా చదవలేదు. ఎలాగైనా వాటిని కొంతైనా చదవాలని చదవగలిగాను.

అగమ్యగోచరంగా అల్లకల్లోలంగా వుంటున్న నేటి సమాజ వ్యవస్థను చూస్తున్న రేపటి పౌరులైన నేటి విద్యార్థులలో జీవన విలువల్ని, నైతిక జీవనవిధానం, సరియైన ఆలోచనలు, అవగాహనలను ఈ ఉద్బోధలు సముద్రానికి నీటి బొట్టు లోపం కాకుండా వారిలో నిర్మలత, నిస్వార్థత పెంపొందించగలవని ఆశ! యువత, యువకులు.. అనడంలో శ్రీ వివేకానందుడు యువకుడు. యువకులు ఆయనకు ప్రీతిపాత్రులు, భరతమాత ముద్దుబిడ్డలు, అందరూ బిడ్డలే కాని యువతను ఆయన సింహాలన్నారు.

''భారతమాత వేలకొద్దీ యువకుల త్యాగాన్ని ఎదురుచూస్తోంది, కావలసింది అలాంటి యువకుల మనోబలం, పశుబలం కాదు, కావలసింది శాంతమూ, నిరాడంబరమూ, అచంచలమైన కృషి- అంతేకానీ పేరు ప్రతిష్ఠలకై ఉబలాటం కాదు. ఈ సంగతి యువత జ్ఞప్తిలో ఉంచుకోండి'' అన్నారు స్వామి. ''యువకులారా! దరిద్రులను, దీనులను, అజ్ఞానులను లేవనెత్తే ఈ సానుభూతిని, ఈ కార్యదీక్షను, ఈ పోరాటాన్ని స్థిరాస్తిగా నేను మీకు ఒసగుతున్నాను. భగవంతుడే మన నాయకుడు. ముందుకు సాగిపోండి'' అని ఉత్తేజపరిచారు ఆనాడు వివేకానందులు! ఎందుకంటే ఆయన దృష్టి అంతా యువకుల మీదే లగ్నమై ఉండేది.



శ్రద్ధ, సహనం, చిత్తశుద్ధి యువతలో మూర్తీభవించి ఉంటుందన్నాడాయన. దానికి తోడు ఉడుకురక్తం వారిది. అలాంటి యువతను కొందరు స్వార్థపరులు తమ ప్రయోజనాలకై వారిలో అవిద్య, నిరాశ, నిస్పృహ, నిరుద్యోగం వంటి లోపాలను తమకుపయుక్తంగా వారిని అసాంఘికంగా సమ్మెలు, ఆర్సన్సు, హత్యలు, హర్తాళ్ళు వంటి సంఘ విద్రోహక చర్యలకు వినియోగించి మన దేశ ప్రగతికి వలసిన యువత వనరులను నాశనం చేసి లాభపడుతున్నారు. ప్రజల ధనాన్ని స్వార్థానికి వినియోగించి, ఎందరినో దారిద్ర్య రేఖకు అడుగులోకి అణచి అన్నమో రామచంద్ర అన్న అరుపులు వినని చెవిటివారవుతున్నారు. వీరి ఆట కట్టు ఎప్పుడు? ఎవరు ఉద్యమిస్తారు? అలాంటి అన్నార్తులకు మత బోధలు ఎందుకు? అంటూ స్వామి వివేకానంద అందుకు యువత దుష్టశక్తుల నెదిరించాలి. అందుకు వారు విద్యాబుద్ధులతో బాటు విచక్షణా జ్ఞానాన్ని పొందాలి అన్నారు.

ఆయనకు తల్లే ఉత్కృష్టమైన గురువయ్యారు. దానగుణం, పెంపుడు జంతవులు, పక్షులపట్ల ప్రేమ పాత్రునిగా తీర్చిదిద్ది ధీర గంభీర హృదయునిగా ఆ తల్లి ''తండ్రీ! నీలో దోషం లేకపోతే నీకేం భయం? ఏ కర్రలో నిప్పు ఉంటుందో, ఆ కర్రే కాలుతుంది. నిశ్చయంగా నీకు న్యాయమని తోచేదాన్ని హరిహర బ్రహ్మాదులు అడ్డుపడ్డా ఆచరించడం మానకు'' అంటూ ఉద్బోధ చేసేది. మూఢ విశ్వాసం, భయం అన్ని బలహీనతలనుంచి ఆయన్ను విముక్తుణ్ణి చేసిన గొప్ప గురువు స్వామి తల్లిగారు! అందుకే ఆయనకు భయమంటే అసహ్యం. ''వీర భరత పుత్రా! ధైర్యం వీడకు. నేను భారతీయుణ్ణి. భారతీయుడు నా సోదరుడు, నా ప్రాణం. కార్యనిర్వహణలో త్యాగం చేయడానికి, నా సహోదరులపట్ల ప్రేమ ఔదార్యాలను పాటిస్తాను'' అని యువతకు ఆయన మేల్కొలుపు. 'ఆత్మ స్వాతంత్ర్యాన్ని అరికట్టకు, అజ్ఞానం నుండి బయటపడు' అని ప్రవచించారు.

సాహసం యువతకు సహజం! అందులో స్వామి విక్రమార్కుడు. అందుకే ప్రపంచ పర్యటన చేయగలిగాడు. 14 ఏళ్ళ వయస్సులో ఆ నరేంద్రుడు అందరితోబాటు నాటకాన్ని వీక్షిస్తున్నాడు. ఇంతలో ఎవరో ఒక నటుణ్ణి పట్టుకోవడానికి అరెస్టు వారెంట్ పట్టుకొచ్చాడు. అంత చిన్న వయసులో నిర్భయంగా జనంలోనుండి ఆ చిన్నారి అరవడం, దాంతో అందరు ప్రేక్షకులు గొంతు కలపి ఆ వ్యక్తిని తరిమారట! అందుకే యువత మంచిని పెంచడానికి, చెడును నిరోధించడానికి సాహసం చేయగలరు. అతనిని మించిన ప్రేమమూర్తి, పరోపకారి లేరు. గానం, ధ్యానంలో ఆయనకు ఆయనే సాటి. ఇక ఆయనను మించిన వక్తలు లేరట!

''వక్తలకు వక్తృపంచాస్యమట! ఆచార్యులకు అపర శంకరాచార్యులట! పండితులకు విద్యావాచస్పతట!''- ఇక ప్రజానాయకోత్తముడు కావడంలో ఆశ్చర్యం లేదు. అంతటి నాయక లక్షణాలు, లైటింగ్ ఓరేటర్ కాబట్టి విశ్వ సభల్లో పిన్‌డ్రాప్ సైలెన్స్‌తో మంత్రం వేసినట్లు చెవులిచ్చి ఎందరో శిష్యులయ్యారంటే అతిశయోక్తి కాదు!

ఆటల్లో, పాటల్లో, భజనల్లో, ప్రార్థనల్లో ఆయన నాయకుడట. యువకులలో ఏ సంఘం ఏర్పడినా, ఏ సమాజం స్థాపించబడ్డా దాన్లో ఆయన లేకుంటే తీరని వెలితిగా కనిపించేదట.

ధ్యానం బాల్యం నుండే అలవరచుకున్న నరేంద్రుడు ''తల్లీ! వినిర్మల భక్తి మాత్రం ప్రసాదించు'' అని వేడే ఆతనికి ధ్యానంలో ఉండగా, చెంత పాము నడయాడి హాని చేయక, తన దారిని పోయిన విషయం తెలుసుకుని స్వామి, ''చిన్నతనంలో ధ్యానంలో నేనెంత హాయిగా ఉన్నానో'' అన్నారుట.

ఓ యువకుడు స్వామిని దర్శించి ''తాను గది తలుపులు బిడాయించి కళ్ళు మూసుకుని రోజూ ధ్యానం చేస్తున్నానని, కాని శాంతి లభించలేదని, మార్గం చూపమని'' కోరారట. అందుకు ఆయన ప్రేమపూరితుడై ''నా మాటల్లో నీకు గురి ఉంటే మొదట నీవు నీ గది తెలుపులు తెరచి, మూసుకున్న కళ్ళు విప్పి నీ చుట్టూ వున్న పరిస్థితులను పరికించు. నీ ఇరుగు పొరుగుల్లో వందలాది దీనులు నిస్సహాయులుగా పడి ఉన్నారు. నీ శక్తి మేరకు వారిని సంరక్షించు. రోగులకు మందులిచ్చి సేవించు. క్షుదార్తులకు భోజనం పెట్టు. విద్యావిహీనులకు నీవు నేర్చినవిద్య గరపు. మనశ్శాంతికి నీకిదే మార్గం'' అన్నారుట.

''బలిష్టుల్ని, మేధానిధులను రూపొందించే జాతీయ విశ్వవిద్యాలయాలు స్థాపించబడాలి'' అని ప్రబోధించారు. 'కామినీ కాంచన వాంఛలు ఆత్మహత్యగా పరిగణించాలి', 'ఏనుగు దంతాలు ముందుకు వస్తాయే కానీ వెనుకకు ఎన్నడూ పోవు''- ఇదే ఆయన యువతకిచ్చిన ప్రబోధ.

''వివేకానందాస్ వర్డ్స్ ఆర్ గ్రేట్ మ్యూజిక్, ఫ్రేజెస్ ఇన్ ది స్టైల్ ఆఫ్ బీథోవెన్, స్టిరింగ్ రిథిమ్స్ లైక్ ది మార్చ్ ఆఫ్ హాండెల్ కోరస్''

-పరిమి శ్యామలా రాధాకృష్ణ

అనుక్షణికం

-వడ్డెర చండీదాస్

వినమరుగైన..

రామిశెట్టి చంద్రశేఖర అజాద్

తిరిగి యితను మరొకరిని కలిసిందాకా.

నవల మొదట్లో పరిచయాలు చేయబడిన వాళ్ల జీవితాలు పదేళ్ల తర్వాత ఎలాంటి మలుపులతో మార్పులు చెందుతాయో చూస్తాము నవలను.అనుక్షణికం నవల శ్రీపతితో మొదలయి, చివరన అతనితోనే ముగుస్తుంది- ఉస్మానియా ఆర్ట్స్ బిల్డింగ్‌లా. చండీదాస్ మేధస్సు నుంచి వచ్చిన ఒకానొక అతి గొప్ప అతి విలక్షణ సృష్టి శ్రీపతి. తన చుట్టూ జీవితం అనుక్షణం మారుతున్నా తనలో ఎటువంటి మార్పు లేకుండా మొదటినుంచి చివరి దాకా కనపడేది ఒక్క శ్రీపతే.

వొడ్డున నుంచొని జీవితం నదిని పరిశీలించే ఒక యోగిలా, ఒక సైంటిస్టులా, జీవితపు నదిలో పూల పవడలో వెల్లికలా పడుకొని జీవిత రహస్యాలను ఆకాశంలో వెదికే ఒక తత్వవేత్తలా, ఒక స్వాప్నికుడిలా, అన్నీ తెలిసి ఏమీ తెలియనట్లు అగుపించే ఒక సామాన్యునిలా, అత్యున్నతపు మానవతా విలువలు కలిగిన ఒక అపూర్వ వ్యక్తిలా శ్రీపతి కనపడ్డాడు.

చేతనాత్మక నీతిని అంటే కాన్సియస్ మొరాలిటీని కల్గిన వ్యక్తి శ్రీపతి. స్వయంగా తన నైతిక విధిని, పరిధిని తానే నిర్ణయించుకొని, దానిని బాధ్యతతో నిర్వహించే దశను లేక స్థితిని చేతనాత్మక నీతి అని అంటాము. సహజీవనావసరాల కనుగుణంగా గాని ఆచారాల కనుగుణంగా గానీ సాగక తన అంతరాత్మనే సాక్షిగా గ్రహించి మెసులుకోవటం శ్రీపతిలోని విశిష్టత.

సాహిత్యాన్ని, సంగీతాన్ని, చిత్రలేఖనాన్ని, చివరకు రాజకీయాలలోనూ లోతుల్లో తట్టగలడు. అందరికీ ఆప్తుడు. ఎవరినీ నొప్పించడు. అవసరమైతే అడ్డదిడ్డంగానూ ప్రవర్తించగలడు. అప్పుడప్పుడు శరీరపు ఒత్తిడి ఎక్కువయినప్పుడు 'వేశ్య' దగ్గర గడపనూ గలడు.

(ఇంకా ఉంది)

పరశురామోపాఖ్యానం




మహాభారతంలో ఉపాఖ్యానాలు

98

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి

జహ్నుమహర్షి కుమారుడు అజుడు. అతని కొడుకు బలా కౌశ్వుడు. అతని కుమారుడు కుశికుడు. అతను ధర్మాత్ముడు. ముల్లోకాలను జయించే పుత్రుడు కలగాలని కుశికుడు గొప్ప తపస్సు చేశాడు. అతని తపస్సుకు మెచ్చి ఇంద్రుడు అతనికి పుత్రునిగా జన్మించాడు. అతని పేరు గాధి. అతనికి సత్యవతి అనే పుత్రిక కలిగింది. గాధి ఆమెను భృగుమహర్షి పుత్రుడైన ఋచీకునకు ఇచ్చి వివాహం చేశాడు. ఆమె సత్ప్రవర్తన, ధర్మనిరతికి, శుచిత్వానికి సంతృప్తి చెంది ఋచీకుడు ఆమెకూ, ఆమె తల్లికీ కూడా పుత్రులు కలగాలని రెండు చరువులు పండించి భార్యతో ఇలా అన్నాడు. "ఈ చరువును నీవు ఉపయోగించు, రెండవది మీ అమ్మ భుజించాలి. ఈ లోకంలో ఎవ్వరు గెలవలేని క్షత్రియుడు ఆమెకు పుడ్తాడు. అతను క్షత్రియ శ్రేష్ఠుడు కూడా. ధైర్యం, శమం కల సద్బ్రాహ్మణుడు నీకు పుడతాడు" అని భార్యతో ఇలా చెప్పి అతను తపస్సు చేసికొనేందుకు అరణ్యానికి వెళ్ళిపోయాడు.

అదే సమయంలో తీర్థయాత్రలు చేస్తున్న గాధి మహారాజు భార్యతో కలసి ఋచీకుని ఆశ్రమానికి వచ్చాడు. సత్యవతి తల్లి తండ్రులను చూసిన ఆనందంతో రెండు చరువుల గురించి భర్త అన్న మాటలు తల్లికి చెప్పి ఒక చరువు ఇచ్చింది. కాని పొరపాటున తన చరువు తల్లికి ఇచ్చి తల్లి చరవుతాను తీసుకొంది. అందు వలన క్షత్రియులను అంతం చేసే గర్భాన్ని సత్యవతి ధరించింది. ఆమె గర్భం విపరీతమైన తేజస్సుతో ప్రకాశించ సాగింది.



ఋచీకుడు తిరిగి వచ్చి ఆమె గర్భంలో ఉన్న బ్రాహ్మణ తేజాన్ని చూసి భార్యతో ఇలా అన్నాడు "చరువులు తారమారు అవటంవలన నీపుత్రుడు క్రోధి, క్రూర కర్ముడూ అవుతాడు. నీ తమ్ముడు బ్రాహ్మణుడు, తపస్వీ అవుతాడు. నీ చరువులో మహిమాన్వితమైన బ్రహ్మజ్ఞానాని పెట్టాను. నీ తల్లి చరువులో క్షత్రియ వీరుని పెట్టాను. కాని అవి తారుమారు అయ్యాయి. నీకు క్షత్రియుడు నీతల్లికి బ్రాహ్మణుడు పుడతారు" భర్త ఇలా చెప్పగానే సత్యవతి దుఃఖించి శోకంతో భర్త కాళ్ళపై పడి ఇలా ప్రార్థించింది.

"స్వామీ! బ్రాహ్మణాధముని పుత్రునిగా పొందుతావు అని నాతో ఇప్పుడు చెప్పటం సముచితం కాదు". ఋచీకుడు భార్యతో ఇలా అన్నాడు. "సౌభాగ్యవతీ! నీ యందు నేను ఇటువంటి పుత్రుని సంకల్పించలేదు. చరువు మారటం వలన అతన తీవ్రమైన కోపం, ఉగ్ర కర్మలు చేసేవాడు అవుతాడు".

సత్యవతి మరల ఇలా ప్రార్థించింది "స్వామీ! నాకు శాంత స్వరూపుడు సరళ స్వభావకలవాడు తపస్వి అయిన పుత్రుని అనుగ్రహించండి".

ఋచీకుడు ఇలా సమాధానం చెప్పాడు "నేను ఎన్నడూ పరిహాసానికైనా అసత్యం ఆడలేదు. మంత్ర పూర్వకంగా అగ్నిని నిలిపి చరువును సాధించాను. కల్యాణీ! ముందే నాకు తపస్సులో అంతా తెలిసింది. నీ తండ్రి వంశమంతా బ్రహ్మభూతమౌతుంది".

అప్పుడు సత్యవతి భర్తను ఇలాకోరింది. "స్వామీ ! మీకు ఇదే ఇష్టమయితే నా మనుమడు అలాంటి వాడు అవనివండి, కాని నాకు మాత్రం తపోధనుడు ప్రశాంత చిత్తుడు అయిన పుత్రుడే కావాలి". అప్పుడు ఋచీకుడు భార్యతో ఇలా అన్నాడు "పుత్రునికీ, పౌత్రునికీ పెద్ద భేదం లేదు, నీకు నీవు కోరుకున్న పుత్రుడే జన్మిస్తాడు".

తర్వాత కొంత కాలానికి సత్యవతికి తపస్సంపన్నుడైన పుత్రుడు కలిగాడు. అతనే జమదగ్ని. సత్యవతి తల్లికి కూడా విశ్వామిత్రుడు జన్మించాడు. జమదగ్ని శాంతిస్వభావుడూ, వినయశీలుడూ, బ్రహ్మగుణాలు కలిగిన వాడు. తర్వాత అతడు బ్రహ్మర్షి అయినాడు. అతనికి భయం కర్యుడైన పుత్రుడు కలిగాడు. అతను ధనుర్విద్యా పారంగతుడు, సకల విద్యలూ నేర్చినవాడు. అగ్నిలాగ ప్రకాశించాడు.

ఇంకావుంది...

స్వేచ్ఛ చిన్న చిన్న ముక్కలుగా రాదు. అలాగే, బానిసత్వం చిన్న చిన్న ముక్కలుగా పోదు. గదిలో ఉన్న చీకటి దీపం వెలిగించిన వెంటనే పోతుంది. అంతేకానీ, కొద్దికొద్దిగా చీకటిపోవడం, కొద్దికొద్దిగా వెలుగు రావడం జరగదు.

స్వేచ్ఛ అంటే మీరు అన్ని బంధనాల నుంచి పూర్తిగా బయటపడినట్లు. అంతేకానీ, అది కాలానికో, నిదానానికో సంబంధించిన విషయం కాదు.

బంధనాలన్నింటినీ తెంచుకోవడం తప్ప మీకు మరొక దారి లేదు. వాటిని మీరే మీ చిన్నప్పటినుంచి 'పెద్దల పట్ల అణకువ, తల్లిదండ్రుల పట్ల ప్రేమ, పూజారుల పట్ల నమ్మకం, గురువుల పట్ల గౌరవం"

యువతకు వైతాళిక మహర్షి

శ్రీస్వామి వివేకానంద


లాంటి మంచి మంచి పేర్లతో మీ చుట్టూ సృష్టించుకోవడం మొదలుపెట్టారు. మీరు బాగా లోతుగా పరిశీలించి చూస్తే అందమైన పేర్లతో బానిసత్వాన్ని మీకు బాగా అంటగట్టినట్లు తెలుసుకుని ఆశ్చర్యపోతారు.

మా నాన్నతో నాకు ఎప్పుడూ గొడవే. ఆయన చాలా అవగాహన కలిగిన ప్రేమికుడే అయినా "నువ్వు ఆ పని చెయ్యాల్సిందే" అని నన్ను ఆజ్ఞాపించేవారు. అది నాకు నచ్చేది కాదు. అందుకే నేను ఆయనతో "అలా ఆజ్ఞాపించకండి. అది బానిసత్వ దుర్గంధం కొడుతోంది. ఆ కంపు నేను భరించలేను. కావాలంటే "నీకు నచ్చితే చెయ్యి, లేకపోతే చెయ్యకు" అనండి. ఆ పని చెయ్యాలా, వద్దా అనేది నా ఇష్టం కానీ, మీ ఇష్టం కాదు.

మీరు చెప్పిన పని చెయ్యాలో, వద్దో నన్ను ఆలోచించుకోనివ్వండి. నాకు నచ్చితే చేస్తాను, నచ్చకపోతే చెయ్యను. ఒకవేళ, ఆ పని నేను చెయ్యకపోతే మీరు కోపగించుకోకండి. నేను "మీ మాట పాటించను అనట్లేదు. అలా ఆజ్ఞాపించకండి, అంటున్నాను. నేను సత్యానికి, స్వేచ్ఛకు, ప్రేమకే తల వంచుతాను. వాటి కోసం నేను అన్నింటినీ త్యాగం చేస్తాను. అంతేకానీ, బానిసత్వానికి నేను ఏమాత్రం తల వంచను. ఈ జీవితం నాది. నా బతుకు నన్ను బతకనివ్వండి. నన్ను ఆజ్ఞాపించకండి. ఎలాంటి పరిస్థితిలోనూ నేను ఎవరి నుంచి ఎలాంటి ఆజ్ఞలను స్వీకరించలేను, వాటిని పాటించలేను" అనేవాడిని. నేను ఎవరికీ తలవంచనని ఆయన త్వరగానే అర్థం చేసుకున్నారు. దాంతో ఆయన నన్ను ఆజ్ఞాపించడం మానుకుని "ఈ పని చెయ్యాలి. నీకు నచ్చితే చెయ్యి. లేకపోతే, నీ ఇష్టం" అనేవారు నాతో. వెంటనే నేను "అసలైన ప్రేమ ఇలా ఉండాలి" అనేవాడిని ఆయనతో. చాలావరకు

..మనిషి జీవితం చాలా చిన్నది. కాబట్టి, దాని పట్ల చాలా నిర్ణయాత్మకంగా ఉండండి. మీరు మీ ఆత్మలో స్వేచ్ఛగా ఉండాలి. అదే అసలైన స్వేచ్ఛ. మనిషి ఆత్మతో జన్మించాడు కానీ, వ్యక్తిత్వంతో జన్మించలేదు. ఆత్మకు (సోల్), వ్యక్తిత్వానికి (సెల్ఫ్) నిఘంటువులలో ఒకే అర్థం చెప్పడం జరిగింది. కానీ, అది నిజం కాదు. ఆత్మాన్వేషణకు అనేక సంవత్సరాల తీర్థయాత్ర చెయ్యాల్సివస్తుంది. అంతవరకు మీరు "ఒక ఊరు, పేరు లేని, ఎవరో ఏమిటో తెలియని బికారిలా, ఏమీ లేకుండా ఉండడాన్ని" ఏమాత్రం భరించలేరు.

కేవలం ప్రేమ వల్లనే వ్యక్తిత్వాన్ని సృష్టించడం జరిగింది. అందుకే ఆది నుంచి మీరొక వ్యక్తిగా భావించడం ప్రారంభించారు. లేకపోతే, మీరెలా జీవిస్తారు? మిమ్మల్ని ఎలా సంబోధించాలి? వ్యక్తిత్వ భావనను సృష్టించిన వారందరూ సదభిప్రాయాలున్నవారే. ఎందుకంటే, వారి ఆత్మల గురించి వారికి ఏమాత్రం



తెలియదు. అందుకే వారు అవాస్తవ వ్యక్తిత్వాన్ని సృష్టించి అలాంటి వ్యక్తిత్వంతోనే మరణించారు. అందుకే ఈ అస్తిత్వం వారిని ఎందుకు అలా తయారుచేసిందో వారు ఎప్పటికీ తెలుసుకోలేకపోయారు. మీ ఆత్మ ఈ అస్తిత్వంలో ఒక భాగం. మీ వ్యక్తిత్వం ఒక సామాజిక వ్యవస్థ.

కాబట్టి వాటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఎప్పటికీ పూడ్చలేమని ముందుగా మీరు గుర్తుంచుకోవాలి. మీరెవరో నిజంగా తెలుసుకోవాలనుకుంటే మీ వ్యక్తిత్వాన్ని మీరు సమూలంగా నాశనం చెయ్యాల్సిందే. మీరు ఒక్కొక్కప్పుడు ఆత్మగానూ, ఒక్కొక్కప్పుడు వ్యక్తిత్వంగానూ ప్రవర్తిస్తారు. అలా విభజించబడడం వల్ల మీరు నిరంతర ఒత్తిడిలో ఉంటారు. అందువల్ల మీ జీవితం చాలా ఆదుర్దాగా, బాధాకరంగా తయారవుతుంది. అలాంటి జీవితాన్ని మీరు ఎప్పటికీ జీవించలేరు, భరించలేరు. అందుకే తల్లిదండ్రులు, విద్యా విధానం, పూజారులు- సమాజం- ఇలా మీ చుట్టూ ఉన్నవన్నీ మీరు మీ లోపల దాగిఉన్న ఆత్మను ఎప్పటికీ తెలుసుకోకుండా ఉండేందుకు కావలసిన దృఢమైన వ్యక్తిత్వాన్ని సృష్టించేందుకు అన్ని రకాల మార్గాలలో ప్రయత్నిస్తారు.

ఆ ప్రయాణం ఏమంత దూరం కాకపోయినా, అది కచ్చితంగా చాలా ప్రయాసతో కూడుకున్న ప్రయాణమే. వ్యక్తిత్వమనేది చిన్న విషయం కాదు. అది చాలా క్లిష్టమైనది. వ్యక్తిత్వం అధిక ధనాన్ని, అధికారాన్ని, పరువు, ప్రతిష్టలను పోగుచేస్తూనే ఉంటుంది. దాని ఆశలకు అంతుండదు. అలా మీరు మీ వ్యక్తిత్వానికి అనేక హంగులు తగిలిస్తూనే ఉంటారు. మనిషిని ముఖ్యంగా బాధపెట్టేది అదే.

"తాను ఇది, తాను అది" అని మనిషి నమ్ముతూనే ఉంటాడు. మీరు అనుకొన్నవేవీ నిజాలు కావు అవి మీరు చేసే పనులే తప్ప మీ వాస్తవాలు కాదు. మీరు పుట్టిన మరుక్షణం నుంచే మీ తల్లిదండ్రులు మిమ్మల్ని వారికి కావలసినట్లుగా తయారుచేయడం ప్రారంభిస్తారు.

ఉదాహరణకు, మీరొక వైద్యుడు, ప్రధానమంత్రి, చివరికి రాష్ట్రపతి అయినా ఎవరు ఎవరైనప్పటికీ వారికి వారి వాస్తవ స్వరూపాలు తెలియవు. అలా అవాస్తవ అహం, అవాస్తవ వ్యక్తిత్వాలు మీలో ప్రవేశించి మిమ్మల్ని అలాగే తయారుచేస్తాయి. అందువల్ల మీరు మీ వాస్తవాన్ని మరచిపోవడం జరుగుతుంది.

- యర్రమిల్లి విజయలక్ష్మి

పాశురాలు..జ్ఞానమార్గ సోపానాలు



శిత్తమ్ శిఱుకాలే వన్దున్నై చ్చే విత్తు ఉన్
పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళ్ కేళాయ్

.... వెలుగురేఖలు విచ్చుకోకముందే కోడికూతలు రాకపూర్వమే, అలనాడు మాలదాసరి నిన్ను కొలవడానికి వచ్చినపుడు నీవేవిధంగా ఆదుకొన్నావో అటులనే నేడు నా స్నేహితులతో కలసి నిన్ను సేవించడానికి తూర్పున భానుడు మేలుకొనక ముందే... వడివడిగా నిన్ను చేరి నీ దర్శనమునకై వేయి కనులతో ఎదురు చూస్తున్నాం స్వామీ మా మొర ఆలకించి మమ్మాదుకో గోపాల బాల అంటూ ప్రతిరోజు ప్రతివైష్ణవాలయంలో అనుసంధానించే పాశురాల వెనుక ఓ పరమాద్భుతమైన కథ ఉంది. పన్నిద్దరు ఆళ్వారులలో ప్రముఖ స్థానంలో ఉన్నఆళ్వారు గోదాదేవి. గోదాదేవి ఆ విల్లి పుత్తూరు లో వెలసిన వటపత్ర శాయికి పరమభక్తుడైన విష్ణుచిత్తులకు తులసీవనంలోతోటపని చేస్తుండగా చిన్నారి శిశువుగా లభించింది. శ్రీహరి వాహనమైన గరుడుడు, తన స్వామిని అల్లునిగా చూడాలని , భూదేవి తన పతికి ఇష్టమైన పుష్పకైంకర్యం చేసి తరించాలని కోరుకున్నారు. వారిద్దరి కోరికను ఈ యుగంలో శ్రీవిల్లిపుత్తూరులో ఫలింపచేశాడా శ్రీహరి.


విష్ణుచిత్తుడు తనకు లభించిన ఆ చిన్నారికి కోదై అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుకోసాగాడు. తండ్రిలాగానే హరిభక్తిని పెంచుకున్న కోదై గోదాగా మారి ప్రతిరోజు తన తండ్రి చేత తులసి, పూమాలలను తానే తయారు చేసి తానుధరించి చూసి మురిసి తన నాథుడుగా ఇంకెంతగా ఆనందిస్తాడో అని భావిస్తూ స్వామి కైంకర్యానికి పంపేది. ఒకనాడు విష్ణుచిత్తుడుస్వామికి మాలాకైంకర్యం చేస్తుండగా పొడవాటి కేశం కనిపించింది. దానితో మాల అపవిత్రం అయిందని ఎంతో బాధపడ్డాడు. ఇంత అపచారం చేశానని భావించి దుఃఖించే ఆ విష్ణుచిత్తునికి స్వామి మాలను ధరించి బావిలో నీడను చూసుకొని మురిసే గోదా దేవి కనిపించింది.

వేదన చెంది ఇలా చేయడంతప్పు అని చిరుకోపంతో తన తనయకు చెప్పాడు. తన తనయ తెలియక తప్పు చేసింది మన్నించమని శ్రీహరిని పదేపదే వేడుకున్నాడు. ఆ బాధలో ఆయనకు నిద్ర పట్టింది. విష్ణుచిత్తులకు కలలో పెరుమాళ్ దర్శనమిచ్చి గోదా ధరించిన మాలనే తనకెంతో ఇష్టమని చెప్పడంతోనే నిద్రలోనే గోదాను, "శ్రీదేవియో, భూదేవియో, నీళాదేవియో ఈ ఇంట అవతరించిందని"అంటూ పరవశించాడు విష్ణుచిత్తులు. తన్మయత్వంతో శూడికొడుత్తనాచియార్ అని అమ్మను కీర్తిస్తూ పాటలు పాడాడు. ద్వాపరంలో గోపికలు చేసిన కాత్యాయనీ వ్రతం విశేషాలను తన తండ్రినుండి ఆండాళ్ తెలుసుకొంది. గోపాలదేవుని పొందడానికి అనువైన కాత్యాయినీ వ్రత విధానాన్ని తెలుసుకొన్న గోదాదేవి మార్గశిరమాసంలో ధనుస్సంక్రమణ దినాన కాత్యాయినీ వ్రతానికి సమాన ప్రతి పత్తిగల 'మార్గళి' వ్రతాన్ని గోదాదేవి చేపట్టింది. విల్లిపుత్తూరునే రేపల్లెగా భావించింది. వటపత్రశాయిని నందగోపునిగా, గోపభామలను తన చెలికత్తెలను గా వారిలో తానొకతెగా ఊహించుకొని వ్రతమాచరించింది. ఆ వ్రతమే శ్రీ వ్రతం. ముప్పదిరోజులు సాగే ఈ వ్రతంలో నాడు గోపికల చిత్తవృత్తులను వారి హాస, హాస్య, లాస్యాలను ప్రకృతి సౌందర్యాలను, చివరగా శ్రీకృష్ణుని యందు తమకు గల ప్రేమానురక్తిని, శరణాగతిని వర్ణిస్తూ రోజుకొక పాశురంగా పాడింది. ఈ ముప్పైరోజుల పాశురాలే నేడు మనం అనుసంధానించుకునే తిరుప్పావై. కాత్యాయినీ వ్రతసమాప్తిరోజు స్వామినే తన కోరిక మేరకు వివాహం చేసుకొంది ఆ తల్లి. ఆ స్వామిలోనే తాను ఐక్యమైంది.

ఆమె రచించి పాడిన పాశురాలే దివ్యప్రబోధాలు, బ్రహ్మానంద సాగర తరంగాలు, మోక్షసౌధాన్ని చేరడానికి సోపానాలు అని ఎంచిన కోమాండూరి అరుంధతి కొత్తపేటలోని శ్రీ పద్మావతి గోదాసమేత శ్రీవేంకటేశ్వరాలయంలో నిత్యమూ సాయంసంధ్యా సమయంలో గోదాదేవి పాడిన పాశురాలను అనుసంధానిస్తూ వాటి అర్థతాత్పర్యాలను వివరిస్తూ ఆ కృష్ణుని లీలావిలాస వైభోగాలను చెవులకు ఇంపుగా చెపుతున్నారు. ఈ అరుంధతీయే గోదాగా మారి వేంకటేశ్వరుని సన్నిధిలో తిరుప్పావైను అనుసంధానిస్తుంటే ఇతర భక్తులంతా రేపల్లెలోని గోపభామలై వింటూ తమ జన్మ తన్మయమైనట్టుగాను, తామూ గోదాదేవివలె చెలులవలె మార్గళీ వ్రతాచరణను చేస్తున్నట్టు భావిస్తున్నారు.

- చరణ శ్రీ

సుందరకాండ



సాధకుడు భ్రమించి అట్టువైపునకు వెళితే కనబడదు. నిలిస్తే తానే కనబడుతుందది. ఇదీ మాయ- ఇదీ పరీక్ష.

ఎందుకూ ఉంటే- ఆ తల్లి నదసద్రూపధారిణి. కనుక అసత్తును సత్తుగా చూపిస్తూ ఉంటుంది. అసత్తునందు సత్తు అనే భ్రాంతి కలగడానికొంత కారణం ఊహింపబడుతూ ఉంటుంది. కాని అది అసత్యం అని తెలియడానికి కొంతకాలం పడుతుంది. ఈలోపు ఈ జీవి చాలా చేష్టల్ని చేస్తుంది. అంతేకాదు. ఆమె సర్వమోహిని.

సర్వాన్ ప్రకృతి జనాన్ భేదభానే సత్యత్వం మన్యమానాన్ మోహయతి. అద్వైత జ్ఞాన విధురాన్ కురుతే. ఇతి. అంటారు భాష్యకర్తలు.

భేద భావమూహింపబడుతుంది. అసత్తునందు సల్లక్షణమున్నట్లుగా మూర్ఖులను మోహింపచేస్తుంది. అద్వైత స్థితికి దూరంచేస్తుంది. అందుకే 'గౌరీం'అని వాల్మీకి మహర్షి శ్లోకాన్ని ప్రారంభించేరు. గౌరి అంటే

భువనేశ్వర్యాః మన్త్రాత్మకం సూక్ష్మరూపం అందుకని గౌర్యైనమః అని పరా శక్తిని కీర్తించే మనం బాహ్య లక్షణ జ్ఞానముఖ్యులం కాకూడదు. అలా భావించిన స్వామి అసత్యాన్ని సత్యమను కొని మండోదరిని సీతగా భావించి పట్టరాని ఆనందాన్ని పొందేడు. వెంటనే-

ఇంకావుంది...

దేవాలయము

ప్రార్థన

- మద్దు పీటర్

9490651256

'మీరు దేవుని ఆలయమై ఉన్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసిన యెడల దేవుడు వారిని పాడుచేయును. మీరు ఆ ఆలయమై యున్నారు.' - *1 కొరింథీ 3:16-17*

మహాఘనుడును మహోన్నతుడును పరిశుద్ధుడును నిత్యనివాసియునైన వాడు మీ ఆకాశ మహాకాశములు పట్టజాలని వాడైయుండి సమీపింపరాని తేజస్సుతో ఉండువాడును, పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు అని దూతల చేతను భక్తుల చేతను నిత్యము కొనియాడబడుచున్న ప్రభువు ఇప్పుడు మన దేహాలలో నివసించటానికి ఇష్టపడుతున్నాడు.

ప్రత్యక్ష గుడారములో ఉండి ఇశ్రాయేలీయులతో వారి మధ్య ఉంటూ, వారి మార్గమంతటిలో తోడుగా ఉన్నాడు. తరువాత సొలొమోను యెరూషలేములో కట్టిన దేవాలయములో ఉన్నాడు. అసలు దావీదు మహారాజు దేవాది దేవునికి ఒక ఆలయము కట్టవలెనని సిద్ధపరచిన వస్తువులు అనేకములు. బంగారము రెండు లక్షల మణుగులు, పది కోట్ల మణుగుల వెండి, ఇత్తడి ఇనుము తూచ శక్యము కానంత. వీటికి తోడు ప్రానులు రాళ్లు, విస్తారమైన శిల్పకారులు కాసే పనివారు వడ్రవారు ఎటువంటి పనినైన నెరవేర్చగల పనివారలను సిద్ధపరచాడు. అయినా దేవుడు దావీదుకు దేవాలయము నిర్మించే అవకాశమివ్వలేదు. చివరకు దావీదు కుమారుడు సొలొమోను ఆ మందిరమును కట్టించెను. దేవాలయ నిర్మాణానికి పట్టిన సమయము 46 సంవత్సరాలు. ఆ దేవాలయము రెండుసార్లు పడగొట్టబడింది. అనేకసార్లు పొరుగు దేశాల చేతిలో పట్టబడింది. ఇశ్రాయేలీయులు చేసిన అత్యధికమైన హేయ కృత్యములను బట్టి తిరుగుబాటును బట్టి దేవుడు ఆ స్థలములో నివసించలేదు.

ప్రార్థనలు విజ్ఞాపనములు అర్పణలు బలులు స్తుతియాగములు ఆరాధనలు నిత్యము జరుగవలసిన స్థలము దేవాలయము. కాని పరిశుద్ధ దేవాలయమును వారు అపవిత్రపరచారు. ప్రభువు దృష్టిలో చెడ్డక్రియలు చేశారు. అందుకే ప్రభువు ఆ స్థలమును విడిచివెళ్లారు.


ఆయన మన మీద ఉన్న ప్రేమనుబట్టి ఆయనే శరీరాకారముతో ఈ లోకానికి వచ్చి మన మధ్య సంచరించి ఎన్నో అద్భుతాలు స్వస్థతలు జరిగించాడు. ఆయన ఈ లోకములో ఉన్నప్పుడు ఆయన చెంగు తాకితేనే జనులకు స్వస్థత కలిగింది. అయితే ఆ ప్రభువును సిలువ వేసి చంపారు. మరణము ఆయనను బంధించలేక పోయింది. మృత్యుంజయుడైయ్యాడు. మనకున్న బంధకాలు విడిపించిన ప్రభువును మరణ బంధకాలతో బంధించటానికి ప్రయత్నించారు. కాని మరణ బంధకాలు ఆయన ముందు నిలువలేదు. మరణము ఓడిపోయింది.


ఇప్పుడు ఇక మన దేహాన్ని దేవాలయముగా చేసి మనలో నివసించాలని మనతో సహవసించాలని కోరుకుంటున్నాడు. మన పాపాలన్నిటికి సిలువతో ఆయన విలువ చెల్లించి, మనకు పాపాల నుండి విడుదల కలుగజేసి, శుద్ధ హృదయాలు కలిగిన మనలోనే మనతోనే ప్రభువు ఉండాలని కోరుకుంటున్నాడు.

వారియందు నేనును నాయందు నీవును ఉండుట వలన వారు సంపూర్ణులుగా చేయబడి యేకముగా ఉన్నందున నీవు నన్ను పంపితివనియు, నీవు నన్ను ప్రేమించినట్టే వారిని కూడ ప్రేమించితివనియు లోకము తెలిసికొనునట్లు నాకు అనుగ్రహించిన మహిమను వారికి ఇచ్చితిని. -యోహాను *17:23*

నేను ఎవని యందు నిలిచి యుందునో వాడు బహుగా ఫలించును. -యోహాను *15:5*

చీకటి నుండి ఆశ్చర్యకరమైన వెలుగులోనికి మనలను పిలిచిన దేవుడు. ఆయన గుణాతిశయములను ప్రచురము చేయాలని ఏర్పరచుకొని, ప్రత్యేకపరచుకొని పరిశుద్ధపరచి రాజులైన యాజక సమూహముగా ఆయన సొత్తుగా చేసుకొన్నాడు. మన దేహాలు దేవుని వలన అనుగ్రహింపబడినవి మనము మన సొత్తు కాదు. మన కొరకు ప్రాణము పెట్టి మన పాపాలకు వెల చెల్లించిన ప్రభువుకు ఆలయమై యున్నవి. విలువ పెట్టి కొన్నవారము గనుక ఈ దేహములో దేవుని మహిమ పరచాలి.





దేవునికి ఆలయమైన ఈ దేహమును హింసించరాదు, దూషించరాదు అసభ్యంగా ప్రవర్తించకూడదు. హేళన చేయకూడదు. విసికించకూడదు. గాయపరచకూడదు. పచ్చబొట్లు పొడుచుకొనకూడదు.

ఈ దేహము పరిశుద్ధుని నివాసానికి అనువుగా పరిశుద్ధముగా ఉంచాలి. అప్పుడే మన దేహాన్ని దేవాలయముగా చేసికొని పరిశుద్ధాత్ముడు మనలో నివసిస్తాడు. దేహములో జారత్వము కాముకత్వము అపవిత్రత ద్వేషము కలహము మత్సరము క్రోధము కక్ష భేదములు విమతములు అసూయలు అల్లరితో కూడిన ఆటపాటలు కోపాలు ఉన్నట్లయితే దేహములో పరిశుద్ధత ఉండదు గనుక ప్రభువు ఉండడు. శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధమైనది.

శరీరాను సారమైన మనస్సు ఉన్నవారిలో పరిశుద్ధ దేవుడు ఉండడు. శరీరానుసారమైన మనస్సు లోకానుసారంగా నడుస్తుంది. లోకములో ఉన్న దంతయు అనగా శరీరాశయు నేత్రాశయు జీవపు డంబమును తండ్రి నుండి పుట్టినవి కావు అవి లోక సంబంధమైనవి. దేహము పరిశుద్ధత లేకుంటే అపరిశుద్ధత చోటు చేసుకొంటుంది. అపరిశుద్ధత ఉన్న దగ్గర అపవాదియైన సాతానుడు ఉంటాడు. సాతాను చేత నడిపించబడతాడు. సాతానుడు మనుషులను సమాధానంగా ఉండనీయడు. ప్రేమలు ఉండవు. ద్వేషము పెరుగుతుంది. సహనము కోల్పోతారు. విశ్రాంతత కోల్పోతారు.

మన దేహములో ప్రభువు ఉండాలంటే దేహాన్ని భద్రపరచాలి. జాగ్రత్తగా ఉండాలి. దేవునికి ఇష్టమైన రీతిలో ఉండాలి. ఆయనకు ఇష్టమైనట్టు జీవిస్తే మనకు సమాధానము. ప్రభువుకు దేవాలయమైన ఈ శరీరమును మన ఇష్టం వచ్చినట్టు జీవించి చెడు అలవాట్లకు బానిసలము కాకూడదు. మత్తుమందులకు జూదాలకు వ్యభిచారానికి బానిసలు కాకూడదు. త్రాగుబోతులుగా తిరుగుబోతులుగా నిద్రమంతులుగా ఉండకూడదు.

అలాగని దేహ పూజ కూడా చేయకూడదు. పరిశుద్ధంగా ఉండాలే కానీ దేహాన్ని ఆరాధించకూడదు. శరీరానుసారమైన మనస్సు మరణమునకు దారితీస్తుంది. అది దేవునికి విరోధముగా ఉంటుంది.

మన మనసులలో దేవునికి చోటియ్యకపోతే అట్టివారిని దేవుడు భ్రష్ఠ మనసుకు అప్పగిస్తాడు.

దేవుడు మన దేహములో ఉండటానికి ఇష్టపడుతున్నాడు గనుక పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మన దేహములను ప్రభువునకు సమర్పించుకొని ఆయనకు ఆలయముగా ఉంటే, ప్రభువు రాజ్యములో మనకు ప్రవేశము దొరుకుతుంది. ఎందుకంటే నూతన యెరూషలేములో నూతన పట్టణములో సర్వాధికారియైన దేవుడగు ప్రభువును గొఱ్ఱెపిల్లయు దానికి దేవాలయమై యున్నాడు -ప్రకటన 21:22. ఈ దేహములో ప్రభువు నివసించటానికి సిద్ధపరచితే, ఆయన ఆలయములోనికి ప్రవేశముంటుంది.

ఈ అల్పకాల జీవితము ప్రభువుకు ఆలయముగా ఉంచినట్లయితే నిత్య రాజ్యములో ఆలయమైన ఆయనలో మనము ఉండగలము. ఇక్కడ ఈ దేహములో ఉన్నప్పుడు ప్రభువును లెక్కచేయక పోతే మన ఆత్మకు పరలోక రాజ్యములో ప్రవేశముండదు. మనకు బాగా తెలుసు. ఈ దేహము మనలను ఏదో ఒక క్షణం విడిచి తిరిగి మంటిలో కలిసి పోతుంది. కాబట్టి దేవుడు మన దేహములో ఇష్టపడనటువంటి కార్యాలు అది సిగరెట్లు త్రాగటమైనా మత్తుమందులైనా జూదాలు లంచాలు దొంగతనాలు వ్యభిచారము లాంటి విషయాలు ఈ నూతన సంవత్సరములో మానివేసి, ప్రభువు నివసించటానికి అనువుగా పరిశుద్ధంగా ఉండటానికి పరిశుద్ధాత్మ దేవుడు సహాయము చేయును గాక.

తీసుకున్న మంచి నిర్ణయాలను అభినందించి వాటిని కొనసాగించి ఆశీర్వాదాలు అందుకోవాలని ఆశిస్తూ.



వయసు.. ఓ నంబర్ మాత్రమే

మూడుపదుల వయసు దాటి నలభయ్యో పడిలో కూడా తరగని గ్లామర్‌ని మెయింటెయిన్ చేస్తున్న ఏకైక కథానాయిక శ్రీయ. ప్రస్తుతం కెరీర్‌పరంగా స్పీడ్ లేకపోయినా పర్సనల్ లైఫ్‌ని ప్రశాంతంగా ఆస్వాదిస్తోంది. విదేశీ క్రీడాకారుడు ఆండ్రూ కోశ్చీవ్‌ని శ్రీయ గత ఏడాది పెళ్లాడిన సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత ఈ అమ్మడు స్టైల్ కంటెంట్ ఇంకా పెంచేసింది. గ్లామర్ ఎలివేషన్‌లోనూ ఏమాత్రం తగ్గడంలేదని తాజా ఫొటోషూట్లు చెబుతున్నాయి. శ్రీయ కొత్త సంవత్సరం సెలబ్రేషన్స్‌ని సుదూరంగా ఒంటరి దీవుల్లోని సాగరంలో సెలబ్రేట్ చేసుకుందని అర్థమవుతోంది. సముద్రంలో పడవ షికార్ చేస్తున్న దృశ్యాన్ని అందమైన ఫొటోల రూపంలో సోషల్ మీడియాలో పోస్ట్‌చేసింది. శ్రీయ యథావిధిగా అంతే హాట్గా కనిపిస్తోంది. ఎన్టీఆర్ బయోపిక్‌లో మొదటి పార్ట్ కథానాయకుడులో అతిథి పాత్రలో మెరిసిన శ్రీయ తదుపరి విక్టరీ వెంకటేష్ సరసన వెంకీ మామ చిత్రంలో కథానాయికగా నటించనుంది. మరోవైపు హిందీలో 'తడ్కా' చిత్రంలో నటిస్తోంది. అరవిందస్వామి- సందీప్‌కిషన్ కథానాయకులుగా నటిస్తున్న 'నరగసూరన్' చిత్రంలోనూ ఆడి పాడనుంది.

చెలియకు కొత్త పిలుపు



సూర్యచంద్ర ప్రొడక్షన్‌లో నెమలి సురేశ్ సమర్పణలో నెమలి అనీల్, నెమలి శ్రవణ్ నిర్మాతలుగా నెమలి అనిల్, సుబాంగి పంత్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న చిత్రం 'రావే నా చెలియ'. ఎన్.మహేశ్వరరెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్ర లోగో ఆవిష్కరణ కార్యక్రమ వేడుక శుక్రవారం జరుపుకుంది. ఈ లోగోను ప్రముఖ నిర్మాత రాజ్‌కందుకూరి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిన్న సినిమాల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఈ సినిమా కూడా చేరింది. రావే నా చెలియ అనే టైటిలే అట్రాక్టివ్‌గా ఉంది. కంటెంట్ కూడా బాగుంటుందనే అనుకుంటున్నా.. కథలో కంటెంట్ ఉంటే తప్పకుండా విజయం సాధిస్తుంది. ఎంటైర్ టీమ్‌కు నా బెస్ట్ విషస్ తెలియచేస్తున్నా అన్నారు. హీరో నెమలి అనిల్ మాట్లాడుతూ.. ఇది నా మొదటి సినిమా. మా బ్యానర్ కూడా మొదటిదే. మా నాన్న, బాబాయి ఇద్దరూ ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరించి ఎంతో నమ్మకంతో సపోర్ట్‌చేశారు. టీమ్ అందరంకూడా కష్టపడి ప్రాణంపెట్టి సినిమా చేసాము. చిన్న సినిమా అయినా మంచి సినిమా కనుక ఆదరిస్తారని ఆశిస్తున్నా అన్నారు.

నిర్వాహకుడు నెమలి సురేశ్ మాట్లాడుతూ సబ్జెక్ట్ బాగుంటే ఆడియన్స్ తప్పకుండా ఆదరిస్తారని తెలుసు.. అందుకే మంచి కథతో వస్తున్నాం.. నచ్చి తీరుతుందని భావిస్తున్నాం అన్నారు. దర్శకుడు మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ విరాజ్ వలనే ఈ సినిమా మొదలైంది. నిర్మాతలు మరియు హీరో అనిల్ కూడా నన్ను చాలా నమ్మి సపోర్ట్‌చేశారు. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయనని ఈ సందర్భంగా తెలియచేస్తున్నా.. ఈ సినిమాకు కెమెరా వర్క్ చాలా బాగావచ్చింది. డిఫరెంట్ లవ్ స్టోరీతో వస్తున్నాం ఆదరించండి అని తెలిపారు. శ్రవణ్, రవి ఎన్, విరాజ్, సుబాంగి, విజయ్ దగ్గుబాటి, ఎమ్.ఎమ్.కుమార్, కృష్ణమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెమలి అనిల్, సుబాంగి, విరాజ్, కవిత, రచ్చరవి, రోలర్ రఘు తదితరులు నటించిన చిత్రానికి సంగీతం ఎమ్.ఎమ్.కుమార్, కెమెరా విజయ్ దగ్గుబాటి, ఎడిటర్ రవి మాన్ల, నిర్మాతలు: నెమలి అనిల్, నెమలి శ్రవణ్, కథ-స్క్రీన్‌ప్లే- దర్శకత్వం: ఎన్.మహ్వేశరరెడ్డి.



విజువల్ వండర్‌గా

'రన్ రాజా రన్' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'సాహో'. ప్రస్తుతం ఈ చిత్రం యొక్క షూటింగ్ రామోజీ ఫిలిం సిటీలో జరుగుతుంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధకపూర్ కథానాయికగా నటిస్తుంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్ సన్నివేశాలతో సినిమా రూపొందుతుందట. అంతేకాకుండా ఇంతవరకు ఇండియాలో ఏ సినిమాలో కూడా ఇన్ని విజువల్ ఎఫెక్ట్స్ సన్నివేశాలతో సినిమా రూపొందుతుందట. అంతేకాకుండా ఇంతవరకు ఇండియాలో ఏ సినిమాలో కూడా ఇన్ని విజువల్స్ ఎఫెక్ట్స్ సన్నివేశాలు లేవని చెబుతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్ నేపథ్యంలో హాలీవుడ్ రేంజ్‌లో సుజీత్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నాడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శంకర్ ఎహసాన్ లాయ్ సంగీతం అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఇక ప్రభాస్ ఈ చిత్రంతోపాటు జిల్-ఫేమ్ రాధాకృష్ణ దర్శకత్వంలో తన 20వ చిత్రంలో నటిస్తున్నాడు. లవ్ స్టోరీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం కూడా ఈ ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

త్రివిక్రమ్‌తో వెంకీ!

గత ఏడాది ఒక్క సినిమా కూడా చేయని వెంకీ.. ఆ గ్యాప్‌ను కవర్ చేసేందుకు వెంకీ వరుసగా సినిమాలు చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నాడు. అందులో భాగంగా 'జై లవకుశ' ఫేమ్ బాబీ దర్శకత్వంలో యువ హీరో నాగచైతన్యతో కలిసి మల్టీస్టారర్ చిత్రంలో నటించనున్నాడు వెంకీ. 'వెంకీ మామ' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌మీదకు వెళ్లనుంది. ఇక ఈ చిత్రం తరువాత వెంకీ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌తో సినిమా చేయనున్నాడు. ఇక ఇదిలా ఉంటే అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకీ, వరుణ్‌తేజ్ కలిసి నటించిన తాజా చిత్రం 'ఎఫ్-2' ఈనెల 12న విడుదల కానుంది. ఔట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక నిర్మాత దిల్‌రాజుకి కూడా ఈ చిత్ర విజయం చాలా కీలకం కానుంది.



ఫన్నంతా మనదే..

విక్టరీ వెంకటేశ్, మెగా ప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్స్‌గా శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాణంలో రూపొందుతోన్న చిత్రం 'ఎఫ్ 2', ఫన్ అండ్ ఫ్రస్టేషన్ ట్యాగ్‌లైన్. అనీల్ రావిపూడి దర్శకుడు. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ సాధారణంగా పండగలకు వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ సంక్రాంతికి ఎఫ్2.. సంక్రాంతి అల్లుళ్ళుగా వస్తున్నాం. కథ, దర్శకుడిని నమ్మి సినిమా చేశాను. దృశ్యం, గురు సినిమాల తర్వాత చేసిన సినిమా ఇది. దిల్‌రాజుతో మంచి అనుబంధం ఉంది. వరుణ్‌తేజ్, రాజేంద్రప్రసాద్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది అన్నారు.

వరుణ్‌తేజ్ మాట్లాడుతూ ఫస్ట్‌టైమ్ ఓ మాస్ క్యారెక్టర్ చేశాను. కామెడీ క్యారెక్టర్. ఎంటైర్ టీమ్ కారణంగా సినిమా చాలా త్వరగా పూర్తయ్యింది. ఈ సినిమాతో అనీల్ లాంటి మంచి ఫ్రెండ్ దొరికినందుకు ఆనందంగా ఉంది. దిల్‌రాజు, లక్ష్మణ్‌తో ఈ బ్యానర్‌లో పనిచేయడం ఆనందంగా ఉంది. రాజేంద్రప్రసాద్‌గారితో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. వెంకటేష్‌గారితో సినిమా చేయాలంటే ఎక్కడో చిన్న భయం ఉండేది. కానీ ఆయన మాతో చాలా కంఫర్ట్‌గా ఉన్నారు. ఈ సినిమాలో మా ఇద్దరి బ్రోమాన్స్ అద్భుతంగా ఉండబోతోంది. ప్రేక్షకులు సీట్లో కుదురుగా కూర్చొని సినిమా చూడలేకుండా నవ్వుతూనే ఉంటారు అన్నారు.

తమన్నా మాట్లాడుతూ- కొన్ని సినిమాలు మైలురాళ్లలా అలా నిలిచిపోతాయి. నాకు ఈ సినిమా అలాంటిది. ఊపిరి తర్వాత నేను డబ్బింగ్ చెప్పుకున్నాను. చాలా షేడ్స్ ఉండే పాత్ర. ఎఫ్3 చేస్తే బావుంటుంది అనుకుంటున్నాను.

అనీల్ రావిపూడి మాట్లాడుతూ- ఎఫ్2 సినిమా రేపు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతుంది. సినిమాని 80 శాతం కామెడీతోనే నింపేశాం. టైమింగ్ వున్న గొప్ప నటులు ఈ సినిమాలో చేశారు. వెంకటేష్-తమన్నా మధ్య వుండే కెమిస్ట్రీ, కామెడీని ప్రేక్షకులు బాగా ఆస్వాదిస్తారు. వరుణ్ తెంలగాణ యాసతో ఆకట్టుకుంటాడు అన్నారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ- ఓ సినిమా సిద్ధం అవ్వడానికి 24 క్రాఫ్ట్స్ కష్టం ఉండాల్సిందే. ఈ సినిమాకి మేమంతా అలానే కష్టపడ్డాం. ఆయనతో రెండోసారి పనిచేసే అవకాశం దక్కింది. కథ విన్న వెంటనే నా పాత్ర ఏంటి అని అడక్కుండా ఒప్పుకున్నాడు వరుణ్.

పూర్తి స్క్రిప్టు లేకుండా సినిమా తీయడానికి నేను ఒప్పుకోను. అలాంటి నన్ను అనీల్ కేవలం సన్నివేశాలు చెప్పి ఒప్పించేస్తాడు అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మెహరీన్, రాజేంద్రప్రసాద్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే 14న దేవ్



కార్తి హీరోగా నటిస్తున్న దేవ్ సినిమా విడుదల తేదీ ఖరారైంది. వాలెంటైన్స్ డే కనుకగా ఫిబ్రవరి 14న విడుదల కానుంది దేవ్. ఈ సందర్భంగా చిత్ర ఆడియో విడుదల జనవరి 14వ తేదీన కన్‌ఫర్మ్ చేశారు దర్శక నిర్మాతలు. హారిస్ జయరాజ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పాటలకు అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాను రజత్ రవిశంకర్ తెరకెక్కిస్తున్నారు. ఖాకి లాంటి సూపర్‌హిట్ సినిమా తర్వాత కార్తి సరసన రెండోసారి రకుల్ ప్రీత్‌సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రెండో హీరోయిన్‌గా నిక్కీ గర్లానీ నటిస్తున్నారు. ఆర్ వేల్‌రాజ్ సినిమాటోగ్రఫి అందిస్తున్నారు. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు.



మార్చి 1న 118

నా నువ్వే తర్వాత కళ్యాణ్ రామ్ నటిస్తున్న తాజా చిత్రం 118. టీజర్ ఇటీవల విడుదలై సినిమాపై అంచనాలను తీసుకురాగలిగింది. సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మార్చి 1న విడుదల కానుంది. అర్జున్‌రెడ్డి ఫేం శాలిని పాండే, నివేద థామస్ కథానాయికలుగా నటిస్తున్న చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ గుహన్ దర్శకుడిగా మారి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్.ఎస్ కోనేరు నిర్మిస్తున్నారు. కళ్యాణ్‌రామ్ ఈ చిత్రంలో ఒక కొత్త స్టైల్‌లో కనిపించనున్నారు.

గ్రౌండ్‌లోకి.. జెర్సీ

నాచురల్ స్టార్ నాని నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా 'జెర్సీ' చిత్ర టీజర్ త్వరలోనే రానుంది. నాని మొదటిసారిగా క్రికెటర్‌గా నటిస్తుండడంతో ఆ లుక్‌లో ఎలా వుంటాడో చూడాలనుకుంటున్నారు. ఇక ఈ చిత్ర టీజర్‌ను సంక్రాంతి కానుకగా రేపు విడుదల చేయనున్నారు. 'మళ్లీ రావా' ఫేం గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాని సరసన కన్నడ హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తోంది. క్రికెట్ నేపథ్యంలో వస్తున్న చిత్రం కావడంతో ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోంది. రంజీ క్రికెటర్ లైఫ్ స్టోరీని బేస్ చేసుకొని తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ ఏడాది ఏప్రిల్ 19న విడుదల కానుంది.



జోరు తగ్గలే..

లేడీ సూపర్‌స్టార్ నయనతార క్రేజ్ ఇంకా కొనసాగుతోంది. హీరోల కాంబినేషన్‌లోనే కాకుండా ఆమె లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తోంది. ఈ రెండింటిలో తన ఆధిక్యతను కొనసాగిస్తోంది. అత్యధిక పారితోషికం తీసుకునే లేడీ స్టార్‌గా తన స్థానాన్ని పదిలపరుచుకుంటోంది. నయనతార ప్రధాన పాత్రధారిణిగా నటించిన సినిమాలు తెలుగులోకూడా వచ్చాయి. ఇవన్నీ మంచి విజయాన్ని నమోదుచేశాయి. దాంతో ఆమె సినిమాలకు మంచి బిజినెస్ జరుగుతోంది. తాజాగా ఐరా అనే తమిళ సినిమాచేస్తోంది. ఇప్పటికే తెలుగు హక్కులను అమ్మేశారని తెలిసింది. ఇది హారర్ చిత్రమని ఇటీవల విడుదల చేసిన టీజర్ ద్వారా వెల్లడైంది. నయనతార రెండు పాత్రల్లో కనిపిస్తుందని సమాచారం. అమాయకురాలు, చలాకీతనం ఉండే యువతిగా ఆమె నటిస్తోందని అంటున్నారు. ఈ చిత్రానికి కె.ఎం.సర్జున్ దర్శకత్వం వహిస్తున్నారు.

